www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 26-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 191 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: దశమి తె. 5.24 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 9.46 తదుపరి మఖ; వర్జ్యం: రా. 11.05-12.51; దుర్ముహూర్తం: ఉ. 6.15-7.46; అమృతఘడియలు: ఉ. 8.01-9.46; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పిన్ టెస్ట్‌లో మనోళ్లు ఫెయిల్

భారత్ తొలి ఇన్నింగ్స్ 156 ఆలౌట్ ● శాంట్నర్‌కు ఏడు వికెట్లు


శాంట్నర్ (7/53)

3 భారత్‌పై కివీస్ తరపున మూడో ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన (7/53) చేసిన శాంట్నర్. ఎజాజ్ (10/119), హ్యాడ్లీ (7/23) ముందున్నారు.

2 భారత గడ్డపై 300+ ఆధిక్యం సాధించడం కివీస్‌కిది రెండోసారి. 2010లో 327 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

ప్చ్.. ఏం మారలేదు. బౌలింగ్‌లో అదరగొట్టారనే సంతోషాన్ని భారత బ్యాటర్లు ఆవిరి చేశారు. ఆడుతోంది స్వదేశంలోనా.. పరాయి గడ్డపైనా అన్నట్టు స్పిన్‌కు దాసోహమయ్యారు. అటు భారత పిచ్‌లపై ఎలా బౌలింగ్ చేయాలో పక్కా ప్రణాళికలతో బరిలోకి దిగిన కివీస్ గొప్ప విజయం దిశగా సాగుతోంది. స్టార్లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌ను స్పిన్నర్ శాంట్నర్ ఏడు వికెట్లతో వెన్ను విరవగా.. ఫిలిప్స్ రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత కివీస్ బ్యాటర్లు ఎప్పటిలాగే రాణించి భారీ లక్ష్యాన్ని నిర్దేశించే ప్రయత్నంలో పడ్డారు. దీంతో భారత్‌కు ఈ టెస్టులో కూడా ఓటమి ఖాయంగా కనిపిస్తోంది.


● కివీస్ రెండో ఇన్నింగ్స్ 198/5
● ప్రస్తుత ఆధిక్యం 301
పంత్ (18) క్లీన్‌బౌల్డ్

పుణె: స్వదేశంలో అడుగుపెట్టిన ప్రతీ జట్టును వేటాడటమే తప్ప.. ప్రత్యర్థి ఉచ్చులో టీమిండియా పడిందే లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి రివర్స్‌లా కనిపిస్తోంది. రెండో టెస్టులోనూ పర్యాటక న్యూజిలాండ్ స్పష్టమైన ఆధిపత్యం చూపుతోంది. ఇప్పటికే తొలి టెస్టును దక్కించుకున్న ఈ జట్టు ఇప్పుడు ఏకంగా సిరీస్ కోసం ఉవ్విళ్లూరుతోంది. జరిగింది రెండు రోజుల ఆటే అయినా కివీస్ ప్రస్తుతానికి 301 పరుగుల ఆధిక్యంలో ఉండడం విశేషం. శుక్రవారం ఆట ముగిసేసరికి ఈ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 5 వికెట్లకు 198 పరుగులు చేసింది. క్రీజులో బ్లండెల్ (30), ఫిలిప్స్ (9) ఉన్నారు. కెప్టెన్ లాథమ్ (86) అర్ధసెంచరీ సాధించాడు. స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కు 4 వికెట్లు దక్కాయి. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 45.3 ఓవర్లలో 156 రన్స్‌కే కుప్పకూలింది. జడేజా (38), జైస్వాల్ (30), గిల్ (30) మాత్రమే రాణించారు. కెరీర్‌లో తొలిసారి శాంట్నర్ (7/53) ఐదు వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. మరో మూడ్రోజుల ఆట ఉండడంతో మ్యాచ్ ఫలితం రావడం ఖాయమే. శనివారం కివీస్ సాధ్యమైనంత వేగంగా ఆడి మరో 50-100 రన్స్ జత చేసే చాన్సుంది. అదే జరిగితే నాలుగో ఇన్నింగ్స్‌లో భారత్ కష్టసాధ్యమైన ఛేదనకు బరిలోకి దిగాల్సి ఉంటుంది.

ఇదేం బ్యాటింగ్..?: తొలిరోజు చివర్లోనే బ్యాటింగ్‌కు దిగిన రోహిత్‌సేనకు క్రీజులో కాస్త కుదురుకోవాలన్న ఆలోచనే లేకుండా పోయింది. టర్నింగ్ పిచ్‌పై ఆడడం తెలియదన్నట్టుగా మనోళ్లు పేలవ షాట్లతో పెవిలియన్ చేరారు. ఫలితంగా తొలి సెషన్‌లోనే జట్టు మరో 6వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ స్కోరు 16/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత జట్టులో ఆరంభంలో జైస్వాల్, గిల్ కివీస్ బౌలర్లను ఓపిగ్గా ఎదుర్కొన్నారు. జైస్వాల్ భారీషాట్లకు ప్రయత్నించినా.. గిల్ సాధికారిక షాట్లతో పైచేయి సాధించాడు. వీలు కుదిరినప్పుడల్లా బౌండరీలతో ఒత్తిడి పెంచాడు. అయితే వికెట్ నుంచి సహకారం అందుకున్న శాంట్నర్ మొదట గిల్‌తో తన వేట మొదలుపెట్టాడు. అతను కచ్చితమైన లెంగ్త్‌తో వేసిన బంతి ప్యాడ్లను తాకడంతో గిల్ ఎల్బీగా వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 49 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఓవర్‌లోనే లో-ఫుల్ టాస్ బంతిని స్వీప్ ఆడబోయిన విరాట్ కోహ్లీ (1)ని సైతం శాంట్నర్ బౌల్డ్ చేశాడు. మరో ఎండ్‌లో స్పిన్నర్ ఫిలిప్స్ కూడా ప్రభావం చూపుతూ జైస్వాల్, రిషబ్ పంత్ (18)లను అవుట్ చేసి జట్టును మరింత ఒత్తిడిలోకి నెట్టాడు. ఆదుకుంటాడనుకున్న సర్ఫరాజ్ (11) తక్కువ స్కోరుకే అవుటవడంతో 95/6 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. ఇక లంచ్ బ్రేక్ తర్వాత జట్టు 7.3 ఓవర్లు మాత్రమే ఆడి మిగతా వికెట్లను కోల్పోయింది. అయితే జడేజా భారీషాట్లతో ఆకట్టుకున్నాడు. కానీ శాంట్నర్ ఒకే ఓవర్‌లో జడ్డూతో పాటు ఆకాశ్ దీప్ (6)ను అవుట్ చేశాడు. చివర్లో సుందర్ (18 నాటౌట్).. ఎజాజ్ ఓవర్‌లో 4,6,4తో కాస్త జోష్ తెచ్చాడు. కానీ, తర్వాతి ఓవర్‌లోనే బుమ్రాను శాంట్నర్ డకౌట్ చేయడంతో భారత్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.


కోహ్లీ (1)

రాణించిన లాథమ్: 103 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్ దాదాపు రెండు సెషన్లపాటు ఆత్మవిశ్వాసంతో ఆడింది. ఓవర్‌కు నాలుగు పరుగుల రన్‌రేట్‌తో భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. స్పిన్నర్ సుందర్ మాత్రం మరో నాలుగు వికెట్లతో దెబ్బతీసే ప్రయత్నం చేశాడు. ఈ సిరీస్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న కివీస్ కెప్టెన్ లాథమ్ ఈసారి సత్తా చాటాడు. భారత్ స్పిన్నర్లతోనే బౌలింగ్ మొదలెట్టినా.. ఓపెనర్లు ఎలాంటి ఇబ్బందిపడలేదు. లాథమ్ చక్కటి స్వీప్‌షాట్లతో ఆకట్టుకున్నాడు. మొత్తంగా రెండో సెషన్‌లో కాన్వే (17)ను సుందర్ అవుట్ చేయగా, విల్ యంగ్ (23)ను అశ్విన్ వెనక్కిపంపాడు. అలాగే చివరి సెషన్ ఆరంభంలోనే కీలక రచిన్ రవీంద్ర (9)ను సైతం సుందర్ అవుట్ చేసి భారత్‌కు ఊరటనిచ్చాడు. అయితే డారిల్ మిచెల్ (18), బ్లండెల్, కెప్టెన్ లాథమ్‌కు సహకారం అందించారు. దీంతో కివీస్ ఆధిక్యం మరింత పెరిగింది. శతకం వైపు సాగుతున్న లాథమ్ 45వ ఓవర్‌లో స్వీప్ షాట్‌కు వెళ్లి సుందర్‌కు చిక్కాడు. దీంతో ఐదో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259;

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 30; రోహిత్ (బి) సౌథీ 0; గిల్ (ఎల్బీ) శాంట్నర్ 30; విరాట్ (బి) శాంట్నర్ 1; పంత్ (బి) ఫిలిప్స్ 18; సర్ఫరాజ్ (సి) ఓరోక్ (బి) శాంట్నర్ 11; జడేజా (ఎల్బీ) శాంట్నర్ 38; అశ్విన్ (ఎల్బీ) శాంట్నర్ 4; సుందర్ (నాటౌట్) 18; ఆకాశ్ (బి) శాంట్నర్ 6; బుమ్రా (ఎల్బీ) శాంట్నర్ 0; **ఎక్స్‌ట్రాలు: 0. మొత్తం: 45.3 ఓవర్లలో 156 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-1, 2-50, 3-56, 4-70, 5-83, 6-95, 7-103, 8-136, 9-142, 10-156. **బౌలింగ్:** సౌథీ 6-1-18-1; ఓరోక్ 3-2-5-0; ఎజాజ్ 11-1-54-0; శాంట్నర్ 19.3-1-53-7; ఫిలిప్స్ 6-0-26-2.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లండెల్ (బ్యాటింగ్) 30; ఫిలిప్స్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 53 ఓవర్లలో 198/5. వికెట్ల పతనం:** 1-36, 2-78, 3-89, 4-123, 5-183. **బౌలింగ్:** అశ్విన్ 17-1-64-1; సుందర్ 19-0-56-4; జడేజా 11-1-50-0; బుమ్రా 6-1-25-0.

టెస్ట్ జట్టులో నితీశ్ కుమార్



ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక
హర్షిత్ రాణాకు చోటు
షమి, అక్షర్‌లకు నిరాశ

ఆసీస్ టూర్‌కు జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా (వైస్ కెప్టెన్), జైస్వాల్, ఈశ్వరన్, గిల్, కోహ్లీ, కేఎల్ రాహుల్, పంత్ (కీపర్), సర్ఫరాజ్, జురెల్ (కీపర్), అశ్విన్, జడేజా, సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, సుందర్. **రిజర్వ్:** సైనీ, ముకేశ్ కుమార్, ఖలీల్ అహ్మద్.

న్యూఢిల్లీ: అదిరే బ్యాటింగ్‌తో టీమిండియా టీ20 జట్టులో తన స్థానానికి పూర్తిగా న్యాయం చేసిన తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిపై సెలెక్టర్లకు పూర్తిగా గురి కుదిరినట్టుంది. ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌కు శుక్రవారం ప్రకటించిన జట్టుకు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ నితీశ్‌ను ఎంపిక చేశారు. నితీశ్‌తోపాటు పేసర్ హర్షిత్ రాణాకు తొలిసారి టెస్ట్ జట్టులో చోటు కల్పించింది. 18 మంది సభ్యుల జట్టుకు రోహిత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. స్టార్ పేసర్ బుమ్రాను వైస్-కెప్టెన్‌గా నియమించింది. దేశవాళీ పోటీల్లో పరుగుల వరద పారిస్తున్న బెంగాల్ బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్‌కు మూడో ఓపెనర్‌గా స్థానం లభించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ నవంబరు 22న పెర్త్‌లో జరిగే తొలి టెస్ట్‌తో ప్రారంభం కానుంది.

షమికి దక్కని స్థానం: సీనియర్ పేసర్ మహ్మద్ షమికి జట్టులో చోటు దక్కలేదు. ఈ ఏడాది ఆరంభంలో పాదం గాయానికి ఆపరేషన్ చేయించుకున్న షమి..తాను ఫిట్‌గానే ఉన్నానని ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. పేసర్ ఆకాశ్‌దీప్ సింగ్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బుమ్రా, సిరాజ్‌తో కలిసి అతడు పేస్ బౌలింగ్ భారాన్ని మోయనున్నాడు. గాయం నుంచి కోలుకోవడంతో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ జట్టులో పునరాగమనం చేశాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ గజ్జల్లో గాయం కారణంగా ఎంపికకు అందుబాటులో లేడని బీసీసీఐ తెలిపింది. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ అద్భుతంగా రాణిస్తున్న స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కూ చోటు దక్కింది. ఫలితంగా మరో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌పై వేటు పడింది.

టీ20 జట్టులో రమణ్‌దీప్, వైశాఖ్

సౌతాఫ్రికాతో జరిగే నాలుగు టీ20లకూ టీమిండియాను ప్రకటించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ రమణ్‌దీప్ సింగ్, కర్ణాటక పేసర్ వైశాఖ్ విజయ్ కుమార్‌లకు తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. అలాగే గాయంతో యువ పేసర్ మయాంక్ యాదవ్‌నూ ఎంపిక చేయలేదు. 15మంది జట్టుకు సూర్యకుమార్ నాయకత్వం వహిస్తాడు. నవంబరు 8న డర్బన్‌తో మ్యాచ్‌తో సిరీస్ మొదలు కానుంది.

సఫారీ టూర్‌కు టీ 20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శాంసన్ (కీపర్), రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ (కీపర్), హార్దిక్, అక్షర్, రమణ్‌దీప్, వరుణ్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, వైశాఖ్ విజయ్‌కుమార్, అవేశ్, యశ్ దయాల్.


రమణ్‌దీప్

పట్టుబిగించిన పాక్

రావల్పిండి: ఇంగ్లండ్‌తో మూడో, ఆఖరి టెస్ట్‌లో పాకిస్థాన్ జట్టు పట్టు బిగించింది. 77 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లండ్ జట్టు శుక్రవారం ఆఖరికి 24 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 73/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ 344 పరుగులకు ఆలౌటైంది. సాద్ షకీల్ (134) శతకంతో కదం తొక్కాడు. స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (48), నోమన్ అలీ (45) బ్యాటింగ్‌లోనూ సత్తా చాటారు. తొమ్మిదో వికెట్‌కు వీరిద్దరూ 72 రన్స్ జోడించారు. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 267 పరుగులు చేసింది.

భారత కుర్రాళ్లకు షాక్

ఫైనల్లో అఫ్ఘానిస్థాన్
ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్

అల్ అమెరాత్ (ఒమన్): హ్యాట్రిక్ విజయాలతో ఉన్న భారత్ 'ఎ' జట్టుకు ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీలో గట్టి ఝలక్ తగిలింది. ఐపీఎల్ స్టార్లతో కూడిన ఈ జట్టు సునాయాసంగా ఫైనల్ చేరుతుందనుకున్న వేళ.. అనూహ్యంగా అఫ్ఘానిస్థాన్ 'ఎ' జట్టు చేతిలో భంగపడింది. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో తిలక్ వర్మ సేన 20 పరుగులతో ఓటమి పాలైంది. దీంతో అఫ్ఘాన్ 'ఎ' తొలిసారి ఫైనల్‌కు చేరింది. ముందుగా అఫ్ఘాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 రన్స్ చేసింది. ఓపెనర్లు సెదికుల్లా అతల్ (83), జుబైద్ అక్బరి (64), కరీమ్ జనత్ (41) అదరగొట్టారు. రసిఖ్ సలామ్‌కు 3 వికెట్లు దక్కాయి. భారీ ఛేదనలో భారత్ 'ఎ' 20 ఓవర్లలో 186/7 స్కోరుకే పరిమితమైంది. రమణ్‌దీప్ (64), బదోని (31), నిశాంత్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. గజన్‌ఫర్, అబ్దుల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆదివారం జరిగే ఫైనల్లో శ్రీలంక 'ఎ'తో అఫ్ఘాన్ తలపడనుంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ పాకిస్థాన్ 'ఎ'పై శ్రీలంక 'ఎ' 7 వికెట్లతో నెగ్గింది.

ప్చ్.. హాకీలో ఫైనల్ మిస్

జొహార్ (మలేసియా): భారత జట్టు సుల్తాన్ జొహార్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో ఫైనల్ చేరడంలో విఫలమైంది. శుక్రవారం న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి లీగ్ పోరును మనోళ్లు 3-3తో డ్రా చేశారు. టోర్నీలో 5 మ్యాచుల్లో 3 గెలిచి, ఒకటి ఓడి, మరొకటి డ్రా చేసిన భారత్ 10 పాయింట్లతో నిలిచింది. ఇక తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా 9-3తో మలేసియాను, బ్రిటన్ 3-1తో జపాన్‌ను ఓడించాయి. దాంతో భారత్, ఆసీస్, బ్రిటన్ పదేసి పాయింట్లతో నిలిచాయి. అయితే మెరుగైన గోల్స్ భేదంతో తొలి రెండు స్థానాలు సాధించిన ఆసీస్, బ్రిటన్ శనివారం జరిగే ఫైనల్‌కు అర్హత సాధించాయి. మూడో స్థానంకోసం న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది.

రషీద్‌కు ఆంధ్ర రంజీ పగ్గాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర రంజీ జట్టుకు కొత్త సారథిగా 21 ఏళ్ల యువ బ్యాటర్ షేక్ రషీద్ నియమితుడయ్యాడు. పిన్న వయసులో ఆంధ్ర రంజీ సారథ్య బాధ్యతలు అందుకున్న క్రికెటర్ రషీదే. కాగా ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ మధ్య శనివారం మొదలయ్యే రంజీ మ్యాచ్‌కు ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది.

తలైవాస్‌కు పట్నా ఝలక్

హైదరాబాద్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో రెండు వరుస విజయాలతో జోరుమీదున్న తమిళ్ తలైవాస్‌కు ఝలక్ తగిలింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42-40తో తలైవాస్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 36-22తో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేసింది.

బిజినెస్

2024 ఆర్థిక సంవత్సరంలో సత్య నాదెళ్లకు రూ.665 కోట్ల పారితోషికం

2023తో పోలిస్తే 63 శాతం అధికం



కాలిఫోర్నియా: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజ కంపెనీ మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ అయిన తెలుగు తేజం సత్య నాదెళ్ల.. 2024 జూన్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం 7.91 కోట్ల డాలర్ల (రూ.665.15 కోట్లు) భారీ పారితోషికాన్ని అందుకున్నారు. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ)కి మైక్రోసాఫ్ట్ ఈ విషయాన్ని గురువారం వెల్లడించింది. నాదెళ్ల వార్షిక ప్యాకేజీ 2023 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 63 శాతం పెరిగింది. అంతేకాదు, 2014లో మైక్రోసాఫ్ట్ సారథిగా పగ్గాలు చేపట్టిన తర్వాత కాలంలో నాదెళ్ల అందుకున్న అత్యధిక పారితోషికమిదే. 2014 ఆర్థిక సంవత్సరంలో ఆయనకు 8.4 కోట్ల డాలర్ల ప్యాకేజీ లభించింది.

90 శాతం స్టాక్స్ కేటాయింపులే..

ఈ ఏడాది పారితోషికంలో నాదెళ్ల వేతన రూపంలో అందుకోనున్నది కేవలం 25 లక్షల డాలర్లే. కాగా, కంపెనీ షేర్ల రూపంలో లభించిన వాటానే 90 శాతం (7.1 కోట్ల డాలర్లు)గా ఉంది. గత ఏడాదిలో లభించిన 3.9 కోట్ల డాలర్ల స్టాక్స్ పోలిస్తే, ఈ ఏడాది కేటాయింపులు దాదాపు రెట్టింపయ్యాయి. నాదెళ్ల సారథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో కంపెనీ పురోగతి, చాట్‌జీపీటీని రూపొందించిన ఓపెన్‌ఏఐలో పెట్టుబడులు మార్కెట్లో మైక్రోసాఫ్ట్ స్థానాన్ని మరింత బలోపేతం చేశాయి. దాంతో నాదెళ్లకు స్టాక్స్ రూపంలో ప్రోత్సాహకాలూ భారీగా పెరిగాయి. ఈ మధ్యనే మైక్రోసాఫ్ట్‌లో సైబర్ భద్రత సమస్యలు తలెత్తాయి. అందుకు బాధ్యత వహిస్తూ నాదెళ్ల తన నగదు ప్రోత్సాహకాలను సగానికి (1.06 కోట్ల డాలర్ల నుంచి 52 లక్షల డాలర్లకు) తగ్గించుకున్నారు. అయినప్పటికీ, ఆయన వార్షిక పారితోషికం భారీగా పెరగడం గమనార్హం.



బీ న్యూలో దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ సంస్థ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ దీపావళి పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గడిచిన పదేళ్లుగా 70 లక్షల కంటే ఎక్కువ మొబైల్ వినియోగదారుల అభిమానం, ఆదరణ చూరగొన్న బీ న్యూ మొబైల్స్. దీపావళి సందర్భంగా మొబైల్స్ సహా గృహోపకరణాలపై అద్భుతమైన ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చిందని సంస్థ సీఈఓ వై సాయి నిఖిలేష్ తెలిపారు. ఎంఐ, వివో, ఒప్పో, రియల్‌మీ, ఐఫోన్, ఐటెల్, సామ్‌సంగ్ మొబైల్స్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతిని అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే లక్కీ డ్రాలో కారు, బైక్, రూ.10 లక్షల నగదు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ల్యాప్‌టాప్‌లపై రూ.10,000, టీవీలపై రూ.7,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను ఆఫర్ చేస్తున్నట్లు నిఖిలేష్ తెలిపారు. యాక్సెసరీస్‌పై 80 శాతం వరకు డిస్కౌంట్ సహా ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50 శాతం వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు చెప్పారు. ఐఫోన్ కొనుగోలుపై భారీ డిస్కౌంట్‌తో పాటు రూ.5,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా ఆధార్ కార్డు, పాన్‌కార్డులతో బజాజ్ ఫిన్‌సర్వ్ ద్వారా మొబైల్, టీవీ, ల్యాప్‌టాప్స్‌ను జీరో డౌన్ పేమెంట్, జీరో వడ్డీతో కొనుగోలు చేయవచ్చన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 150కి పైగా బీ న్యూ షోరూమ్స్‌ల్లో దీపావళి ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయని నిఖిలేష్ వెల్లడించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,580 ▲	72,950 ▲	1,07,000 ▼
ముంబై	78,015 ▼	71,462 ▼	95,800 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	120
వరంగల్	115	గుంటూరు	120
కరీంనగర్	115	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	126
కర్నూలు	115	నెల్లూరు	126
విశాఖపట్నం	105	అనంతపురం	126
గోదావరి	120		

రూ.6.80 లక్షల కోట్లు ఆవిరి

వరుసగా ఐదో రోజూ నష్టాల్లో మార్కెట్

సెన్సెక్స్ మరో 663 పాయింట్లు పతనం

80,000 కీలక స్థాయిని కోల్పోయిన సూచీ

24,200 దిగువకు పడిపోయిన నిఫ్టీ



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టపోయాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 927 పాయింట్లకు పైగా క్షీణించింది. చివరికి 662.87 పాయింట్ల నష్టంతో 79,402.29 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 80,000 కీలక స్థాయిని చేజార్చుకుంది. నిఫ్టీ సైతం 218.60 పాయింట్లు కోల్పోయి 24,180.80 వద్ద ముగిసింది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడటం ఇందుకు ప్రధాన కారణం. అలాగే, ఎనర్జీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో భారీ నష్టాలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతుండటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. అమ్మకాల హోరులో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6.80 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.436.98 లక్షల కోట్లకు (5.20 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఈ వారంలో సెన్సెక్స్ 1,822.46 పాయింట్లు (2.24 శాతం), నిఫ్టీ 673.25 పాయింట్లు (2.70 శాతం) క్షీణించాయి. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది నాలుగో వారం. ఈ నెలలో ఇప్పటివరకు సూచీలు 6.5 శాతం నష్టపోయాయి. కొవిడ్ సంక్షోభం తర్వాత మార్కెట్‌కు ఇదే అత్యంత గడ్డు నెల. కాగా ముందు సూచీలు మరింత పతనమయ్యే అవకాశాలు ఉన్నాయని ఈక్విటీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

మార్కెట్ విశ్లేషకులకు సెబీ చెక్

నిబంధనలు కఠినం చేస్తూ ఆదేశాలు

టీవీ చానల్స్, పత్రికల్లో స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై సలహాలు, సూచనలు ఇచ్చే రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ), ప్రాక్సీ అడ్వైజర్ల (పీఏ)కు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చెక్ పెడుతోంది. ఇక ఎవరు పడితే వారు ఈ అవతారాలు ఎత్తేందుకు వీల్లేదు. సెబీ వద్ద నమోదైన రీసెర్చ్ అనలిస్టులు, ప్రాక్సీ అడ్వైజర్లు మాత్రమే ఇక సలహాలు, సూచనలు ఇవ్వాలి. పైగా వారు ప్రతి నెల, ఆరు నెలలకు ఒకసారి నిర్ణీత ఫార్మాట్‌లో తమ పూర్తి వివరాలను సెబీ, రీసెర్చ్ అనలిస్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీల (ఆర్ఏఏఎస్‌బీ)కు సమర్పించాలి. ప్రతి ఏడాది మార్చి 31, సెప్టెంబరు 30తో ముగిసే ప్రతి ఆరు నెలలకు ఈ నిర్ణీత ఫార్మాట్ సమర్పించాలి. ఆ తర్వాత కూడా ప్రతి నెలా తమ వివరాలు సమర్పించాలని సెబీ స్పష్టం చేసింది.

ఫార్మాట్‌లో అన్నివివరాలు: తమ రిజిస్ట్రేషన్ నంబర్, అధికారిక వెబ్‌సైట్ అడ్రస్, తమ సోషల్ మీడియా వ్యవహారాలు చూసే వ్యక్తుల వివరాలు, జారీ చేసిన ప్రకటనలు, ఖాతాదారుల నుంచి ఫీజు వసూలు చేసేందుకు ఉపయోగిస్తున్న బ్యాంకు ఖాతాల వివరాలు, డైరెక్టర్లు, భాగస్వాములు, వారి వాటాలు, తమపై వచ్చిన ఫిర్యాదుల వంటి విషయాలు అన్నిటిని పేర్కొనాలి.

రూ. 20 లక్షల వరకు ముద్రా రుణాలు

పాత రుణాలు చెల్లించిన వారికే

న్యూఢిల్లీ: ముద్రా రుణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రుణాల పరిమితిని ప్రస్తుత రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ముద్రా రుణాలు తీసుకుని వాటిని సక్రమంగా చెల్లించిన వారికి మాత్రమే 'తరుణ్ ప్లస్' పేరుతో ఈ రుణాలు మంజూరు చేస్తారు. దీంతో చిన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని భావిస్తున్నారు. ముద్రా రుణాల గరిష్ఠ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచబోతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది జూలైలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ప్రకటించిన సంగతి తెలిసిందే. పెంచిన ఈ రుణాల చెల్లింపునకు మైక్రో యూనిట్స్ పరపతి హామీ నిధి (సీజీఎఫ్ఎంయూ) ప్రభుత్వం హామీ ఇస్తుంది.

● ఆంధ్రప్రదేశ్‌లో 10 నిమిషాల వ్యవధిలోనే ఉత్పత్తుల డెలివరీ సేవలను ప్రారంభించినట్లు బిగ్‌బాస్కెట్ ప్రకటించింది. దీపావళి పండగను పురస్కరించుకుని వినియోగదారులకు అత్యుత్తమ సేవలందించాలనే ఉద్దేశంతో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. అంతేకాకుండా ద్వితీయ శ్రేణి పట్టణాలు, నగరాల్లో క్విక్ కామర్స్ సేవలు విస్తరించే అవకాశం లభిస్తుందని తెలిపింది.

● బంధన్ బ్యాంక్ లాభం సెప్టెంబరు త్రైమాసికంలో 30 శాతం పెరిగి రూ.937 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.721 కోట్లు. నిర్వహణాపరమైన లాభం 17 శాతం వృద్ధితో రూ.1,855 కోట్లకు పెరిగింది.

నిట్టనిలువుగా పైకి ఎగిరే విమానం

ఆవిష్కరించిన బ్లూజే ఏరో
2026 నాటికి వాణిజ్య పరంగా అందుబాటులోకి
తొలుత సరుకు రవాణా కోసమే..
రెండేళ్ల తర్వాత ప్యాసింజర్ ప్రొటోటైప్ ఫ్లైట్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బ్లూజే ఏరో స్పేస్.. వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (వీటీఓఎల్) విమానాన్ని తయారు చేసింది. శుక్రవారం నాడిక్కడ నాదర్‌గుల్ ఎయిర్‌ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రొటోటైప్ వీటీఓఎల్‌ను ప్రదర్శించింది. భారత్‌లో ఈ తరహా విమానాన్ని రూపొందించటం ఇదే మొదటిసారని బ్లూజే ఏరోస్పేస్ కో ఫౌండర్, సీఈఓ మారుతి అమర్‌దీప్ శ్రీ వత్సవాయ, మరో కో ఫౌండర్, సీటీఓ ఉత్తమ్ కుమార్ ధర్మపురి తెలిపారు. నిట్టనిలువునా పైకి ఎగరటమే కాకుండా అలాగే కిందకు దిగటం ఈ విమానం ప్రత్యేకత అని వారు తెలిపారు. పూర్తిగా శుద్ధ ఇంధనాలైన హైడ్రోజన్ (హెచ్2), ఎలక్ట్రిక్ (ఈ) ప్రొపెల్షన్, అటానమస్ ఫ్లైట్ టెక్నాలజీలతో ఈ విమానం నడుస్తుందని వివరించారు. పౌర విమానయానం, రక్షణ రంగాలకు ఉపయోగపడే విధంగా రీచ్ పేరుతో ఈ హెచ్2ఈవీటీఓఎల్ విమానాన్ని రూపొందించినట్లు చెప్పారు. 2026 నాటికి వాణిజ్య పరంగా ఈ విమానాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అమర్‌దీప్, ఉత్తమ్ తెలిపారు. కార్గో, ప్రయాణికుల రవాణా (ఎయిర్ ట్యాక్సీ)లో ఈ విమానం కీలకంగా మారుతుందన్నారు. అలాగే రక్షణ రంగం కోసం అత్యంత ఎత్తులో ఉన్న ప్రదేశాలకు సరుకులు రవాణా చేసేందుకు ప్రత్యేకమైన విమానాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వారు తెలిపారు.

లాజిస్టిక్స్ రంగం కోసం: తొలుత లాజిస్టిక్స్ విభాగం కోసం ఈ విమాన సేవలను ఉపయోగించుకోనున్నట్లు అమర్‌దీప్ వెల్లడించారు. 300 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు అవసరమైన సరుకు రవాణా సహా అత్యవసర ఉత్పత్తులను సరఫరా చేసేందుకు వీటిని ఉపయోగించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం విమాన బరువు 500 కేజీలుగా ఉండగా పేలోడ్ సామర్థ్యం 100 కిలోల వరకు ఉందని ఆయన తెలిపారు. ఒకసారి చార్జింగ్‌తో 300 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. అయితే వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకువచ్చే నాటికి పేలోడ్ సామర్థ్యాన్ని మరింతగా పెంచనున్నట్లు అమర్‌దీప్ చెప్పారు. అలాగే 2026లోనే ప్రయాణికుల రవాణా కోసం అవసరమైన ప్రొటోటైప్ విమానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. అప్పటికల్లా డీజీసీఏ నుంచి అవసరమైన అన్ని అనుమతులను పొందేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అమర్‌దీప్ చెప్పారు.

రూ.18 కోట్ల సమీకరణ: 2022లో కార్యకలాపాలు ప్రారంభించిన బ్లూజే ఏరో.. వెంచర్ క్యాపిటల్ సంస్థలైన ఎండియా పార్ట్‌నర్స్, ఐడియాస్ప్రింగ్ క్యాపిటల్, జీరోధా నేతృత్వంలోని రెయిన్‌మ్యాటర్ క్యాపిటల్ నుంచి రూ.18 కోట్ల నిధులను సమీకరించిందని ఉత్తమ్ తెలిపారు. కాగా సిరీస్ ఏ రౌండింగ్‌లో భాగంగా వచ్చే మూడేళ్లలో వివిధ ఇన్వెస్టర్ల నుంచి మరో రూ.250 కోట్ల వరకు నిధులను సమకూర్చుకోవాలని చూస్తున్నట్లు ఉత్తమ్ చెప్పారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అక్రమాల 'స్వరూపం'



విశాఖ శివారు చినముషిడివాడలో శారదా పీఠం

12

ప్రభుత్వ భూమిలో శారదా పీఠం

విశాఖలో మరో లీల వెలుగులోకి

గెడ్డను ఆక్రమించి నిర్మాణాలు

20 సెంట్లు పూడ్చి, పైన ఆలయాలు, గోపురాలు

ప్రజా స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆక్రమణను నిర్ధారించిన తహశీల్దార్

తిరుమలలో పీఠం ఆక్రమణలపై విచారణ

నలుగురితో టీటీడీ విచారణ కమిటీ

శనివారం | 26-10-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

| విజయవాడ సిటీ**

తప్పు చేసిన వాళ్లను వదిలేది లేదు

చేయనివారి జోలికి పోను.. అన్‌స్టాపబుల్ షోలో బాబు

నేనెప్పుడూ తప్పు చేయలేదు

రాజకీయ కక్షలకు పాల్పడలేదు

చట్టం ధిక్కరణ చేయలేదు

కానీ ఏపీలో కక్ష రాజకీయాలొచ్చాయి

వ్యక్తిగత ద్వేషాలుగా మారాయి

నా అరెస్టును జీర్ణించుకోలేకపోతున్నా

ప్రజల అండదండలే నన్ను గెలిపించాయి



శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన హడ్కో చైర్మన్-ఎండీ సంజయ్ కులశ్రేష్ఠ

బాలకృష్ణ షోలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తన జీవితంలో ఏనాడూ కక్ష రాజకీయాలకు పాల్పడలేదని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ఏ పనిచేసినా నాలుగు సార్లు ఆలోచించి చేస్తానని.. ఒక్కనాడూ చట్టాన్ని ధిక్కరించలేదని చెప్పారు. అలాంటి తనను అరెస్టు చేయడం ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నానని చెప్పారు. సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన 'అన్‌స్టాపబుల్' కార్యక్రమంలో ముఖ్యమంత్రిని ఇంటర్వ్యూ చేశారు. తన అరెస్టు పరిణామాలు, సంక్షోభాలు వచ్చినప్పుడు ఎలా వ్యవహరించేదీ ఈ సందర్భంగా సీఎం వివరించారు. ముఖ్యాంశాలివీ..

బాలకృష్ణ: మీ అరెస్టుతో భారతదేశంలో ప్రతి రాజకీయ నాయకుడు అదిరిపోయారు. కన్నీళ్లు పెట్టుకున్నారు. ఏమిటీ అమానుషమన్నారు. ఇది ఎప్పుడూ జరగనిది. చూడనిది. జరగకూడనిది. మీకేం అనిపిస్తోంది?

చంద్రబాబు: నేను జీవితంలో అనేక సంక్షోభాలు చూశాను. ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మార్చుకుంటూ సమాజం కోసం పనిచేసుకుంటూ వచ్చాను. బాధ, ఆవేదన సంఘటనలు ఎప్పటికీ మరచిపోలేను. ప్రజాక్షేత్రంలో నంద్యాలలో మీటింగ్ పెట్టి అక్కడ నుంచి నేరుగా బస్సు దగ్గరకు వచ్చి.. రాత్రి రెస్ట్ తీసుకుంటున్న సమయంలో బయట రాత్రంతా అలజడి సృష్టించారు. తర్వాత కిందకు వస్తే

మిగతా 11వ పేజీలో...

రాజధానిలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్

11

10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు.. చంద్రబాబుతో హడ్కో చైర్మన్ చర్చలు



జగన్ పాపం

జనంపై మరో భారం

6,072 కోట్ల కరెంటు బాదుడు!

డిస్కంలకు ఏపీఈఆర్‌సీ అనుమతి.. వచ్చే నెల నుంచే వసూలు

15 నెలలు కట్టాల్సిందే.. యూనిట్‌పై అదనంగా రూ.1.21

2022-23లో ఇంధన సర్దుబాటుకు కమిషన్ ఆమోదం

పొంచి ఉన్న మరో రూ.11,828 కోట్ల భారం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల రూపంలో మరో భారం పడింది. నాటి సీఎం వైఎస్ జగన్ అనుసరించిన విద్యుత్ విధానాల పాపం.. ఆయన గద్దె దిగినా రాష్ట్రాన్ని వదలడం లేదు. ఇప్పటికే సర్దుబాటు చార్జీలతో సతమతమవుతున్న ప్రజల నుంచి మరో రూ.6,072.86 కోట్లు వసూలు చేసుకునేందుకు డిస్కంలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) శుక్రవారం అనుమతి ఇచ్చింది. 2022-23 సంవత్సరానికి గాను ఇంధన సర్దుబాటు చార్జీల కింద ఈ మొత్తాన్ని వచ్చే నవంబరు నుంచే కరెంటు బిల్లుల్లో వసూలు చేసుకోవచ్చని తెలిపింది. 15 నెలసరి వాయిదాల్లో

మిగతా 6వ పేజీలో...

29 నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్స్



తెల్లరేషన్ కార్డు, ఆధార్, ఎల్పీజీ కనెక్షన్ అర్హత

అర్హులకు ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు: మంత్రి నాదెండ్ల

3



నాన్న ఆదేశించారు..

అమ్మ వెయ్యిసార్లు చెప్పింది

అవన్నీ కుటుంబ ఆస్తులే.. నా సోదరుడు జగన్ గార్డియన్ మాత్రమే

గ్రాండ్ చిల్డ్రన్‌కు సమాన వాటా ఇవ్వాలనేది వైఎస్ ఆదేశం

ఆ బాధ్యత మాత్రమే జగన్‌ది.. నాకు ఆస్తులపై మోజు లేదు

నా బిడ్డలకు రావాల్సిందే అడుగుతున్నా



రాజకీయాల్లోకి వచ్చానని తొక్కాలని చూశారు

అన్యాయపు సెటిల్‌మెంట్‌కు ఒప్పుకోలేదనే కేసులు

జగన్, భారతి, అవినాశ్‌లను రాజకీయంగా విమర్శించరాదట!

అందుకు నేను ఎలా ఒప్పుకొంటా?.. అందుకే వేధింపులు

బెయిల్‌కు, ఆస్తుల పంపకాలకు ముడిపెట్టి.. కొత్తగా నిందలు

కొడుకు నిర్వాకంతో తల్లి విజయమ్మ క్షోభిస్తోంది

వైఎస్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించిన అన్నివ్యాపారాలూ కుటుంబ వ్యాపారాలేనని, అందులో తన నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానవాటా ఉండాలన్నది ఆయన ఆదేశమని, అమ్మ కూడా కనీసం వెయ్యిసార్లు ఇదే విషయం చెప్పారని వారి కుమార్తె, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వ్యాపారాలకు, ఆస్తులకు తన సోదరుడు జగన్ గార్డియన్ మాత్రమేనన్నారు. ఆస్తులు ఎగ్గొట్టడానికి కన్న కొడుకే కేసులు పెట్టి కోర్టుకు లాగడంతో తన తల్లి విజయలక్ష్మి క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని వైఎస్ అభిమానులకు శుక్రవారం ఆమె బహిరంగ లేఖ రాశారు. గత కొద్దిరోజులుగా వైఎస్ కుటుంబ ఆస్తుల గొడవల నేపథ్యంలో షర్మిలను నిందిస్తూ జగన్ పత్రిక శుక్రవారం సంచికలో ఒక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని ఖండించడంతో పాటు వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులకు వాస్తవాలు తెలియాలని తాను ఈ లేఖ రాస్తున్నట్టు ఆమె తెలిపారు. జగన్ పత్రిక శుక్రవారం సంచికలో వండి వార్చిన అబద్ధపు కథనంలో తెలిపినట్టు.. వైఎస్ బతికుండగా ఏ ఒక్క ఆస్తి పంపకమూ జరగలేదని, ఈరోజుకూ న్యాయంగా

మిగతా 11వ పేజీలో...

తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు

ఇసుక సరఫరా, నిర్వహణ కూడా వాటికే

రీచ్‌లు లేని ప్రాంతాల్లో ప్రైవేటు లైసెన్సులు

ఉచిత ఇసుకకు ధోకా లేదు

సీనరేజీ, ఫీజులు మినహాయింపు

స్థానికులకు ఇసుక కావాలంటే ముందుగా..

ఆన్‌లైన్ లేదా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్

బ్లాక్‌మార్కెట్ చేసేవారిపై పీడీయాక్ట్ ప్రయోగం

సవరించిన ఇసుక పాలసీ విడుదల.. జీవో జారీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇసుక విషయంలో ఊహించినదే జరుగుతోంది. ఇసుక రీచ్‌ల నిర్వహణ, తవ్వకాలు, స్టాక్ యార్డ్‌ల నిర్వహణ , సరఫరా వంటి కీలక బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని సర్కారు నిర్ణయించింది. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పర్యవేక్షణ మాత్రమే చేయాలనుకుంటోంది. ఉచిత ఇసుక నిర్వహణ, ధరల నిర్ణయం, నిఘా, నియంత్రణ వంటి అంశాలను జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) ద్వారా ప్రభుత్వం చూసుకోనుంది. స్టాక్‌యార్డ్‌ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లే వారి నుంచి గనుల శాఖ వసూలు చేసే సీనరేజీ, డీఎంఎఫ్, మెరిట్ ఫీజులను ఇకపై వసూలు చేయదు. ఉచిత ఇసుక వినియోగదారులకు ఈ మూడు ఫీజులను మినహాయింపునిచ్చారు. ఈ కీలకమైన మార్పులతో ప్రభుత్వం సవరించిన ఉచిత ఇసుక పాలసీని శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు (జీఓ-66) జారీ చేశారు. ముఖ్యాంశాలు.. ఉచిత ఇసుక వినియోగదారులపై ఖర్చుభారం తగ్గించేందుకు చట్టబద్ధమైన సీనరేజీ ఫీజు, డీఎమ్ఎఫ్ (జిల్లా ఖనిజ నిధి), మెరిట్ పేరిట ఫీజుల వసూళ్లను మినహాయించారు. దీని వల్ల టన్నుకు కనీసం 88 రూపాయల మేర తగ్గనుంది. 20 టన్నుల లారీకి సీనరేజీ ఫీజు కింద 1760 రూపాయలు తగ్గనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రీచ్‌లు, నదీ తీర ప్రాంతాల నుంచి వ్యక్తిగత, సామాజిక అవసరాలకోసం ట్రాక్టర్, ఎద్దుల బండిపై తీసుకెళ్లే ఇసుకను ఆ గ్రామం పరిధిలోనే

మిగతా 6వ పేజీలో...

వాస్తవాధీన రేఖ వెంబడి సేనలు వెనక్కి!

- 2020 ఏప్రిల్ ముందు నాటి స్థానాలకు భారత్, చైనా బలగాలు.. ఒప్పందం అమలు

న్యూఢిల్లీ, అక్టోబరు 25: నాలుగేళ్లుగా నెలకొన్న ఉద్రిక్తతలకు తెరదించుతూ సరిహద్దుల్లో గస్తీపై భారత్, చైనా మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం అమలు విషయంలో ఇరుదేశాలు కలిసి పని చేస్తున్నాయి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి.. తూర్పు లద్దాఖ్‌లో కీలక ప్రాంతాలైన డెమ్చోక్, డెస్పాంగ్‌లో ఉంచిన సేనలను ఇరుదేశాలు వెనక్కి రప్పిస్తున్నాయి. 2020 ఏప్రిల్‌కు ముందు(గల్వాన్ లోయలో ఘర్షణలకు ముందు) సేనలు ఎక్కడ ఉండేవో అక్కడికి తిరిగి చేరుతున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగా వాస్తవాధీన రేఖకు ఇరువైపులా ఉన్న 12 తాత్కాలిక నిర్మాణాలు, 12 గుడారాలను ఆయా సైన్యాలు తొలగించాయి. బలగాల ఉపసంహరణ ప్రక్రియ 29వ తేదీ వరకు కొనసాగనుంది. అయితే, గల్వాన్ సహా నాలుగు ప్రాంతాల్లో సైనిక ఉపసంహరణపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

రేసులో ట్రంప్ ముందంజ!

- మాజీ అధ్యక్షుడికి 48% మంది మద్దతు.. సీఎన్‌బీసీ సర్వే

న్యూఢిల్లీ, అక్టోబరు 25: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్.. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ మధ్య నువ్వానేనా అన్నట్టుగా పోటీ నెలకొన్నా.. రేసులో ట్రంప్ కాస్త ముందంజలో ఉన్నారట! మరో రెండు వారాల్లో అధ్యక్ష ఎన్నికలకు తెరలేవనున్న నేపథ్యంలో సీఎన్‌బీసీ సంస్థ 'ఆల్-అమెరికన్ ఎకనామిక్ సర్వే'లో ఇది తేలింది. అక్టోబరు 15-19 మధ్య ఈ సర్వే జరిపారు. అమెరికా వ్యాప్తంగా 1000 మంది ఓటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ మేరకు ట్రంప్‌కు 48%, కమలా హారిస్‌కు 46% మంది మద్దతు పలికారు. అయితే ఇది 3.1శాతం అటూ ఇటూ కావొచ్చని సర్వే సంస్థ పేర్కొంది. మరోవైపు.. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధిస్తే మన దేశానికి ఐటీ పరంగా కష్టాలు ఎదురవుతాయని ఫిలిప్ క్యాపిటల్ సంస్థ ఓ నివేదిక విడుదల చేసింది.

దళితులపై దాడి కేసులో.. 98 మందికి యావజ్జీవం, ముగ్గురికి ఐదేళ్ల జైలు

- శిక్షలు ఖరారు చేసిన కొప్పళ జిల్లా సెషన్స్ కోర్టు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కొప్పళ జిల్లా గంగావతి తాలూకా మరగుబ్బి గ్రామంలో దళితులపై దాడికి పాల్పడిన కేసులో దోషులకు సెషన్స్ కోర్టు శిక్షలను ఖరారు చేసింది. పదేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై ఈ నెల 22న కొప్పళ జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. ముద్దాయిలలో 101 మందిని దోషులుగా ప్రకటించింది. వీరికి గురువారం సాయంత్రం శిక్ష ఖరారు చేసింది. 98 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధించింది. ముగ్గురికి అట్రాసిటీ కేసు వర్తించని కారణంగా ఐదేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధించింది. మరో ముద్దాయి రామణ్ణ లక్ష్మణ భోవి కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. ఆయన్ను పోలీసులు అలాగే కోర్టుకు తీసుకొచ్చారు. తీర్పు వెలువడిన అనంతరం కోర్టు ఆదేశాలతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రామణ్ణ మృతి చెందారని పోలీసులు తెలిపారు.

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు?

- రేపు ఖతార్ ప్రధానితో దోహాలో చర్చలు

గాజా, టెల్ అవీవ్, బీరుట్ అక్టోబరు 25: గాజాలో హమాస్-ఇజ్రాయెల్ మధ్య ఏడాదికి పైగా జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు సంధి కుదిర్చే యత్నాలు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా ఇజ్రాయెల్ ఇంటలిజెన్స్ సంస్థ మొస్సాద్ చీఫ్ డేవిడ్ బర్నియా, అమెరికా ఇంటలిజెన్స్ సంస్థ సీఐఏ చీఫ్ బిల్ బర్న్స్.. ఖతార్ రాజధాని దోహాలో ఆదేశ ప్రధాని అల్ థానీతో 27న చర్చలు జరుపుతారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటొనీ బ్లింకెన్ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఖతార్ ప్రధాని అల్ థానీతో సమావేశమయ్యారు. హమాస్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపే విషయంపై చర్చలు జరిపారు. హమాస్ చీఫ్ యహ్యా సిన్వర్ మృతి చెందడంతో చర్చల ప్రక్రియ వేగం చేసి యుద్ధానికి ముగింపు పలకాలని నిర్ణయించినట్లు సమాచారం.

విద్యుత్ పొదుపు వారియర్స్‌గా గ్రామీణ యువత

- ఈఈఎస్ఎల్ సీఈవోతో సీఎం సమావేశం

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1,25,000 మంది ఎలక్ట్రికల్ లైసెన్స్ తీసుకున్నవారు ఉన్నారని వారితోనూ, అంగన్‌వాడీలతోనూ గృహ నిర్మాణంలో ఇంధన పొదుపు విద్యుత్తు పరికరాలను అందజేసే ప్రణాళికలు సిద్ధం చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయనతో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సీఈవో విశాల్ కపూర్ శుక్రవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెద్దఎత్తున జరుగుతున్న గృహ నిర్మాణాల్లో విద్యుత్తు పొదుపు పరికరాలను అమర్చే విధులను ఉర్జా వీర్ పథకం కింద ఎలక్ట్రికల్ సర్టిఫికెట్లు పొందిన యువతకు అప్పగిస్తామని సీఎం వెల్లడించారు. ఈఈఎస్ఎల్ చేపట్టే పథకాలను ఉర్జా వీర్ పథకంలోకి తీసుకువచ్చి ఆ యువతను వారియర్స్‌గా వినియోగించుకుంటామని చంద్రబాబు వెల్లడించారు. ఇంధన పొదుపులో కృత్రిమ మేధ పరికరాలను అందజేసేందుకు ప్రత్యేక కార్యాచరణను ఏపీలో అమలు చేయనున్నామని ఈఈఎస్ఎల్ సీఈవో కపూర్ చెప్పారు. రాష్ట్రంలో ఇంధన ఆదా పరికరాలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అంగన్‌వాడీలకు ఎలక్ట్రిక్ కుకింగ్ పరికరాలను అందజేస్తామని చెప్పారు.

టీడీఆర్ అక్రమాలపై సమాచారం సేకరించండి

- అధికారులకు చంద్రబాబు ఆదేశం

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీఆర్ బాండ్లలో జరిగిన అక్రమాలపై సమగ్ర సమాచారం సేకరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే వెలుగు చూసిన ఘటనలపై మరింత సమాచారం సేకరించడంతోపాటు ఇతర కార్పొరేషన్లలో జరిగిన అక్రమాలను సైతం కూపీ లాగాలని ఆదేశించారు. శుక్రవారం మునిసిపల్ శాఖపై ఆయన సమీక్షించారు. పట్టణ స్థానిక సంస్థల్లో మొత్తం 50లక్షల గృహాలు ఉండగా ఇప్పటి వరకు 30లక్షల ఇళ్లకు నీటి కొళాయి సౌకర్యం ఉందని మరో 7.5లక్షల ఇళ్లకు అమృత్ పథకం కింద కొళాయి నీరు ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద సమస్యగా ఉన్న చెత్త తొలగింపు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వం నిర్వాకంతో 83 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. దీన్ని వచ్చే జూన్ నాటికి పూర్తిగా తొలగించాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వచ్చే ఏడాది గాంధీ జయంతి నాటికి సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌గాడిలో పడాలని ఆదేశించారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, అర్బన్ ప్లానింగ్ విభాగాల్లో డ్రోన్లను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా టిడ్కో ఇళ్ల స్థితిగతులను అధికారులు సీఎంకు వివరించారు. ఈ ప్రాజెక్టును సక్రమంగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయింపునకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని దీనిపై ప్రత్యేకంగా సమీక్షించి నిర్ణయాలు తీసుకుందామని సీఎం చెప్పారు. పీపీపీ పద్ధతిలో పార్కులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం సూచించారు.

వర్గీకరణ జరిగే వరకూ నోటిఫికేషన్ వద్దు

- సీఎం చంద్రబాబుకు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి



గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబుపై విశ్వాసం, గౌరవం ఉంది. కాకపోతే వర్గీకరణ ప్రక్రియ మొదలు కాకపోవడంతో మాదిగలు ఆందోళనలో ఉన్నారు. సమస్యను దృష్టిలో పెట్టుకుని తక్షణమే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ప్రారంభించాలి' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కోరారు. ప్రక్రియను ప్రారంభించే వరకు ఎటువంటి ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయవద్దని విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'త్వరలోనే వర్గీకరణ ప్రక్రియ చేపడతారన్న నమ్మకం ఉంది. వర్గీకరణకు ఆద్యుడు చంద్రబాబు. కాకపోతే అమలు చేసింది మాత్రం తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు. వైసీపీ పాలనలో కనీసం న్యాయవాదిని కూడా నియమించకపోవడంతో ఈ ప్రక్రియ రాష్ట్రంలో బాగా ఆలస్యమైంది. హరియాణా, మహారాష్ట్రలో కూడా ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటకలో కమిటీలను ఏర్పాటు చేశారు. ఏపీలో మొదలుకాకపోవడం విచారకరం. వర్గీకరణతోపాటు ఇతర సమస్యలను చర్చించడానికి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా నవంబరు 1న గుంటూరు, కృష్ణా జిల్లాల సమావేశం జరుగుతుంది. సమావేశాలు ముగిసిన తరువాత రాష్ట్ర కార్యాచరణ ప్రకటిస్తాం' అని మంద కృష్ణ మాదిగ అన్నారు.

సైబర్ వల..
బతుకులు విలవిల!



ఆగ్నేయాసియాలో 29 వేల మంది భారతీయ యువతీ యువకులు మిస్సింగ్

- ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని మోసం
- సోషల్ మీడియాలో ప్రకటనలు
- నమ్మి వెళ్లిన వారితో సైబర్ నేరాల పని
- విస్తుగొలిపే విషయాల్ని వెల్లడించిన నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబరు 25: "రూ.లక్షల్లో కాదు.. కోట్లలో వేతనాలు. కూర్చున్న చోట నుంచి కదలాల్సిన పని కూడా లేదు. అలుపెరుగకుండా ఆయాసం లేకుండా పని చేసుకునే వెసులుబాటు. రండి! చేరండి!" ఇవీ.. సోషల్ మీడియాలో తరచుగా కనిపించే ప్రకటనలు. వీటిని నమ్మి.. రూ.కోట్లకు ఆశపడి ఈ ప్రకటనల వలలో చిక్కితే ఇక అంతే!. సైబర్ నేర సామ్రాజ్యంలో బానిసలుగా బతకాల్సిందే. ఇలా.. ఆగ్నేయాసియాలోని సైబర్ ముఠాల వలలో చిక్కుకుని ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 29 వేల మంది భారతీయులు కనిపించకుండా పోయారు. 2022, జనవరి నుంచి 2024 మధ్య వీరంతా మిస్సయినట్టు తాజాగా ఓ నివేదిక పేర్కొంది. ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామంటూ సైబర్ మాయగాళ్లు వీరిని మోసం చేసినట్టు నివేదిక వెల్లడించింది. 'వెబ్ ఆఫ్ డిసీట్; ట్రాన్సనేషనల్ సైబర్ స్లేవరీ, ఆగ్నేయాసియాలో వ్యవస్థీకృత నేరాలు' పేరిట విడుదలైన ఈ నివేదిక పలు విషయాలను వివరించింది. వ్యవస్థీకృత నేరగాళ్ల ముఠా ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని.. యువతీ యువకులను ఉద్యోగాల పేరిట ఆకర్షించింది. నమ్మి వెళ్లినవారితో బలవంతంగా సైబర్ నేరాలను చేయించడం ఈ ముఠా ప్రధాన లక్ష్యం. ఈ ముఠా ప్రధానంగా కాంబోడియా, లావోస్‌లను కేంద్రంగా చేసుకుని పనిచేస్తున్నట్టు నివేదిక పేర్కొంది. భారత్, నేపాల్, బంగ్లాదేశ్‌లకు చెందిన యువతను అత్యధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు ఇస్తామంటూ ఆకర్షించింది.

ఇలా వల!

సైబర్ నేరగాళ్ల ముఠాలు.. సామాజిక మాధ్యమాలను, జాబ్ పోర్టళ్లను వేదికలుగా చేసుకుని తమ పన్నాగాలను అమలు చేస్తున్నాయి. ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సా‌ప్‌లలో ఉద్యోగాలకు సంబంధించి నకిలీ ప్రకటనలు గుప్పిస్తాయి. భారీ వేతనాలంటూ ఆకర్షణీయమైన ప్రకటనలతో యువతను ఆకట్టుకున్నాయి. వినియోగదారుల సేవలు, క్రిప్టో కరెన్సీ వాణిజ్యం వంటి ఉద్యోగాలే మీరు చేయాల్సిందని నమ్మబలుకుతాయి. అంతేకాదు.. ఈ ముఠా 20 నుంచి 39 ఏళ్ల వయసున్న వారినే లక్ష్యంగా చేసుకుని ప్రకటనలు గుప్పిస్తాయి. ఇలా ఈ ప్రకటనలకు ఆకర్షితులై.. భారత్ నుంచి వేలాది మంది యువతీ యువకులు ఈ ముఠాల బారినపడ్డారు. ఇక, ఇలా వెళ్లిన వారి నుంచి ముందుగా పాస్‌పోర్టు, గుర్తింపు కార్డులు, కీలకమైన పత్రాలను ముఠా సభ్యులు స్వాధీనం చేసుకుంటారు. అనంతరం.. వారిని రహస్య ప్రాంతాల్లో నిర్బంధిస్తారు. వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తారు. ఫిషింగ్ కుంభకోణాలు, క్రిప్టో కరెన్సీ మోసాలు, నకిలీ రుణ యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేయిస్తారు. ఈ ముఠాల వెనుక.. నేరాలకు పాల్పడే అనేక సంస్థలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. వీటిలో అత్యంత కరడుగట్టిన నేర ముఠాలుగా పేరున్న జిన్ బీ గ్రూప్, ది కింగ్స్ రోమన్స్ గ్రూప్, ది ప్రిన్స్ గ్రూప్ ఉన్నట్టు తెలిపింది. ఇవన్నీ ఆగ్నేయాసియా నుంచే తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. బాధితుల్లో ఎక్కువ మంది ఈ గ్రూపుల్లోనే బలవంతపు బానిసలుగా ఉన్నారని తెలిపింది. ఎక్కువ మంది భారతీయులు విజిటర్స్ వీసాపై థాయ్‌లాండ్, కాంబోడియా, లావోస్, వియత్నాంలకు వెళ్లారని.. ఇప్పటి వరకు తిరిగి రాలేదని పేర్కొంది.

ప్రత్యక్ష నరకం!

సైబర్ ముఠాల బారిన చిక్కుకున్న వారు బానిసలుగా బతకాల్సిందేనని నివేదిక తెలిపింది. ఏమాత్రం వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానం కలిగినా.. భౌతిక దాడులతో పాటు ప్రత్యక్ష నరకం ఎలా ఉంటుందో రుచిచూపిస్తారు. రక్తాలు కారేలా కొట్టడంతోపాటు, కాళ్లు, చేతులు కూడా విరగ్గొట్టేస్తారు. రోజుల తరబడి తిండి, నీరు లేకుండా చేసి దారిలోకి తెచ్చుకుంటారు. వీరిపై ముఠా సభ్యుల నిరంతర పర్యవేక్షణ కూడా ఉంటుంది. అంతేకాదు.. రోజువారీ కుంభకోణాలు, మోసాలకు సంబంధించి లక్ష్యాలు విధిస్తారు. వాటిని సాధించకపోతే తీవ్రంగా హింసిస్తారు. ఆర్థిక మోసాలను ఎన్ని రూపాల్లో చేయొచ్చో అన్నీ చేయిస్తారు. యువతులతో అర్ధనగ్నంగా ఫోన్లు చేయించి వలపు వల విసిరేలా చేస్తారు.

4 నెలల్లో రూ.1750 కోట్ల మోసం

ఈ ఏడాది తొలి నాలుగు మాసాల్లో సైబర్ నేరాల బారిన పడిన భారతీయులు రూ.1,750 కోట్లకు పైగా మోస పోయారని నివేదిక వెల్లడించింది. ఇదంతా ఆగ్నేయాసియా సైబర్ ముఠా పనేనని పేర్కొంది. అదేవిధంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలలోనూ బాధితులు భారీ సంఖ్యలోనే ఉన్నారని తెలిపింది.

భారత ప్రభుత్వం స్పందించాలి

సైబర్ నేరగాళ్ల ముఠాలను అరికట్టేందుకు భారత్ సహా అంతర్జాతీయ సమాజం స్పందించాలని 'వెబ్ ఆఫ్ డిసీట్; ట్రాన్సనేషనల్ సైబర్ స్లేవరీ, ఆగ్నేయాసియాలో వ్యవస్థీకృత నేరాలు' నివేదిక కోరింది. సమగ్రమైన చర్యలకు దిగాలని సూచించింది. దీనిలో భాగంగా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేయాలని, సరిహద్దుల వద్ద నియంత్రణలను పెంచాలని ప్రభుత్వాలను కోరింది. నకిలీ ఉద్యోగ ప్రకటనలను తొలగించేలా టెక్ కంపెనీలను అప్రమత్తం చేయాలని సూచించింది. భారత్ వంటి దేశాలు ఇలాంటి నకిలీ ప్రకటనలు, సైబర్ నేరగాళ్ల ముఠాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించింది.

7 సెకన్ల వ్యవధిలో 5 సార్లు నమస్కారాలు



- బీజేపీ నేతకు యువ ఐఏఎస్ అధికారిణి గౌరవం

జైపూర్, అక్టోబరు 25: ఓ రాజకీయ నాయకునికి యువ ఐఏఎస్ అధికారిణి ఏడు సెకన్ల వ్యవధిలో అయిదు సార్లు నమస్కారం చేయడం చర్చనీయాంశంగా మారింది. రాజస్థాన్ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సతీష్ పునియా ఎస్‌వీయూలో దిగగానే బర్మేర్ జిల్లా కలెక్టర్ టీనా దాబి తలవంచి వెంటవెంటనే నమస్కారం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'నవో బర్మేర్' పేరుతో జిల్లాలో ఆధునిక పద్ధతుల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతూ టీనా పేరు తెచ్చుకోవడం గమనార్హం. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పునియా కారు దిగుతుండగానే ఆమె చేతులు జోడించి ఆయనకు నమస్కరించారు. ఆయన ఇంకా ఫోన్‌లో మాట్లాడుతుండగానే ఆమె తలవంచి నమస్కారాలు చేశారు. 'థ్యాంక్యూ! బాగా పనిచేస్తున్నారు. పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. చెత్తకుండీలు ఏర్పాటు చేస్తున్నారు' అంటూ కొనియాడారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో నాయకుల పట్ల ఇంత విధేయత ప్రదర్శించాల్సిన అవసరం ఉందా అన్న చర్చ నడుస్తోంది.

లోకం తీరు



వలసలకు కెనడా కళ్లెం!

వచ్చే మూడేళ్లలో ఏటా లక్ష మందికి పైగా కోతలు

న్యూఢిల్లీ/అట్టావా, అక్టోబరు 25: దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్యను భారీగా తగ్గించినట్లు కెనడా ప్రకటించింది. దేశంలో జనాభా పెరుగుదలకు అడ్డుకట్టవేయడంతోపాటు వలసలపై స్థానికుల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. 2023-24 మధ్య కాలంలో కెనడా జనాభా 3.2శాతం పెరిగి 4.1 కోట్ల కు చేరుకుంది. వలసదారుల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోవడమే దీనికి కారణంగా పేర్కొంది. వలసలపై ఆంక్షలను ప్రకటించిన ప్రధాని జస్టిన్ ట్రూడో మాట్లాడుతూ..వచ్చే మూడేళ్లలో వలసదారుల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తామని ప్రకటిస్తున్నాం. ఈ నిర్ణయం వచ్చే రెండేళ్లలో జనాభా పెరుగుదలలో విరామానికి దోహదపడుతుంది' అని వ్యాఖ్యానించారు. ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, సామాజిక సేవల్లో అవసరమైన పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వానికి తగిన సమయం ఇవ్వడంతోపాటు భవిష్యత్తులో ఎక్కువ మందికి వసతి కల్పించడానికి కెనడా జనాభాను స్థిరీకరించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా 2025, 2026 సంవత్సరాల్లో 5లక్షల మంది చొప్పున దేశంలో కొత్తగా శాశ్వత నివాసానికి అనుమతించాలని కెనడా ఇమ్మిగ్రేషన్ శాఖ గతంలో ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఆ లక్ష్యాలను వచ్చే ఏడాది 3,95,000కు, 2026లో 3,80,000కు, 2027లో లక్ష్యాన్ని 3,65,000గా నిర్ణయించారు. 2021 జనాభా లెక్కల ప్రకారం కెనడా జనాభాలో 23%మంది విదేశీయులే. ఇటీవల వలస వచ్చిన ప్రతి ఐదుగురిలో ఒకరు భారత్ నుంచి వచ్చారని స్టాటిస్టిక్స్ ఏజెన్సీ తెలిపింది. కాగా ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని భారత దౌత్యవేత్త సంజయ్ వర్మ హెచ్చరించారు.

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు కృషి చేస్తాం

యుద్ధాలతో సమస్యలు పరిష్కారం కావు

- జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్‌తో భేటీలో మోదీ



జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్‌తో మోదీ కరచాలనం

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ఈ ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. భారత్- జర్మనీ 7వ 'ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్ (ఐజీసీ)' చర్చల్లో భాగంగా మూడు రోజుల భారత పర్యటనకు వచ్చిన జర్మన్ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్‌తో శుక్రవారం మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఉక్రెయిన్, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. వీలైనంత త్వరగా వీటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా కృషి చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంది. యుద్ధాల వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని భారత్ ఎప్పటికీ విశ్వసించదు" అని చెప్పారు. ప్రపంచవ్యాప్తం గా ఉద్రిక్తతలు, విభేదాలు ముసురుకున్నప్పటికీ భారత్, జర్మనీల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఇరుదేశాల అభివృద్ధికి బలమైన పునాదిగా మారిందని పేర్కొన్నారు. ఈ రెండు దేశాల మధ్య భాగస్వామ్యం కేవలం లావాదేవీలకే పరిమితం కాలేదన్నారు. రెండు బలమైన ప్రజాస్వామ్య దేశాల పరివర్తనకు నిదర్శనంగా నిలిచిందని చెప్పారు. జర్మనీ ప్రకటించిన 'ఫోకస్ ఆన్ ఇండియా'ను మోదీ స్వాగతించారు. ఇరుదేశాల భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 18వ ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్-2024 సదస్సులో మోదీ మాట్లాడుతూ.. ఓ వైపు సీఈవో ఫోరం సమావేశం జరుగుతుండగా, మరోవైపు ఇరుదేశాల నౌకాదళాలు సంయుక్త విన్యాసాలు చేస్తున్నాయని చెప్పారు. జర్మనీ, భారత్ దేశాల మధ్య ఉన్న స్నేహ బంధం అన్ని రంగాల్లోనూ మరింత బలోపేతం అవుతోందని తెలిపారు. భారతీయ నిపుణులకు ఏటా ఇచ్చే వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలన్న జర్మనీ నిర్ణయంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది జర్మనీ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్న విశ్వాసం తనకుందన్నారు. భారత్, జర్మనీల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 25 ఏళ్లు పూర్తవుతాయని.. మరో 25 ఏళ్లలో ఇది మరింత ఉన్నత శిఖరాలకు చేరుతుందని పేర్కొన్నారు. ఐరాస భద్రతామండలితో సహా పలు అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

భారత ప్రయత్నాలు అభినందనీయం: ఒలాఫ్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేలా చూసి, శాంతిని నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను ఒలాఫ్ అభినందించారు. అన్ని భాగస్వామ్యపక్షాలతో చర్చించి శాంతిస్థాపనకు భారత్ ఎంతగానో ప్రయత్నిస్తోందని కొనియాడారు. ఈ విషయంలో భారత్‌కు మద్దతుగా నిలుస్తామన్నారు. కాగా, మహారాష్ట్రకు చెందిన భవేశ్, ధారా షా దంపతుల కుమార్తె అరిహా షా (3)ను మూడేళ్లుగా జర్మనీలోని ఫోస్టర్ కేర్‌లో ఉంచుతున్న విషయాన్ని ఒలాఫ్‌తో భేటీలో ప్రధాని మోదీ ప్రస్తావించినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శారీరకంగా హింసించారన్న ఆరోపణలతో బాలికను 36 నెలలుగా తల్లిదండ్రులకు అప్పగించకుండా ఫోస్టర్ కేర్‌లోనే ఉంచుతున్నారు. ఈ అంశాన్ని తాను పరిశీలిస్తానని ఒలాఫ్.. మోదీకి హామీ ఇచ్చినట్లు మిస్రీ వెల్లడించారు.

'బాంబూ'చోళ్లు ఎవరు?

మరో 25కు పైగా సర్వీసులకు బెదిరింపులు

- హైదరాబాద్-చండీగఢ్ విమానానికి కూడా..

న్యూఢిల్లీ, శంషాబాద్ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేశంలో విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. రోజూ ఇలాంటి హెచ్చరికలు వస్తుండడం అధికారవర్గాల్లో అయోమయం సృష్టిస్తోంది. శుక్రవారం వివిధ సంస్థలకు చెందిన 25కుపైగా సర్వీసులకు బెదిరింపులు వచ్చాయి. వీటిలో ఇండిగో 8, విస్తారా 7, స్పైస్ జెట్, ఎయిర్ ఇండియాలకు చెందిన 6 సర్వీసులున్నాయి. ఢిల్లీ, ముంబై నుంచి తుర్కియే రాజధాని ఇస్తాంబుల్ వెళ్లే విమానాలూ ప్రభావితమయ్యాయి. మొదటి బెదిరింపు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరే విమానానికి వచ్చింది. తర్వాత ముంబై, చెన్నై వంతు. కాగా, హైదరాబాద్ శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయం నుంచి పంజాబ్‌లోని చండీగఢ్ వెళ్తున్న ఇండిగో సర్వీసుకూ ఈ బెడద తప్పలేదు. పోలీసులు తెలిపినదాని ప్రకారం.. ఉదయం 10.50గంటలకు చండీగఢ్ వెళ్లే విమానంలో బాంబు పెట్టామని ట్వీట్ వచ్చింది. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బాంబు, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబులేదని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాల్‌రాజు తెలిపారు. బాంబు బెదిరింపులపై శంషాబాద్ విమానాశ్రయంలో జనవరి నుంచి 11 కేసులు నమోదయ్యాయి. కాగా, దేశంలో 11 రోజుల్లో బెదిరింపులు వచ్చిన సర్వీసుల సంఖ్య 275 దాటింది. గత 24 గంటల్లోనే వివిధ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి 70పైగా విమానాలకు హెచ్చరికలు అందాయి. వీటిలో ఎయిర్ ఇండియా, ఇండిగో, విస్తారాలవే 20 చొప్పున ఉన్నాయి. కాగా హెచ్చరికలు పంపుతున్నది ఎవరో నిఘా, భద్రతా వర్గాలు తెలుసుకోలేకపోయాయి. అయితే, కేంద్రం మల్టీ నేషనల్ టెక్నాలజీ సంస్థల సాయం కోరినట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికల నుంచే బెదిరింపులు రావడంతో మెటా, ఎక్స్‌లను వివరాలు కోరింది. ఈ సంస్థలు ఇంకా స్పందించాల్సి ఉంది. దుండగులు వీపీఎన్ లేదా డార్క్ వెబ్‌ను ఉపయోగిస్తున్నారని, విదేశం నుంచి ఈ చర్యకు పాల్పడుతున్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అంతర్జాతీయ కుట్రపైనా ఆరా తీస్తున్నామని ఒక అధికారి చెప్పారు. కీలక రంగాల్లో 35 మంది ఎయిర్ మార్షల్స్‌ను నియమించామని, వీరి సంఖ్యను వందకు పెంచుతామని తెలిపారు. కాగా, అన్నీ ఆకతాయి హెచ్చరికలేనని, దీనివెనుక కుట్ర ఏమీ లేదని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగుతున్న 'డంకీ'!

- అనుమతి లేకుండా అమెరికాలోకి వెళ్లటానికి భారతీయుల యత్నాలు
- ఈ ఏడాది 90,415 మంది అరెస్టు
- వెల్లడించిన అమెరికా కస్టమ్స్ విభాగం

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ఆ మధ్య వచ్చిన డంకీ సినిమా.. ఉపాధి కోసం బ్రిటన్‌లోకి అనధికారికంగా ప్రవేశించటానికి నిరుపేద భారతీయులు పడే బాధలను కళ్లకు కట్టింది. తీవ్రమైన అవమానాలు, సవాళ్లు, ఆటంకాలు, మార్గమధ్యంలోనే ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితులు ఉన్నా కూడా.. కూటి కోసం కోటి కష్టాలకు ఎదురీదుతూ విదేశాలకు అక్రమంగా వెళ్తున్న వారి సంఖ్య ఏమాత్రం తగ్గటం లేదు (ఈ చట్టవిరుద్ధ ప్రయాణమార్గాన్ని డంకీ ఫ్లైట్ అని వ్యవహరిస్తుంటారు). ఈ ఏడాది ఈ విధంగా అమెరికాలోకి ప్రవేశించటానికి ప్రయత్నించి అరెస్టయిన భారతీయుల వివరాలను 'అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్' తాజాగా వెల్లడించింది. 2023 అక్టోబరు 1 - 2024 సెప్టెంబరు 30 మధ్యకాలంలో (అమెరికా ఆర్థిక సంవత్సరం-2024లో) మెక్సికో, కెనడా సరిహద్దుల నుంచి అమెరికాలోకి అనధికారికంగా ప్రవేశించటానికి యత్నించి 29 లక్షల మంది దొరికిపోయారని ఈ వివరాలు తెలిపాయి. అరెస్టయిన వారిలో 90,415 మంది భారతీయులు కాగా.. వీరిలో దాదాపు సగం మంది గుజరాతీలే ఉండటం గమనార్హం. సగటున ప్రతీ గంటకు పది మంది భారతీయులు అమెరికాలోకి ప్రవేశించటానికి ప్రయత్నించి అధికారులకు దొరికిపోతున్నారు. ఎక్కువగా అమెరికా-కెనడా సరిహద్దు వద్దే అరెస్టవుతున్నారు. ఈ ఏడాది ఆ సరిహద్దు వద్ద 43,764 మంది దొరికిపోయారు.

తప్పుడు కేసు పెట్టి.. నిర్బంధించి..

ఉగాండాలో ఓస్వాల్ గ్రూపు కంపెనీల వారసురాలు వసుంధర అరెస్టు

- వంటమనిషి 'హత్య' కేసులో ప్రమేయం ఉందంటూ ఆరోపణలు
- ఖండించిన ఓస్వాల్ కుటుంబం
- వంట మనిషి బతికే ఉన్నాడని వెల్లడి



వసుంధర ఓస్వాల్

లండన్, అక్టోబరు 25: ఆఫ్రికా వ్యాప్తంగా పేరొందిన ఓస్వాల్ గ్రూపు కంపెనీల వారసురాలు వసుంధర ఓస్వాల్ అరెస్టు వ్యవహారం.. ఇప్పుడు అక్కడ సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల వయసున్న వసుంధర.. ఈ నెల 1వ తేదీన ఉగాండాలోని తమ ఫ్యాక్టరీని సందర్శించిన సమయంలో దాదాపు 20 మంది పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఓస్వాల్ కుటుంబంలో సహాయకుడిగా పని చేసిన ముఖేశ్ మేనరియా హత్యకు గురయ్యాడని, దీంట్లో వసుంధర ప్రమేయం ఉందని అభియోగాలు మోపారు. దాంతోపాటు పలు కార్పొరేట్ మోసాలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఆమె సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. లండన్‌లో ఉన్న ఓస్వాల్ గ్రూపు కంపెనీల అధిపతి పంకజ్ ఓస్వాల్.. కుమార్తె అరెస్టు విషయం తెలిసి హతాశుడయ్యారు. వసుంధరను సురక్షితంగా విడిపించటం కోసం ఆయన తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. ఉగాండా అధ్యక్షుడు యొవేరి ముసెవేనికి లేఖ రాశారు. ముఖేశ్ మేనరియా తమ వద్ద వంట మనిషిగా పని చేసేవాడని, దాదాపు రెండు లక్షల డాలర్లు అప్పు తీసుకున్నాడని, తమ ఇంట్లో విలువైన వస్తువులను దొంగిలించాడని లేఖలో పేర్కొన్నారు. అప్పు ఎగ్గొట్టే ఉద్దేశంతో ఉద్యోగం మానేసి, తమ మీద కిడ్నాప్, హత్య ఆరోపణలు చేశాడని తెలిపారు. పోలీసులు చెబుతున్నట్లుగా ముఖేశ్ హత్యకు గురి కాలేదని, టాంజానియాలో ఉన్నాడని తెలిపారు. వసుంధరను చట్టవ్యతిరేకంగా నిర్బంధించారని, ఆమెను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఐక్యరాజ్యసమితికి కూడా ఈ విషయమై విన్నవించారు. అయినప్పటికీ, వసుంధర విడుదల విషయంలో ముందడుగు పడకపోవటంతో పంకజ్ కుటుంబం తీవ్ర ఆందోళన చెందుతోంది. వసుంధరను అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితులు ఉన్న జైళ్లలో నిర్బంధిస్తున్నారని, తరచూ జైళ్లు మారుస్తున్నారని, సురక్షిత తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించటం లేదని వసుంధర చెల్లెలు రిధి ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన తర్వాత కొన్ని రోజులపాటు స్నానం చేయటానికి, బట్టలు మార్చుకోవటానికి కూడా ఆమెకు అనుమతి ఇవ్వలేదని తెలిపారు. వసుంధరను ఉగాండాకు ఎందుకు పంపించామా అని తమ తల్లిదండ్రులు తీవ్రంగా బాధపడుతున్నారని తెలిపారు. ఉగాండాకు వెళ్తే వారినీ అక్కడి అవినీతి అధికారులు అరెస్టు చేసే అవకాశం ఉందని, అందుకనే ఒక రహస్య ప్రదేశంలో ఉంటూ వసుంధర విడుదల కోసం శాయశక్తులా కృషి చేస్తున్నారని వెల్లడించారు. భారతీయ మూలాలున్న అభయ్ కుమార్ ఓస్వాల్.. ఓస్వాల్ కంపెనీని స్థాపించి పలు ఆఫ్రికా దేశాల్లో విస్తరించారు. ఆయన కుమారుడే పంకజ్ ఓస్వాల్. వీరి కుటుంబం స్విట్జర్లాండ్‌లో నివసిస్తోంది.

సాగర్‌కు పోటెత్తిన వరద..

» 12 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం నీటిని దిగువకు విడుదల చేశారు. 12 క్రస్ట్ గేట్లను 5 అడుగులు మేర పైకెత్తి 96,324 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా... నాగార్జున సాగర్ నీటి మట్టం 589.30 అడుగులు. ఇది 309.95 టీఎంసీలకు సమానం. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,17,203 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. సాగర్ కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,173, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,435, క్రస్ట్‌గేట్ల ద్వారా 96,324, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 400.. ఇలా మొత్తం 1,44,830 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

29 నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్స్

» రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లో భాగంగా ఈ నెల 29 నుంచి గ్యాస్ బుకింగ్స్ ప్రారంభమవుతాయని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన జీవోను విడుదల చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ దీపావళి నుంచే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎల్‌పీజీ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభిస్తారని, వెంటనే ప్రతి ఇంటికీ మొదటి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. గ్యాస్ బుకింగ్ చేసుకోగానే ఒక ఎస్ఎంఎస్ సంబంధిత లబ్ధిదారుని ఫోన్ నంబర్‌కు వెళుతుందని, బుక్ చేసుకున్న 24 గంటల్లో పట్టణ ప్రాంతాల్లో , 48 గంటల్లో గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. సిలిండర్ డెలివరీ చేసిన 48 గంటల్లోనే డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాలో నేరుగా రాయితీ సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత మార్గదర్శకాలు, విధి విధానాలపై ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు, 1.47 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని వీరిలో అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేస్తామన్నారు. ఈ పథకం అమలుకు ఏటా ప్రభుత్వంపై రూ. 2,684.75 కోట్ల భారం పడుతుందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్నా కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళల కోసం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏడాదికి మూడు సిలిండర్లు

ప్రభుత్వం అందజేసే మూడు ఉచిత సిలిండర్లలో మొదటి సిలిండర్ మార్చి 31లోపు, రెండోది జూలై 31 లోపు, మూడోది నవంబరు 30లోపు ఎప్పుడైనా పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ పథకం అమలు కోసం ఏడాదిని మూడు బ్లాక్ పీరియడ్లుగా పరిగణిస్తున్నామని, మొదటి బ్లాక్ పీరియడ్ ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు, రెండో బ్లాక్ పీరియడ్ ఆగస్టు 1 నుంచి నవంబరు 31 వరకు, మూడో బ్లాక్ పీరియడ్ డిసెంబరు 1 నుంచి మార్చి 31 వరకు పరిగణిస్తామన్నారు. ఈ పథకం అమల్లో లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబరు 1967 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఇంధన కంపెనీలకు 29న అడ్వాన్స్

ఉచిత సిలిండర్ల పథకం అమలుకు సంబంధించి ఇప్పటికే మూడు ఇంధన కంపెనీలతో మాట్లాడామని మంత్రి చెప్పారు. వారి వద్ద ప్రభుత్వం వద్ద ఉన్న డాటాను అనుసంధానపరుస్తూ ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ పథకం అమలు కోసం ఇంధన కంపెనీలకు అడ్వాన్సుగా రూ. 894.92 కోట్లను ఈ నెల 29న చెల్లిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లలో కేవలం 9.65 లక్షల గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం వర్తిస్తుందని తెలిపారు.

నిత్యావసరాల ధరలు అదుపులో ఉంచాం

పీడీఎస్ బియ్యం రీసైకిలింగ్ ఓ మాఫియాలాగా తయారైందని, కాకినాడలో 27 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పీడీఎస్ రైస్‌గా గుర్తించి 11 మందిపై కేసులను కూడా బుక్ చేశామని మంత్రి తెలిపారు. మాట ఇచ్చిన ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే చెల్లింపులు చేశామన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ధరల స్థిరీకరణకు ఓ కమిటీని సీఎం చంద్రబాబు వేశారన్నారు. ఆ వెంటనే కందిపప్పును రూ. 180 నుంచి రూ. 150కి తగ్గించే విధం గా హోల్‌సేల్ డీలర్లతో మాట్లాడామన్నారు. రేషన్ డిపోల ద్వారా కిలో కందిపప్పు రూ. 67 కే అందజేశామన్నారు. కమిటీ చొరవతో పామాయిల్ ధరను రూ. 130 నుంచి రూ. 110కి తగ్గించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,300 అవుట్‌లెట్స్ ద్వారా ప్రజలకు పంపిణీ చేశామన్నారు. మార్క్‌ఫెడ్ సహకారంతో ఉల్లిపాయలు, టమాటాలను రాయితీపై తక్కువ ధరలకే ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి సీఎం ఆమోదం తెలిపారని, రీ డిజైన్ చేసి త్వరలోనే వాటిని ఇస్తామని మంత్రి వెల్లడించారు.

నందిగం సురేశ్ లక్షలు నొక్కేశాడు!

కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తానని మోసం చేశాడు

» జనసేన పార్టీ జనవాణిలో బాధితుడి ఫిర్యాదు

» 650 మంది నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ కంపెనీ టోకరా

» గుంటూరు ఎస్పీతో మాట్లాడిన ఎమ్మెల్యే వరప్రసాద్

» బాధితులకు న్యాయం చేయాలని సూచన

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టులు ఇప్పిస్తామని ఆశ చూపి వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ తన నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేశాడని నున్నకు చెందిన ఎ.శివకిషోర్ జనసేన పార్టీ నిర్వహించిన జనవాణిలో ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. గత ఏడాది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాను ప్రస్తుతం కదలలేని స్థితిలో ఉన్నానని.. తనకు మాజీ ఎంపీ సురేశ్ నుంచి రావాల్సిన డబ్బును తిరిగి ఇప్పించాలని శివ కిషోర్ కోరారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కల్పించుకుని తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. డెవలప్ ట్రీస్ డీఎస్ఆర్ ఐటీ సొల్యూషన్స్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షల రూపాయిలు కట్టించుకుందని 650 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. గుంటూరు కేంద్రంగా నడిచిన ఈ బోర్డు తిప్పేసిందని, తమకు న్యాయం చేయాలని ఆర్జీ సమర్పించారు. అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, సంస్థ సీఈవో దగ్గుబాటి శ్రావణ్ నుంచి కనీస స్పందన లేదని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే వరప్రసాద్.. వెంటనే గుంటూరు జిల్లా ఎస్పీతో మాట్లాడారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని సూచించారు. తిరుపతికి చెందిన ఒక కానిస్టేబుల్ భార్య 9ఎఫ్ఎక్స్ గ్లోబల్ అనే సంస్థలో తమతో రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టించారని, 20 నెలల్లో డిపాజిట్ చేసిన మొత్తానికి రెట్టింపు చెల్లిస్తానని నమ్మబలికారని పువ్వాడి వెంకట్రావు దంపతులు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ఆ సంస్థ బోర్డు తిప్పేసిందని, సదరు కానిస్టేబుల్, ఆయన భార్య కూడా చేతులెత్తేశారని తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుని తమ సొమ్ము తిరిగి ఇప్పించాలని కోరారు. ఇలా ఇంకా చాలా మంది బాధితులు తమ సమస్యలపై జనవాణిని ఆశ్రయించారు. ఎమ్మెల్యే వరప్రసాద్ వారి సమస్యలు తెలుసుకుని కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధిత కార్యాలయాలకు పంపించారు.

పదోన్నతి పొందిన జిల్లా జడ్జీలకు పోస్టింగులు

» 4లోగా బాధ్యతలు చేపట్టాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జిల్లా జడ్జీలుగా పదోన్నతి పొందిన 13 మంది న్యాయాధికారులకు పోస్టింగ్ ఇస్తూ శుక్రవారం హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ఉత్తర్వులు ఇచ్చారు. వీరందరూ నవంబరు 4లోగా కొత్త స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన న్యాయాధికారులకు పోస్టింగులు ఇలా.. ఎం.ఇందిర ప్రియదర్శిని..తెనాలి పోక్సో కోర్టు; వి.భవాని..విజయవాడ పోక్సో కోర్టు; వై.నాగరాజ..గుంటూరు 2వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి; సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్..శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు/మూడవ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి; పి.శ్రీనివాసరావు..నందిగామ 16వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి; ఎస్.కవిత..గాజువాక 8వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి; ఎం.అనురాధ..కొవ్వూరు 9వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి; సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు..గుంటూరు మూడవ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి; ఏ అనిత..గుంటూరు పోక్సో కోర్టు; పి.రాజారాం..విజయవాడ మహిళా కోర్టు/5వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి, కె.విజయ కల్యాణి..విజయనగరం ఫ్యామిలీ కోర్టు/3వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి; బి.లక్ష్మీనారాయణ..భీమవరం పోక్సో కోర్టు; బి.అప్పలస్వామి..విజయనగరం ఎస్సీఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి/4వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి. మరోవైపు.. ఇప్పటికే గుంటూరు 2వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న వీఏఎల్ సత్యవతిని గుంటూరు 1వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జిగా, శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు/ మూడవ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న పి.భాస్కరరావును శ్రీకాకుళం 1వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జిగా, విజయనగరం ఫ్యామిలీ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎం.మీనాదేవిని విజయనగరం 1వ అదనపు జిల్లా-సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు.

11లోపు 'పది' పరీక్షల ఫీజు చెల్లించాలి

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజుల చెల్లింపులకు ప్రభుత్వ పరీక్షల విభాగం తేదీలు ప్రకటించింది. ఈ నెల 28 నుంచి నవంబరు 11 వరకు విద్యార్థులు.. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఫీజులు చెల్లించాలని విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. నవంబరు 12 నుంచి 18 వరకు చెల్లిస్తే రూ.50, 19 నుంచి 25 వరకు చెల్లిస్తే రూ.200, 26 నుంచి నెలాఖరు వరకు అయితే రూ.500 అదనంగా ఫైన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.125 అని తెలిపారు.

అలాంటి వారు కాలినడకన తిరుమలకు రావద్దు

» వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారికి టీటీడీ సూచన

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ, కీళ్ల వ్యాధులు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు ఉన్న భక్తులు, 60 ఏళ్లు దాటిన వృద్ధులు తిరుమలకు కాలినడకన రావడం శ్రేయస్కరం కాదని టీటీడీ పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల తిరుమలకు కాలినడకన వస్తున్న భక్తుల్లో గుండె సంబంధిత కేసులు అధికంగా నమోదవుతున్నాయని ఆ ప్రకటనలో తెలిపింది. 'తిరుమల కొండ సముద్రమట్టానికి చాలా ఎత్తులో ఉన్న క్రమంలో ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉంటుంది. కాలినడకన రావడం చాలా ఒత్తిడితో కూడుకున్న విషయం కావడంతో ఆరోగ్య సమస్యలు ఉన్న భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. భక్తులకు ఏదైనా సమస్య ఎదురైతే అలిపిరి మార్గంలో 1500వ మెట్టు, గాలిగోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్య సహాయం పొందవచ్చు' అని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ఏపీఎన్ఆర్టీ చైర్మన్‌గా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ప్రోటోకాల్ డైరెక్టర్‌గా, డిప్యూటీ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం బాలసుబ్రహ్మణ్యం రెడ్డిని ఆ పదవి నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ చేతివృత్తుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీగా పూర్తి అదనపు బాధ్యతల నుంచికూడా ఆయనను తప్పించింది. ఆయన మాతృసంస్థ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చర్ శాఖకు బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు, రేపు సింహపురి ఎక్స్‌ప్రెస్ రద్దు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : శని, ఆదివారాల్లో సికింద్రాబాద్-గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. శనివారం నాడు సికింద్రాబాద్ నుంచి బయల్దేరే(12710) రైలును రద్దు చేయగా, ఆదివారం గూడూరు నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే(12709) రైలు కూడా రద్దయినట్లు అధికారులు పేర్కొన్నారు. దానా తుపాను కారణంగా హౌరా నుంచి సికింద్రాబాద్‌కు రావాల్సిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రద్దు కావడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా రెడ్డిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ కార్పొరేట్ స్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆ స్కూల్ వసతిగృహంలోనే ఆత్మహత్య చేసుకున్న ఘటనను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. విద్యార్థిని ఆత్మహత్యపై నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. పోలీసుల దర్యాప్తు తీరు, పోస్టుమార్టం వివరాలను నివేదికలో పొందుపర్చాలని ఎన్‌హెచ్ఆర్సీ ఆదేశించింది.

కొయ్యూరు ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

కొయ్యూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లర్లతో చేతులు కలిపిన అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు సబ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణను విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టి సస్పెండ్ చేశారు. ఎస్ఐ రామకృష్ణ ఈ ఏడాది జూలై నాలుగో తేదీన గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్ఐ.. నిందితులపై కేసు పెట్టకుండా విడిచిపెట్టేశారు. అందుకు నిందితుల నుంచి రూ.1.25 లక్షలు తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అమెరికా అధ్యక్ష ఎన్నికలు మరింత దగ్గరకొచ్చిన తరుణంలో, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మీద వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనాన్ని ప్రచురించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో రెండేళ్లనుంచి ఎలాన్ మస్క్ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారని, వ్యక్తిగత అంశాలనుంచి వ్యాపార వాణిజ్యాలు, యుద్ధాలు, అంతర్జాతీయ సంబంధాలు కూడా వారిద్దరూ చర్చించుకుంటున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆరోపించింది. మస్క్‌తో వ్లాదిమిర్ పుతిన్ ఒక సందర్భంలో చైనాకు అనుకూలంగా మాట్లాడారని, స్టార్‌లింక్ శాటిలైట్ నెట్‌వర్క్‌ను తైవాన్ మీద యాక్టివేట్ చేయకుండా చైనాకు సహకరించమని చెప్పారని సదరు పత్రిక రాసింది. పుతిన్‌తో మస్క్ సాన్నిహిత్యం పతాకస్థాయిలో ఉన్నదని ఈ కథనం సారాంశం. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు తన స్టార్‌లింక్ ద్వారా ఎలాన్ మస్క్ సహకరిస్తున్నాడని ఇప్పటికే ఆరోపణలు రావడం, అవన్నీ అబద్ధాలని ఈ టెస్లా అధినేత ఖండించడం తెలిసిందే. ఈ కొత్త కథనాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి కొట్టిపారేశారు. గతంలోనూ పుతిన్‌తో మస్క్ మాట్లాడారన్న ఆరోపణలు రావడం, అవి నిజం కాదని రష్యా అనడం తెలిసిందే. 2022లో ఒకే ఒక్కసారి వారిద్దరి మధ్యా అది కూడా అంతరిక్ష రంగానికి సంబంధించి మాత్రమే సంభాషణ జరిగిందని రష్యా అప్పట్లో చెప్పింది. అయితే, రష్యా అధ్యక్షుడితో మస్క్ సంబంధాల గురించి, కీలకమైన అంశాలతో వెలువడిన ఈ వాల్‌స్ట్రీట్ కథనం దేశ భద్రతకు సంబంధించి అమెరికా ప్రభుత్వానికి పరోక్షంగా ఓ సవాల్ విసిరింది. స్పేస్ ఎక్స్ సహా మస్క్‌కు చెందిన చాలా సంస్థలు అమెరికా సైన్యంతోనూ, ప్రభుత్వ సంస్థలతోనూ భాగస్వామ్యంలోనూ, విస్తృతమైన లావాదేవీల్లోనూ ఉన్న విషయం తెలిసిందే. దాదాపు మూడువందలకోట్ల డాలర్ల ఒప్పందాల కారణంగా, మస్క్ సంస్థల వద్ద అత్యంత కీలకమైన సమాచారం ఉంటుంది. ప్రభుత్వ విభాగాలన్నీ ఆయన స్టార్‌లింక్ సేవలను వినియోగించుకుంటున్నాయి. కనుక, పుతిన్‌తో సాన్నిహిత్యం మీద ఈ కొత్త కథనం చిన్న విషయమేమీ కాదు.


మరో కుట్రకథనం

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నూ, ఆయన మళ్ళీ అధ్యక్షుడు కావడానికి కోట్లు కుమ్మరిస్తున్న ప్రపంచ కుబేరుడు మస్క్‌నీ ఏకకాలంలో గురిపెట్టిన కథనం ఇది. అమెరికా బద్ధశత్రువు పుతిన్‌తో ట్రంప్‌కు అవధులు లేని దోస్తీ ఉన్నదని, ట్రంప్ తొలి విజయంలోనూ పుతిన్ హస్తం ఉన్నదని అప్పట్లోనే అనేక కథనాలు వచ్చాయి. గత ఎన్నికల్లో ఆఖరుక్షణం వరకూ ఆయనను నిలబెట్టేందుకు పుతిన్ రహస్య కుట్రలు చేశారన్న విమర్శలూ వచ్చాయి. అమెరికా అధ్యక్షుడుగా దిగిపోయిన తరువాత కూడా ట్రంప్–పుతిన్ మధ్య రహస్యబంధం కొనసాగుతోందని చాలా కథనాలు వచ్చాయి. పాత్రికేయుడు బాబ్‌వుడ్‌వర్డ్ తన పుస్తకంలో, పుతిన్‌కు ట్రంప్ కొవిడ్ టెస్ట్ కిట్లు పంపించారని, ఇద్దరూ రోజూ చాటింగ్ చేసుకుంటారని రాశారు. కొవిడ్ కిట్లు పంపిన మాట నిజమే కానీ, టచ్‌లో ఉండటం మాత్రం అబద్ధమని రష్యా అంటోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా సాగుతున్న పలువిచారణల్లో అమెరికా అంతర్గత వ్యవహారాల్లో పుతిన్ జోక్యం, పదవీచ్యుతుడైన తరువాత పుతిన్‌తో సంబంధాల అంశం కూడా ఉన్నాయి. ఇప్పుడు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన మస్క్ సైతం శత్రువు చేయి కలిపాడని అంటోంది. తాను రేపు అధికారంలోకి వస్తే మస్క్‌కు సమస్త వ్యవస్థలను ప్రక్షాళించే కీలకమైన పదవిని కట్టబెడతానని ట్రంప్ గతంలోనే ప్రకటించారు. మంత్రికావచ్చు లేదా సలహాదారుగా చక్రం తిప్పవచ్చు అని ముందే ప్రకటించారు. ట్రంప్ అధ్యక్షుడైతే సెల్ఫ్ డ్రైవింగ్ కార్లకు సంబంధించిన నిబంధనల సడలింపు సహా తాను ఏయే ప్రతిపాదనలు చేయబోతున్నానో మస్క్ కూడా సెలవిచ్చారు. తాను అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుందని ట్రంప్ హామీ ఇవ్వడం, ఉక్రెయిన్ కొన్ని భూభాగాలను రష్యాకు వదులుకొని, నాటోలో చేరనని హామీ ఇవ్వాలంటూ మస్క్ ప్రతిపాదించడం తెలిసిన విషయాలే. ఉక్రెయిన్‌తో యుద్ధంలో తన స్టార్‌లింక్ సాటిలైట్ సర్వీసుల ద్వారా రష్యాకు కీలకమైన సమయాల్లో మస్క్ సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ప్రస్తుతం ట్రంప్ పక్షాన మస్క్ స్వయంగా ఎన్నికల ప్రచారంలోకి దిగడమే కాక, వందలకోట్ల డాలర్ల విరాళాలు ఇస్తున్నారు. కీలకమైన రాష్ట్రాల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఏవేవో పథకాలు, ప్రతిపాదనలతో డబ్బు ఎరవేస్తున్నారు. అమెరికా ఓటర్లమీద మస్క్ విన్యాసాలు, ఈ సరికొత్త కథనం ఏ మేరకు ప్రభావితం చూపుతాయో తెలియదు. కానీ, పరుగుపందెంలో విజేత ఎవరో తేలిపోతున్న ఈ ఆఖరుక్షణంలో ప్రత్యర్థుల పక్షాన ఇటువంటి కుట్రకథనాలు రావడంలో ఆశ్చర్యమేమీ లేదు అని రష్యా చేసిన వ్యాఖ్య మాత్రం విచిత్రమైనది.

నైపుణ్యదృష్టితోనే విశ్వవిద్యాలయాల పురోగతి

రాష్ట్ర విశ్వవిద్యాలయాల్ని ప్రపంచ విశ్వవిద్యాలయాల పక్కన నిలబెడతామని చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళూ ఉన్నత విద్యావ్యవస్థని నిలువునా ముంచేసింది. రాష్ట్రంలోని యువతనూ నిర్వీర్యం చేసింది. ఇప్పటివరకు రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు సాంప్రదాయ పద్ధతుల్లోనే పాఠ్యప్రణాళికలను అమలు చేస్తున్నాయి. నేడు వీటిని కనీసం జాతీయ విశ్వవిద్యాలయాలు, సంస్థల సరసన చేర్చాలంటే ప్రభుత్వాలు నైపుణ్యాల పెంపుదల పట్ల శ్రద్ధ వహించాలి.

వస్తు తయారీ, వాహన, సమాచార సాంకేతిక రంగాలు, వైద్య ఆరోగ్యం, నిర్మాణ రంగాల్లో రాష్ట్ర యువత స్థానం దక్కించుకోవాలంటే తగిన నైపుణ్యవిద్యను అందిపుచ్చుకోవాలి. దీనికి కోర్సు వ్యవధిలోనే పరిశ్రమల్లో విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణ అందించాలి. దీంతో విద్యార్థులు వృత్తిపరమైన సంస్థల్లో పని ఒత్తిడి, అంచనాలను నిర్వహించడంలో విశ్వాసంతో పని చేయగలుగుతారని స్టాన్‌ఫోర్డ్, దేశీయంగా మరికొన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాలు నిరూపించాయి. ఇక్కడే పరిశోధన, నైపుణ్యాల ఆధారిత విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉన్నత విద్య భవిష్యత్తును మార్చగలుగుతాయని రుజువయింది. ఈ లక్ష్యాలను చేరుకోవాలంటే అర్హతలు, అనుభవం కలిగిన శక్తివంతులు తప్పనిసరిగా విద్యారంగానికి అవసరమవుతారు. వీరితోనే అధునాతనంగా చోటుచేసుకున్న రోబోటిక్స్, కృత్రిమ మేధ వంటి విజ్ఞాన శాస్త్రాలను త్వరితగతిన అందించిపుచ్చుకోగల సామర్థ్యాలను సాధించగలుగుతారు.



దేశ తక్షణ అభివృద్ధికి అవసరమయిన రంగాలలో నైపుణ్యాభివృద్ధి కీలకమైనదిగా ప్రభుత్వం గుర్తించింది. నైపుణ్య శిక్షణ పొందినవారిలో ఉద్యోగిత పెరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్నవారి సంఖ్య తగ్గుముఖం పడుతుంది. దీంతో ప్రభుత్వం సంక్షేమానికి చేసే ఖర్చు కూడా తగ్గుతుంది.

రాష్ట్ర విశ్వవిద్యాలయాలు తగిన నైపుణ్యాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించవలసి ఉంది. అందుకు తగిన కోర్సులను తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేవాలి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఆయా పాఠ్యప్రణాళికలను తగిన బోధనా సామర్థ్యాలు కలిగిన అధ్యాపకులతోనే నిర్వహించాలి. దశాబ్ద కాలం కిందటే వెనుకబడిన వర్గాల విద్యార్థుల కోసం యూజీసీ 'ఎర్న్ వైల్ లెర్న్' పథకాన్ని ప్రతిపాదించింది. దీనిని మానవ వనరుల మంత్రిత్వశాఖ పర్యవేక్షిస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువుకునే దశలో అవకాశాల కోసం మార్గదర్శకాల ముసాయిదాను యూజీసీ అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం భారతదేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మధ్య అంతరాన్ని చెరిపేస్తుందని నిపుణులు భావించారు. కాని ఇది ఆచరణలో ఇంకా వెనుకబడే వుంది. 2019–20 విద్యాసంవత్సరంలోనే యూజీసీ మూడువందల సంస్థల్లో 346 వృత్తి విద్యాకోర్సులకు అనుమతిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో స్వయం ప్రతిపత్తి కలిగిన 12 కళాశాలలు ఈ కోర్సులు ప్రారంభించాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం వీటికి తగిన మౌలిక సదుపాయాలు కూడా అందించకపోవడంతో కళాశాలలు ఈ కోర్సులను కొనసాగించలేకపోయాయి. ఇటీవల దేశవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి మీద జరిగిన పరిశోధనలు కొన్ని ప్రాథమిక అవసరాలను వెల్లడించాయి. వీటిలో ముఖ్యంగా ఎంటర్‌ప్రెన్యూర్ రేపటి నైపుణ్యాల కోసం ఇంక్యుబేషన్ సెంటర్లు, అంకురంలు, నిరంతర అభ్యాస కార్యక్రమాల ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరింది. దీనిని అనుసరించి అందుకు తగిన విధంగా రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం అండగా నిలబడాలి. అప్పుడే విజ్ఞానం, నైపుణ్యాలు కలిసి ఆర్థిక వృద్ధికి చోదకశక్తులుగా పనిచేస్తాయి. దీంతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుంది.

దేశంలో డిమాండ్‌కు తగిన విధంగా నైపుణ్యం అందుబాటులోకి రాలేదు. శ్రామికశక్తి అందుబాటులో ఉన్నప్పటికీ దీనికి నైపుణ్యశక్తి లేకుండా పోయింది. వీటి మధ్య సమతుల్యత సాధించాలంటే ఉన్నత విద్యారంగంలో కొన్ని నిర్మాణాత్మక సంస్కరణలతోనే సాధ్యమవుతుంది. అప్పుడే యువత తగిన సామర్థ్యం కలిగిన విద్యతో ఉపాధిని పొందగలుగుతుంది. రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి చదివిన విద్యార్థులు ప్రపంచ ఉపాధిరంగంలో సముచితస్థానాన్ని ఆక్రమించగలుగుతారు. ఇప్పుడు వేగంగా పెరిగిపోతున్న దేశ జనాభాకు తగిన ఉపాధి కావాలి. శ్రామికశక్తికి తగినంత ఉపాధి అవకాశాలు ఉండేలా ఎప్పటికప్పుడు విధానరూపకర్తలు చాలా అధ్యయనాలు అందుబాటులోకి తీసుకొస్తూనే ఉన్నారు. దేశ తక్షణ అభివృద్ధికి అవసరమయిన రంగాలలో నైపుణ్యాభివృద్ధి కీలకమైనదిగా ప్రభుత్వం గుర్తించింది. నైపుణ్య శిక్షణ పొందినవారిలో ఉద్యోగిత పెరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్నవారి సంఖ్య తగ్గుముఖం పడుతుంది. దీంతో ప్రభుత్వం సంక్షేమానికి చేసే ఖర్చు కూడా తగ్గుతుంది.

పరిమిత జనాభాకు మాత్రమే అందుబాటులో ఉన్న నాణ్యమయిన ఉన్నత విద్యను ఎక్కువ మందికి చేరువచేయాలని నేటి ప్రభుత్వం ఇప్పటికే నడుం బిగించింది. ఉత్పాదకరంగాన్ని వేగంగా అభివృద్ధి చేసేందుకు తగిన సంఖ్యలో శాస్త్ర, సాంకేతికరంగాల్లో నిపుణుల అవసరాన్ని గుర్తించి వ్యూహ రచనకు పూనుకుంది. డెలాయిట్, నాస్కామ్ సంయుక్త నివేదిక ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాలు టెక్ హబ్‌లుగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొంది. ఈ నగరాలు టెక్ మార్కెట్లో కొత్తగా ప్రవేశించినప్పటికీ నైపుణ్య శ్రామికశక్తితో వేగంగా పుంజుకున్నాయి. ముఖ్యంగా హార్డ్‌వేర్, ఐఓటీ, ఫుడ్‌టెక్, సాఫ్ట్‌వేర్ డేటా స్టార్టప్‌లలో విశాఖపట్నంతో పాటు విజయవాడకు ప్రాధాన్యత పెరుగుతోంది. మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్, రెవెన్యూ సైకిల్ మేనేజ్‌మెంట్‌లో కూడా ఇది రాణిస్తోంది. దేశంలోని ప్రధాన నగరాలతో బలమైన అనుసంధానాన్ని కలిగిన నగరంగా విశాఖపట్నాన్ని ఈ నివేదిక ప్రముఖంగా పేర్కొంది.

పదహారేళ్ళ నుంచి అరవై ఏళ్ళ మధ్య వయస్సు గల వారి నిష్పత్తి క్రమం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, సంస్థలు కీలకపాత్ర పోషించాలి. ప్రభుత్వం ఈ కోర్సులను ప్రారంభించడానికి స్వయం ప్రతిపత్తిగల సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ అనుబంధ కళాశాలలను నైపుణ్య కేంద్రాలుగా పరిగణనలోకి తీసుకోవాలి. స్థానిక విశ్వవిద్యాలయాలు రూపొందించిన పాఠ్యప్రణాళికను తప్పనిసరిగా అమలుచేయాలి. సామాజికశాస్త్రాలను సైతం శాస్త్రీయంగా, సాంకేతికంగా బోధించి ఆ విద్యకు ఉపాధి సామర్థ్యాలను పెంపొందించాలి. భాషాపరిజ్ఞానాన్ని పెంచి ప్రచార, ప్రసార, వినోద రంగాల్లో వాడే నైపుణ్యాన్ని అలవర్చాలి. యూజీసీ సిఫార్సు చేసిన బ్రిడ్జి కోర్సులను అమలు చేయాలి. ఇవి సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సమూహాల (ఎస్‌ఈడీజీ) విద్యార్థుల పనితీరును మెరుగుపరిచేందుకు ఉపకరిస్తాయి. ఈ కార్యాచరణకు విశ్వవిద్యాలయాలే తగిన వేదికలుగా నిలవవలసి వుంది.

● డాక్టర్ జీకేడీ ప్రసాద్

సరిహద్దుపై సయోధ్య సాధ్యమేనా?

చైనా మహా నాయకుడడు మావో గురించి అనేక ఐతిహ్యాలు ఉన్నాయి. నాకు బాగా ఇష్టమైనది: అమెరికా పాత్రికేయుడు, సుప్రసిద్ధ 'రెడ్‌స్టార్ ఓవర్ చైనా' గ్రంథకర్త ఎడ్గార్ స్నో కాబోలు ఒకసారి మావోను 'మానవాళి చరిత్రపై ఫ్రెంచ్ విప్లవం ప్రభావం ఏమిటి?' అని ప్రశ్నించగా ఆయన కొంచెంసేపు ఆలోచనామగ్నుడై 'ఇప్పుడే చెప్పలేము' అని అన్నారట.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

చైనా వేచి ఉంది. చాలా ఓర్పు గల దేశమది. ప్రపంచంలో రెండో పెద్ద ఆర్థిక వ్యవస్థ తమది అని గొప్పలు చెప్పుకోదు. ప్రపంచ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ప్రభవించేందుకు ఒక నిర్దిష్ట తేదీని చైనా నిర్దేశించుకోలేదు. ప్రపంచ అగ్రగామిగా ఆవిర్భవిస్తున్న దేశంలో అటువంటి గుణ విశేషాలు అరుదు. మరో పార్శ్వం నుంచీ చైనాను చూద్దాం. అది ప్రజాస్వామిక వ్యవస్థ కాదు. ప్రజాస్వామిక దేశాలలో అందరికీ లభించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు చైనా ప్రజలకు లేవు. చైనాకు భిన్నంగా భారత్ చాలవరకు ఒక ప్రజాస్వామిక దేశం. నిత్యం ఒక క్రమబద్ధమైన అరాచకంతో కోలాహలంగా ఉంటుంది. జగడాలకు జనులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. భారత్‌లో చిన్న చిన్న సాఫల్యాలకే పెద్ద ఎత్తు విజయోత్సవాలు జరుపుకోవడం పరిపాటి. ఉదాహరణకు ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో మన దేశానికి లభించిన పతకాలు ఎన్నో చూడండి: అమెరికా 40 స్వర్ణ, 44 రజత, 42 కాంస్య పతకాలను గెలుచుకున్నది. చైనాకు 39 స్వర్ణ, 27 రజత, 24 కాంస్య పతకాలు లభించాయి మరి మనకో? ఒలింపిక్ పతకాలను గెలుచుకోవడంలో 71వ స్థానంలో ఉన్న భారత్‌కు స్వర్ణ పతకాలు పూజ్యం, 1 రజత, 5 కాంస్య పతకాలు లభించాయి. అమెరికా, చైనాలో కంటే మన దేశంలోనే వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి!

హిమాలయ పొలిమేరలో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) వెంబడి గస్తీ ఏర్పాట్ల విషయమై కొద్ది రోజుల క్రితం కుదిరిన ఒప్పందాన్ని భారత్, చైనాలు ప్రకటించిన తీరును గమనిస్తే రెండు దేశాల మనోవైఖరులలో వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. మే 2020లో సంభవించిన ఘర్షణల అనంతరం ఉభయ దేశాల మధ్య చోటుచేసుకున్న తొలి సానుకూల పరిణామం ఆ ఒప్పందమే. భారత్ తరఫున మన విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు; విదేశాంగమంత్రి ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు; సైనిక దళాల ప్రధానాధికారి ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆ ఒప్పందం గురించి ప్రస్తావించారు. 'మే 2020కు ముందు నాటి పరిస్థితులకు మళ్లామని' విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. అయితే సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ మనోజ్ పాండే ఇలా చెప్పారు: 'ఏప్రిల్ 2020 నాటి యథా పూర్వస్థితి తిరిగి నెలకొనాలని మనం కోరుకుంటున్నాం. ఆ పరిస్థితులు నెలకొన్న తరువాత ఉద్రిక్తతల సడలింపు, బలగాల ఉపసంహరణ, వాస్తవాధీన రేఖ వెంబడి మామూలు పరిస్థితుల నిర్వహణ మొదలైన అంశాలపై శ్రద్ధ చూపుతాం'. చైనా తరఫున ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ ఒప్పంద యథార్థాలను తెలుపుతూ ఒక ప్రకటన చేశారు. 'సరిహద్దులకు సంబంధించిన వ్యవహారాలపై దౌత్య, సైనిక వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నాయి. సరిహద్దు సంబంధిత వివాదంపై రెండు దేశాలు ఇప్పుడు ఒక పరిష్కారానికి వచ్చాయి. దాని పట్ల చైనా సానుకూల వైఖరితో ఉన్నది. తదుపరి దశలో చైనా ఆ పరిష్కారాన్ని అమలుపరిచేందుకు భారత్‌తో కలిసి చైనా పని చేస్తుంది'. అయితే ఎలా పని చేస్తుందనే విషయమై వివరాలు వెల్లడించేందుకు ఆయన నిరాకరించాడు.

సరే, గత ఆదివారం (20, అక్టోబర్) దాకా ఉన్న పరిస్థితిని గుర్తు చేసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. మార్చి–ఏప్రిల్ 2020లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ దళాల వాస్తవాధీన రేఖను దాటి భారత భూభాగాల్లోకి చొరబడ్డాయి. ఈ దురాక్రమణ మే 5, 2020న భారత్ దృష్టికి వచ్చింది చొరబాటుదారులను వెనక్కి తిప్పికొట్టే క్రమంలో 20 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చైనా పక్షాన కచ్చితంగా తెలియని సంఖ్యలో సైనికులు చనిపోయినట్టు తెలుస్తుంది. జూన్ 19, 2020న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. తన ముగింపు సమావేశంలో ఆయన ఈ అప్రతిష్ఠాకర వ్యాఖ్యలు చేశారు: 'బయటి వ్యక్తులు ఎవరూ భారత భూభాగంలోకి చొరబడలేదు. బయటివారు ఎవరూ భారత్ లోపల లేరు'. అయితే మన సైనిక దళాలు మే 2020కు పూర్వం నిత్యం గస్తీ తిరిగిన దాదాపు 1000 చదరపు కిలోమీటర్ల ప్రాంతంపై భారత్‌కు ఇంకెంత మాత్రం ఎలాంటి నియంత్రణ లేదని పలువురు సైనికాధికారులు, రక్షణ వ్యవహారాల నిపుణులు ఘంటాపథంగా చెప్పుతున్నారు.

కఠోరమైన విషయమేమిటంటే గల్వాన్ లోయ అంతా తమదేనని చైనా వాదిస్తోంది. వాస్తవాధీనరేఖ విషయమై భారత్‌లో స్పష్టత లోపించిందని విమర్శిస్తోంది. హాట్ స్ప్రింగ్స్ ప్రాంతానికి సంబంధించి ఒక్క అంగుళం కూడా భారత్‌కు చెందదని చైనా నిక్కచ్చిగా అంటోంది. డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాలపై చర్చలు జరపాలని భారత్ డిమాండ్ చేస్తుండగా చైనా నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. భారత్‌తో 3,448 కిలోమీటర్ల పొడవునా ఉన్న సరిహద్దులోని అక్సాయిచిన్ ప్రాంతంలో సైనిక స్థావరాలను చైనా భారీ ఎత్తున ఏర్పాటు చేస్తోంది. వాస్తవాధీన రేఖ దాకా 5జి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తోంది. పాంగోంగ్ సో నదిపై ఒక వంతెనను నిర్మించింది. పెద్ద ఎత్తున సైనిక సామగ్రి, సైనిక దళాలను పెద్ద ఎత్తున వాస్తవాధీన రేఖ వెంబడి మోహరించింది.

మన అధికారిక వైఖరి ఏమిటో చూద్దాం. ఇంతకు ముందున్న పరిస్థితి అంటే మే 2020కు పూర్వ స్థితిని పునరుద్ధరించినట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది సైనిక దళాల ఉపసంహరణ, ఉద్రిక్తతల సడలింపు మొదలైన పదాలు ప్రభుత్వ ప్రకటనలలో ఉంటున్నాయి. ఏమైనా మన ప్రభుత్వం గొప్ప ఓర్పు, గట్టి పట్టుదల చూపిందని చెప్పవచ్చు. అయినా గస్తీ సంబంధిత ఒప్పందం నిజంగా ఉంటే అందులో 'ఇంతకు ముందున్న పరిస్థితి' అనే మాటకు బదులు 'కీలకమైన పురోగతి' అనే మాటను వాడాలని చైనా పట్టుబట్టి ఉండేది కాదూ? చైనా ఎప్పుడు ఏ విధంగా ప్రవర్తిస్తుందనేది ఒక సందిగ్ధ విషయం. అయినప్పటికీ మన ప్రభుత్వం దృఢ వైఖరితో నిలబడడం వల్ల అంతిమంగా మనకు మేలు జరిగేందుకు ఎంతైనా ఆస్కారమున్నది.



గత నాలుగు సంవత్సరాలుగా పార్లమెంటులో ఒక్కసారి కూడా భారత్–చైనా ఘర్షణలపై చర్చించేందుకు అనుమతించకపోవడం మన ప్రజాస్వామ్యానికి ఒక కళంకం. సరిహద్దుల్లో గస్తీపై ఒప్పందం విషయంలో అత్యంత జాగరూకతతో ఉండాలని రక్షణ వ్యవహారాల నిపుణులు ముక్తకంఠంతో చెప్పుతున్నారు. భారత్ చైనాలు సరిహద్దు వివాదాన్ని సంప్రదింపుల ద్వారా సమగ్రంగా పరిష్కరించుకునేందుకు ఆ ఒప్పందం దారితీస్తుందా? ఇప్పుడే ఇదమిత్థంగా చెప్పలేము.

మొత్తం మీద హిమాలయ సరిహద్దుల్లో గస్తీ ఏర్పాట్ల విషయమై భారత్, చైనాలు ఒక అంగీకారానికి వచ్చినట్టు కనిపిస్తోంది. అంతకుమించి ఏమీ లేదు అని అనుకోవచ్చు. చైనా వైపు, మన వైపు గస్తీ దళాల మధ్య సమన్వయముంటుంది. నెలకు రెండుసార్లు సమావేశమవుతాయి. గస్తీ బృందాలు ఒక్కో దానిలో ఉండే సైనికుల సంఖ్య 15కు మించదు. ఈ గస్తీ ఏర్పాట్లు డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాలకు సైతం వర్తిస్తాయా అన్నది స్పష్టంగా తెలియదు. తూర్పు లద్దాఖ్‌లోని డెమ్‌చోక్ విషయంలో 2017లో ఉభయ దేశాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అయితే ఆ తరువాత చైనా సైనిక దళాలు ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాయి. అక్కడ తమ సైనిక స్థావరాలను పటిష్ఠం చేసుకున్నాయి. డెప్సాంగ్ మైదాన ప్రాంతాలలో వై జంక్షన్‌కు ఆవల ప్రదేశాలలోకి భారత సైనికులు ప్రవేశించేందుకు చైనా అనేక అవరోధాలు కల్పిస్తోంది. ఏ నాటి నుంచో ఉన్న 10, 11, 11ఎ, 12, 13 గస్తీ కేంద్రాల పరిధిలోని ప్రదేశాలలోకి కూడా అనుమతించడం లేదు. గల్వాన్ లాంటివి ఇరు దేశాల మధ్య ఘర్షణలకు కారణమవుతున్నాయి. అలాగే పాంగోంగ్ సో నది ఉత్తర, దక్షిణ తీర ప్రాంతాలు, హాట్‌స్ప్రింగ్స్ మొదలైన వాటిపై కూడా చైనా నియంత్రణ కొనసాగుతోంది. ఉభయ దేశాల మధ్య తీవ్రస్థాయిలో ఉన్న ఈ వివాదాస్పద అంశాలకు నిజంగా పరిష్కారం లభించిందా? భవిష్యత్తులో లభించగలదా? లభించిందని లేదా లభించగలదని విశ్వసించడం చాలా కష్టం. చెప్పవచ్చినదేమిటంటే భారత్, చైనాల మధ్య సంబంధాలలో పరస్పర అపనమ్మకం ఇప్పటికీ ఒక అంతర్వాహినిగా ఉన్నది.

గత నాలుగు సంవత్సరాలుగా పార్లమెంటులో ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా భారత్–చైనా ఘర్షణలపై చర్చించేందుకు అనుమతించకపోవడం మన ప్రజాస్వామ్యానికి ఒక కళంకం. సరిహద్దుల్లో గస్తీపై ఒప్పందం విషయంలో అత్యంత జాగరూకతతో ఉండాలని రక్షణ వ్యవహారాల నిపుణులు ముక్తకంఠంతో చెప్పుతున్నారు; కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన, ఉపయుక్తమైన ప్రశ్నలు లేవనెత్తింది; ఇతర విపక్షాలు మౌనంగా ఉండిపోయాయి. భారత్, చైనాలు సరిహద్దు వివాదాన్ని సంప్రదింపుల ద్వారా సమగ్రంగా పరిష్కరించుకునేందుకు అక్టోబర్ ఏకాభిప్రాయం (అక్టోబర్ కన్సెన్సస్) పురిగొల్పుతుందా? ఇప్పుడే ఇదమిత్థంగా చెప్పలేము.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అమెరికా, కెనడాల శ్రీరంగనీతులు

ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య స్వంత అవసరాలే మిత్రత్వానికైనా, శత్రుత్వానికైనా ఏకైక ప్రాతిపదిక అవుతున్నాయి. ఈ ధోరణి ఎంతో కొంత ముందు నుండే ఉన్నప్పటికీ, సైద్ధాంతికతనో, ఉమ్మడి ప్రయోజనాలో కొంత భూమికను పోషించేవి. ఇప్పుడా మొహమాటాల తెర తొలగి స్వార్థ ధోరణి పెచ్చరిల్లింది. నిన్నటి విధానం మార్చుకుని నేడు కొత్తపాట అందుకోడానికి ఏ మాత్రమూ జంకు చూపించడం లేదు. శాశ్వత స్నేహాల వరకూ ఎందుకు, నిలకడైన స్నేహాలు కూడా ఉండడం లేదు.

అమెరికా తన పౌరుడు, భారత వ్యతిరేకి, ఖలిస్థాన్ వేర్పాటువాది పన్నూన్‌పై హత్యాప్రయత్నం జరిగినట్టు, దాంట్లో ప్రథమ నిందితుడు భారత్ ప్రభుత్వ అధికారి వివేక్ యాదవ్ అని, అతన్ని అప్పగించమని న్యూఢిల్లీని కోరింది. ఆయనిప్పుడు ప్రభుత్వంలో పనిచెయ్యడం లేదంటూ, అమెరికా ఆరోపణని ఖండించింది మన దేశం. ఇప్పటికే భారతీయ వ్యాపారి నిఖిల్ గుప్తను ఈ కేసులోనే అమెరికా ఖైదులో ఉంచింది. అమెరికా ప్రతిష్ఠాత్మంగా భావించి కాపాడుతున్న ఆ మహా నాయకుడు పన్నూన్ ఒక ప్రకటన చేశాడు. ఏమనంటే నవంబర్ మొదటి వారంలో భారత్ విమానాల్లో బాంబులు పెడతామని! భారత్‌కి వ్యతిరేకంగా తీవ్రవాద ప్రకటనల్ని బహిరంగంగా చేస్తున్న వాడిని అమెరికా కట్టడి చెయ్యదుగానీ వాడిపై కుట్ర పన్నారని భారత్ అధికారుల్ని అప్పగించమని కోరుతుంది. అది మళ్లీ మన మిత్రదేశం. ఇదనే కాదు ముంబై పేలుళ్ల సూత్రధారి హెడ్లీని కూడా అడిగినా అప్పగించకుండా దశాబ్దాలుగా తన దగ్గరే దాచుకుంది. తీవ్రవాదంపై పోరులో మనకు సహకరిస్తే దానికి పోయేదేమిటి?

కెనడా ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివింది. మరో భారత్ వ్యతిరేకి, ఖలిస్థాన్‌వాది నిజ్జార్ హత్య వెనుక భారత ప్రభుత్వం ఉందంటూ ఆ దేశ ప్రధాని బహిరంగ ప్రకటన చేశారు. ఋజువులు లేవట. కానీ దర్యాప్తులో తేలిందట. వివాదం ముదిరి దౌత్యవేత్తల బహిష్కరణ దాకా వచ్చింది. చర్చలు మాని రచ్చ చెయ్యడానికి కారణం కెనడా ఎన్నికలకు వెళ్లబోతుంది. ఆ ప్రధానికి, అధికారిక పార్టీకి ఎదురుగాలి. అక్కడి నుండి బయట పడడానికి ఇదో ఎత్తు.

కాబట్టి భారత్ కూడా తన స్వంత బలమే తన నిజమైన మిత్రుడు అని భావించాలి. స్వప్రయోజనాలకు పెద్దపీట వెయ్యాలి. అవసరానికి, సమయానికి తగిన దౌత్యనీతి ప్రదర్శించి అందరితో ఉభయతారకంగా ప్రవర్తించాలి. స్నేహ హస్తంలోనే ఉక్కు సంకల్పం కనబడాలి.

– డి.వి.జి. శంకరరావు

'కగార్ అంతిమ యుద్ధం'తో శాంతి నెలకొంటుందా?

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవులపై క్రమంగా పట్టు సాధిస్తున్నామని భారత సైనిక, భద్రతా బలగాల అధిపతులు చెబుతున్నారు. తాజాగా అబూజ్‌మడ్ కొండల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 32 మంది చనిపోయారు. వెంటనే ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్ష సమావేశం జరిపారు. 2026 నాటికి మావోయిస్టు సమస్య రూపుమాపడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. దేశంలో మావోయిస్టు సమస్య లేకుండా చేయడమే ప్రస్తుత లక్ష్యమని ఇప్పటికే అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే.

అభివృద్ధికి మావోయిస్టులు అడ్డుపడుతున్నారని భారత పాలకులు అంటున్నారు. మావోయిస్టు పార్టీ మాత్రం– ఆదివాసులను ఒక్కటి చేయగలిగాం, బయటి సమాజంలో వారికి గుర్తింపును తేగలిగాం; అడవులను పరిరక్షిస్తున్నాం, వ్యవసాయాన్ని అభివృద్ధి చేశాం; విద్య, వైద్యం మెరుగుపడింది, శుభ్రత పెరిగింది; ప్రజలు సంతోషంగా బతకగలుగుతున్నారు. మైనింగ్ మాఫియా భూతాలపై పోరుకు గిరిజనులను ఏకం చేస్తున్నాం... అని చెబుతోంది. ఛత్తీస్‌గఢ్ అడవి తల్లి ఒడిలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాలున్నాయి.. వాటిని సాగు చేసేందుకు జనం నిర్మించిన చెరువులు ఉన్నాయి! అక్షరం ముక్క రాని గోండు బిడ్డలకు చదువు నేర్పేందుకు పాఠశాలలున్నాయి! పల్లెల్లో ప్రబలే రోగాల చికిత్సకు సంచార వైద్యశాలలున్నాయి.

ఒకవైపు పట్టణాలు, మైదాన ప్రాంతాలు ప్రభుత్వ బలగాల ఆధీనంలో ఉంటే.. అటవీ గ్రామాలన్నీ మావోయిస్టుల గైడెన్స్‌లో స్వయంపాలన జనతన సర్కార్లు కొనసాగుతున్నాయి. దాదాపు పదివేల చదరపు కిలోమీటర్ల ప్రాంతం గెరిల్లా స్థావరాలుగా ఉంది.

కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సమాధాన్ పేరుతో 2017 నుంచి 2022 వరకు దాడిని కొనసాగించాయి. డిసెంబర్ 2022లో కేంద్ర హోం శాఖ మాడ్ విముక్తి కార్యచరణ పథకాన్ని రూపొందించి, 2024 పార్లమెంటరీ ఎన్నికల వరకు నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే గత రెండు సంవత్సరాలుగా అర్బన్ నక్సల్ పేరిట పట్టణాల్లో హక్కుల కార్యకర్తలపై, ప్రగతిశీల రచయితలు, కవులు, కళాకారులపై ఎన్ఐఏ దాడులను తీవ్రం చేసింది. కేంద్ర హోంశాఖ సమీక్ష చేసి 2024 జనవరిలో మావోయిస్టులపై ఆఖరి యుద్ధం... 'కగార్ ఆపరేషన్ (నిర్ణయాత్మక యుద్ధం) ప్రకటించింది. ఈ దాడి ప్రధాన కేంద్రీకరణ మాడ్ ప్రాంతాన్ని మావోయిస్టుల నుంచి విముక్తి చేయడం. అందులో భాగంగానే సెంట్రల్ రీజియన్, ఈస్టర్న్ రీజయన్లలోని మావోయిస్టు పార్టీ బలమైన కేంద్రాలన్నింటిపై దాడులు కొనసాగుతున్నాయి.


ఒడిశాలో ఉన్న మూడు బిఎస్ఎఫ్ బెటాలియన్లను మాడ్ ప్రాంతానికి తరలించి, ఆరు చోట్ల ఫార్వర్డ్ ఆపరేషన్ బేస్ క్యాంపుల్ని ఏర్పాటు చేసారు. ఒక్కో క్యాంపులో 500 బలగాలున్నాయి. రాజ్‌నందగావ్, నారాయణ్‌పూర్, కొండగావ్ జిల్లాల్లో 8 ఐటీబీపీ బెటాలియన్ల నుంచి మొదట ఒక బెటాలియన్‌ను, ఆ తర్వాత మరో రెండు బెటాలియన్లను మాడ్‌పై మోహరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బలగాలపై ఆధారపడి డ్రోన్లతో, అధునాతన ఆయుధాలతో, నూతన టెక్నాలజీతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రా, ఒడిస్సా బోర్డర్లతో కూడిన దాదాపు 92,300 చదరపు కిలోమీటర్ల పరిధిలోని దండకారణ్యంలో దాడి చేస్తున్నారు. ఇక్కడ 50 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో రెండు నుంచి మూడు కోట్ల మూలవాసులున్నారు. ఇక్కడ ప్రజల మీద భారత ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. దీనిని వారు కూడా యుద్ధంతోనే ఎదుర్కొంటున్నారు. ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించిన బలగాలు, సైనిక శిక్షణ పేరిట సైన్యం, ఇప్పటికే అర్థ సైనిక బలగాలు దిగి యుద్ధాన్ని తీవ్రం చేస్తున్నాయి. విసిగి వేసారి చివరకు మావోయిస్టుల గైడెన్స్‌లో స్వయంపాలనకు పూనుకుంటే మాత్రం వెంటనే భద్రతా బలగాల పేర వాయుసేన, సైనిక పాఠశాల పేరున సైన్యాన్ని దించి డ్రోన్లతో బాంబింగ్ చేస్తూ బలప్రయోగం చేసే ఎత్తుగడ ఫలిస్తుందా?

రెండు ప్రపంచ యుద్ధాల తరువాత ప్రపంచ దేశాలన్నీ అంగీకరించిన 1949 జెనీవా ఒప్పందం ప్రకారమైనా భారత ప్రభుత్వం నడుచుకోవాలి. ఇటీవల ఎకనామిక్ పొలిటికల్ వీక్లీ తన నెలవారీ రివ్యూలో బస్తర్ అడవుల్లో భారత ప్రభుత్వం జెనీవా ఒప్పందాలను మించి హింసకు పాల్పడుతోందని పేర్కొన్నది. అక్కడ ఏం జరుగుతోందో జర్నలిస్టులకు, పౌర సమూహాలకు, డాక్టర్లకు పర్యటించి తెలుసుకునే హక్కు ఉన్నదని అంతర్జాతీయ న్యాయసూత్రాలు చెబుతున్నాయి. కానీ వాటిని భారత పాలకులు పాటించాలి కదా!

భారత రాజ్యాంగం ఇచ్చిన సంవిధానం ద్వారా పార్లమెంట్, శాసనసభల ద్వారా చట్టాలు చేసి ఈ దేశ అంతర్గత భద్రత కోసమే చేపట్టిన గ్రీన్‌హంట్ అయిన పహార్. కగార్ పేరుతో ఆఖరి యుద్ధమని నిర్ణయాత్మక దాడికి దిగుతూ అన్నంలో విషంపెట్టి పడిపోయిన వాళ్లను కాల్చి చంపడం, వాళ్లకు అన్నం పెట్టారని సమాచారం ఇస్తున్నారని గ్రామాలకు గ్రామాలను తీసుకుపోయి చంపడం, జైళ్లలో నిర్బంధించడం అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం కూడా యుద్ధ నేరమే. అక్కడ ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి పోయే జర్నలిస్టులను, హక్కుల సంఘాలను ఎందుకు పోతున్నారో రికార్డు రాసుకుని పంపించవచ్చు. ఇవేవీ పాటించకుండా అక్కడి జనాన్ని చంపడం, దొరికిన మహిళలను సామూహిక అత్యాచారాలు చేయడం ఏమి యుద్ధనీతి?

మావోయిస్టుల నిర్మూలన గురించి మాట్లాడుతున్న భారత పాలకులు ఈ ప్రపంచం నుంచి ప్రతి భావజాలాన్ని, ఈ దేశం నుంచి నిరుద్యోగాన్ని, ఆకలి చావులను, పేదరికాన్ని, సకల అసమానతలకు కారణమైన దోపిడీ–పీడనల నుంచి విముక్తి చేయడమెలాగో ఆలోచన చేస్తే బాగుంటుంది. ఒకవేళ ఈ పాలకులకు చేతకాకపోతే మావోయిజం మరో పేరుతో ఈ దేశంలో అభివృద్ధి చెందుతుంది.

మావోయిస్టుల నిర్మూలన గురించి మాట్లాడుతున్న భారత పాలకులు ఈ ప్రపంచం నుంచి ప్రతి భావజాలాన్ని, ఈ దేశం నుంచి నిరుద్యోగాన్ని, ఆకలి చావులను, పేదరికాన్ని, సకల అసమానతలకు కారణమైన దోపిడీ–పీడనల నుంచి విముక్తి చేయడమెలాగో ఆలోచన చేస్తే బాగుంటుంది. ఒకవేళ ఈ పాలకులకు చేతకాకపోతే మావోయిజం మరో పేరుతో ఈ దేశంలో అభివృద్ధి చెందుతుంది.




ఈ యుద్ధం రాజ్యాంగ వ్యతిరేకమని హక్కుల సంఘాలు, మేధావులు, బుద్ధిజీవులు ఘోషిస్తున్నారు. ఇక్కడ యుద్ధ రంగంలో ఉన్న భారత అర్థ సైనిక బలగాలకు, అక్కడి జనతన సర్కార్ (ప్రజాప్రభుత్వం)లోని పౌరులకు ఎటువంటి రిలేషన్ ఉండాలన్న దానిపై చర్చ జరగాలి. జనతన సర్కార్‌లను భారత పాలకులు, ప్రభుత్వం ఎలా గుర్తిస్తుందనేది జాతీయవాదం పేరుతో వస్తున్న ప్రశ్నలు. అసలు జనతన సర్కార్ అనేది భారతదేశంలో నక్సల్‌కు సంబంధించిన ఏరియా కాదు. శతాబ్దాలుగా కడు దీనావస్థలో బతుకుతున్న ఆదివాసులను ఏనాడూ పట్టించుకోని ప్రభుత్వాలు, వాళ్లు ఉద్యమిస్తే మాత్రం యుద్ధప్రాతిపదికన స్పందిస్తున్నాయి. కూలి రేట్లు పెంచాలని, కాంట్రాక్టర్ల దౌర్జన్యాలు అరికట్టాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నోసార్లు సభలు పెట్టినా, ర్యాలీలు తీసినా, బంద్‌లు నిర్వహించినా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. అక్కడి ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసుకున్న తమ ప్రజా ప్రభుత్వాలను రక్షించుకునేందుకు యుద్ధంలో భాగం అవుతున్నారు. దానికి మావోయిస్టు పార్టీ గైడెన్స్ ఉంటే ఉండవచ్చు. రాజ్యాంగం ప్రకారమైనా అది 5వ షెడ్యూల్ ఏరియా, పెస చట్టం, ఆదివాసీల రక్షణకు ఇచ్చిన హక్కులను భారత రాజ్యమే పాటించకుండా, అక్కడి ఖనిజ సంపదను మల్టీ నేషన్ కంపెనీలకు రాసిచ్చింది. దానిపై వారు పోరాడుతున్నారు.


భారత రాజ్యాంగం ప్రకారం పాలకులు, ప్రభుత్వాలు నడుచుకోవాలి. భారతదేశాన్ని కాపాడుకునేందుకే ఈ యుద్ధానికి దిగామని, ఇది అంతర్గత భద్రత సమస్య అని చెబితే... అక్కడి జనం ఏం కోరుకుంటున్నారు? అక్కడి గిరిజన యువకుల ఆకాంక్షలేంటి? వారు ఆయుధం పట్టడానికి దారి తీసిన పరిస్థితులేమిటి? ఆయుధం వదలాలంటే వారు కోరుతున్న మార్గం ఏమిటో చర్చించాలి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు ప్రత్యామ్నాయ మార్గంలో జనతన సర్కార్‌లు నడుస్తున్నాయని అంటున్నారు కదా! ఇందుకు కారణమైన మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించాలి. ప్రతి వ్యక్తికి కూడు–గుడ్డ–భూమి, బతికేందుకు ఉపాధి చూపించడమే స్వావలంబన కాదా? మావోయిస్టుల ఎజెండా ఇదే కనుక వెంటనే కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు చొరవచూపాలని దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు కోరుతున్నారు. అందుకు ఎం.ఎల్, వామపక్ష పార్టీలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, వైసీపీ, టీడీపీ, డెమొక్రటిక్ పార్టీలు కూడా ఆలోచించి, కేంద్రంలో ఉన్న ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, దేశంలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలి. శాంతి వాతావరణం నెలకొల్పాలి.

■ బండి దుర్గాప్రసాద్
జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త

శనివారం ● 26 అక్టోబరు 2024
ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం



మేకప్



కళ్లు కలర్‌ఫుల్‌గా...

కళ్ల మీదే ఫోకస్ ఎక్కువ కాబట్టి... ఐ మేకప్ మీద ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరం. ప్రత్యేకించి ఐషాడోను ఎంచుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

ప్యాలెట్ ఇలా...

ముదురు నుంచి లేత రంగుల వరకూ రకరకాల రంగుల ఐ షాడీలతో కూడిన ప్యాలెట్‌ను ఎంచుకోవాలి. దాన్లో మరీ ముఖ్యంగా మీకు మరింత బాగా నప్పే రంగులు ఉండేలా చూసుకోవాలి.

అవగాహన పెంచుకుని...

కనురెప్పల టర్మినాలజీ పట్ల కూడా అవగాహన ఏర్పరుచుకోవడం అవసరమే! పై కనురెప్పల పైభాగాన్ని ల్యాష్ లైన్ అంటారు. కనుబొమల చివరి ప్రదేశాన్ని బ్రో బోన్ అంటారు. కను రెప్పల కొనలను క్రీజ్ లైన్ అంటారు. కింది కనురెప్పను లోయర్ ల్యాష్‌లైన్ అంటారు. ముక్కు దగ్గరి భాగాన్ని ఇన్నర్ కార్నర్ అంటారు.

రంగుల మీద పట్టు

ప్యాలెట్‌ను తెరిచి, ఏవి తేలిక రంగులు, ఏవి మధ్యస్థ రంగులు, ఏవి ముదురు రంగులో గుర్తించాలి. వీటిలో ఏ రంగులను ఉపయోగిస్తే, ఉబ్బెత్తుగా కనిపించేలా చేయవచ్చో, ఏ రంగులను ఉపయోగిస్తే, లోతుగా కనిపించేలా చేయవచ్చో తెలుసుకోవాలి.

అప్లికేషన్ ఇలా...

- తేలిక రంగులను హైలైట్ కోసం ఉపయోగించాలి. ఇన్నర్ కార్నర్, బ్రో బోన్ ప్రదేశాల్లో ఈ రంగులను వాడుకోవాలి.
- మీడియం రంగులను కంటి ప్రాథమిక ఆకారాన్ని డిఫైన్ చేయడం కోసం వాడుకోవాలి. అలాగే తేలికపాటి ప్రదేశాలను ముదురు రంగు ప్రదేశాల్లోకి బ్లెండ్ చేయడానికి కూడా ఈ రంగులు ఉపయోగపడతాయి. ఈ రంగులను కనురెప్పల మధ్యలో, క్రీజ్‌ల దగ్గర వాడుకోవాలి.
- కంటికి డెప్త్ తీసుకురావడం కోసం, కాంటూరింగ్ కోసం ముదురు రంగులు ఉపయోగపడతాయి. కంటికి మరింత ఇంటెన్సిటీని చేకూర్చడం కోసం కూడా ముదురు ఐ షాడోలను వాడుకోవచ్చు. కనురెప్పల చివర్లలో, క్రీజ్‌ల దగ్గర ఈ రంగులను అప్లై చేసుకోవాలి.
- **బ్లెండింగ్:** ముదురు రంగును లేత రంగులోకి బ్లెండ్ చేయాలన్నా, లేత రంగును ముదురు రంగులోకి బ్లెండ్ చేయాలన్నా బ్లెండింగ్ బ్రష్‌ను వృత్తాకారంలో కదిలిస్తూ బ్లెండ్ చేసుకోవాలి.

ఆత్మవిశ్వాసం పెరగాలంటే..!

ఆత్మవిశ్వాసంతో ఉండే వ్యక్తులు లక్ష్యాలను సులువుగా చేరుకుంటారు. ఒత్తిడి, ఆందోళన వంటివి వాళ్ల దరి చేరకుండా ఉంటాయి. వారి నడక, మాటతీరు ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంటాయి. మరి ఆత్మవిశ్వాసం పెరగాలంటే..! ఇదిగో నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి.

- రోజు వ్యాయామం చేయాలి. శారీరకంగా ఫిట్‌గా ఉన్నప్పుడే కాన్ఫిడెన్స్‌గా ఉండటం సాధ్యమవుతుంది. దుస్తుల ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎదుటి వారిని ఆకట్టుకునే విధంగా ఫిజికల్ అప్పియరెన్స్ ఉండేలా చూసుకోవాలి. పాజిటివ్ పీపుల్ మధ్య ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి. కంఫర్ట్‌జోన్ నుంచి బయటకు రావాలి.
- ఆత్మవిశ్వాసంతో ఉండే వారు ఆరోగ్యకరమైన జీవితం గడుపుతారని, ఎక్కువ కాలం జీవిస్తారని పరిశోధకులు అంటున్నారు. మసాచుసెట్స్‌లోని బ్రాండీస్ యూనివర్సిటీ, న్యూయార్క్‌లోని రోచెస్టర్ యూనివర్సిటీ పరిశోధకులు జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది.
- ఒక వ్యక్తి నడకను బట్టి అతనిలోని కాన్ఫిడెన్స్ లెవెల్స్‌ని అంచనా వేయవచ్చని అంటారు నిపుణులు. కాబట్టి నడక ఎనర్జిటిక్‌గా ఉండాలి. అలసిపోయి, నీరసించిపోయిన వ్యక్తిలా నడవకూడదు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డప్ కావాలంటే వేగంగా నడవడం అలవాటు చేసుకోవాలి. ఒక వ్యక్తి కూర్చునే విధానాన్ని బట్టి అతని ప్రవర్తన, మానసిక పరిస్థితి అంచనా వేస్తుంటారు. కూర్చునే విధానాన్ని ప్రాక్టీస్ చేయడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చని అంటున్నారు నిపుణులు. నిటారుగా నిలబడటం, కళ్లలోకి చూస్తూ మాట్లాడటం వంటివి పాజిటివ్ ఇంప్రెషన్‌ను కల్గిస్తాయి. ఇవి చిన్నచిన్న విషయాలు గానే కనిపిస్తాయి కానీ కాన్ఫిడెన్స్‌పై ప్రభావం చూపిస్తాయి.
- మోటివేట్ చేసే ప్రసంగాలను వినడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవచ్చు. అలాంటి ప్రసంగాలు యూట్యూబ్‌లో సెర్చ్ చేసి వినాలి. నలుగురిలో మాట్లాడటానికి ఇబ్బంది పడే వారు అద్దం ముందు నిలుచుని మాట్లాడటం ప్రాక్టీసు చేయడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు. ఇతరులను పొగడటానికి వెనకంజ వేయద్దు. ఇతరుల్లోని గొప్పతనాన్ని చూడటం ద్వారా మీలో ఉన్న గొప్పతనం బయటకు వస్తుంది. మిమ్మల్ని మీరు తక్కువగా అంచనా వేసుకోవడం వల్ల ఇతరులనూ తక్కువ చేసి చూస్తారు. దీన్ని అధిగమించాలంటే ఇతరులను పొగడాల్సిందే.
- ఆఫీసులో, పబ్లిక్ మీటింగ్‌ల్లో వెనక కూర్చోవడానికి ప్రయత్నిస్తుంటారు. నలుగురి దృష్టిలో పడకుండా ఉండటం కోసం ఇలా చేస్తుంటారు. కానీ ఇది వారిలో ఆత్మవిశ్వాసం కొరవడింది అనడానికి సంకేతం. సెల్ఫ్‌కాన్ఫిడెన్స్ బిల్డ్ చేసుకోవాలని అనుకునే వారు ముందు వరుసలో కూర్చోవాలి. ముఖ్యమైన వ్యక్తులకు కనిపించే విధంగా కూర్చోవడం వల్ల మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. గ్రూప్ డిస్కషన్లలో మాట్లాడకుండా కూర్చోకూడదు. ఎదుటి వాళ్లు ఏమనుకుంటారో అని కూర్చోకుండా తెలిసిన విషయాన్ని ధైర్యంగా చెప్పడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. డిస్కషన్‌లో ఏదైనా తప్పు అయినప్పుడు 'నో' చెప్పాలి. ఆ ధైర్యం మీలో కాన్ఫిడెన్స్‌ని పెంచుతుంది.



దీపావళి పండగ వస్తే ఇంటికి బంధువులో.. మిత్రులో వస్తూ ఉంటారు. వచ్చిన వారికి ఏదో ఒక అల్పాహారం పెట్టాలి కదా. అందుకే ఈ దీపావళి పండగ నేపథ్యంలో మహారాష్ట్రలో ప్రసిద్ధి పొందిన కొన్ని వంటకాలను మీకు అందిస్తున్నాం. వాటిని తయారు చేసి ఆస్వాదించండి.

వంటిల్లు

దీపావళికి మహారాష్ట్ర రుచులు

కోకోనట్ కరాంజీ

కావాల్సిన పదార్థాలు

కరాంజీ (కజ్జికాయ) పైభాగం కోసం:

మైదా- 2 కప్పులు, సేమియా- ఒక కప్పు, నెయ్యి- అర కప్పు, పాలు- ఒక కప్పు, బియ్యపు పిండి- పావు కప్పు, నూనె- రెండు కప్పులు, కుంకుమ పువ్వు- చిటికెడు

కరాంజీలో ఫిల్లింగ్ కోసం:

కొబ్బరి తురుము- ఒక కప్పు, పంచదార పొడి- ఒక కప్పు, గులాబీ రేకులు- పావు కప్పు, రోజ్ ఎసెన్స్- అర స్పూను

తయారీ విధానం

కరాంజీ పైభాగం...

- ఒక మూకుడులో మూడు స్పూనుల నెయ్యి వేసి వేడి చేయాలి. దానిలో మైదా, సేమియాలను వేసి బాగా వేయించాలి.
- ఈ మిశ్రమంలో వేడి పాలు పోసి కలిపి ముద్దగా చేయాలి. ఈ ముద్దను అరగంట నాననివ్వాలి.
- ఆ తర్వాత కుంకుమపువ్వును ఒక స్పూను పాలలో కలిపాలి. దానిని ముద్దలో వేసి బాగా మెత్తగా కలపాలి.
- బియ్యపు పిండిలో నెయ్యి వేసి ముద్దగా కలపాలి.

కరాంజీ ఫిల్లింగ్:

కొబ్బరి తురుము, పంచదార పొడి, గులాబీ రేకులు, రోజ్ ఎసెన్స్‌లను ఒక గిన్నెలో కలపాలి.

చివరగా: మైదా మిశ్రమాన్ని ముద్దలు చేసి పూరీల మాదిరిగా ఒత్తాలి.

- దానిలో కరాంజీ ఫిల్లింగ్‌ను పెట్టి అర్ధ చంద్రాకారంలో జాగ్రత్తగా చుట్టాలి. దాని కొనలకు బియ్యపు పిండి ముద్దను జాగ్రత్త అతికించాలి. దీని వల్ల వేయించినప్పుడు ఫిల్లింగ్ బయటకు రాదు.
- ఆ తర్వాత ఒక మూకుడులో నూనె పోసి బాగా వేడి చేయాలి. బాగా కాగిన తర్వాత కరాంజీలను వాటిలో వేసి వేయించాలి.





జాగ్రత్తలు

- **మైదాలో వేడి పాలను మాత్రమే పోయాలి. దీని వల్ల కరాంజీలు గుల్లగా ఉంటాయి.**
- **కరాంజీలు ఎక్కువ కాలం నిల్వ ఉండాలనుకుంటే- ఎండు కొబ్బరిని వాడితే మంచిది.**
- **బియ్యపు పిండి, నెయ్యి మిశ్రమాన్ని కొనలకు జాగ్రత్తగా అంటించాలి. లేకపోతే నూనెలో వేయించినప్పుడు ఫిల్లింగ్ బయటకు వచ్చేసే ప్రమాదం ఉంది.**

శంకరపాలి

కావాల్సిన పదార్థాలు

మైదా- రెండు కప్పులు, పంచదార- రెండు కప్పులు, పాలు- మూడు కప్పులు, నెయ్యి- పావు కప్పు, వెనీలా ఎసెన్స్- ఒక స్పూను, నూనె - రెండు కప్పులు



తయారీ విధానం

- ఒక గిన్నెలో పాలు, పంచదార, నెయ్యి వేసి బాగా కాచాలి.
- పాలు దగ్గర పడిన తర్వాత దానిలో మైదా, వెనీలా ఎసెన్స్ వేయాలి. పాలు మరింత గట్టి పడేలా చేయాలి. స్టౌ మీద నుంచి దింపి చల్లారనివ్వాలి.
- ఈ ముద్ద బాగా చల్లారిన తర్వాత దానిని చపాతీ మాదిరిగా ఒత్తాలి. తర్వాత చిన్న చిన్న ముక్కలుగా కట్ చేయాలి.
- ఒక మూకుడులో నూనెను వేసి బాగా కాచాలి. దానిలో కట్ చేసిన ముక్కలను వేయించాలి.



జాగ్రత్తలు

- పంచదార బదులుగా బెల్లం కూడా వాడవచ్చు.
- వెనీలా ఎసెన్స్ బదులుగా ఏలకుల పొడిని కూడా వాడవచ్చు.

పాలకూర వాము జంతికలు



కావాల్సిన పదార్థాలు: పాలకూర- రెండు కట్టలు, పచ్చిమిరపకాయలు- 6, వాము- రెండు స్పూనులు, శనగపిండి- ఒక కప్పు, ఉప్పు- తగినంత, నూనె- రెండు కప్పులు

తయారీ విధానం: పాలకూరను బాగా కడగాలి. మిక్సీలో పాలకూర, పచ్చిమిరపకాయలు వేసి ముద్దగా రుబ్బాలి.

- ఈ ముద్దలో వాము, ఉప్పు, శనగపిండి వేసి బాగా కలపాలి. ఒక స్పూను నూనెను వేడి చేసి కలపాలి.
- ఒక మూకుడులో నూనెను తీసుకొని వేడి చేయాలి. ఆ నూనెలో పాలకూర, శనగపిండి ముద్దను జంతికల గొట్టంలో వేసి ఒత్తాలి.
- ఇలా తయారయిన పాలకూర జంతికలను దోరగా వేయించాలి.

జాగ్రత్తలు:

- **పాలకూర, శనగపిండి ముద్దలో వేడి నూనె వేయటం వల్ల జంతికలు గుల్లగా ఉంటాయి.**
- **పాలకూరను బాగా మెత్తగా రుబ్బాలి. ఇది ఎంత మృదువుగా ఉంటే జంతికలు అంత బావుంటాయి.**



వ్యవసాయ వ్యర్థంతో వస్త్రం

వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టడం ఎంతటి కాలుష్యానికి దారి తీస్తుందో అందరికీ తెలిసిందే! ఈ పర్యావరణ నష్టానికి అడ్డుకట్ట వేస్తూ, వ్యవసాయ వ్యర్థాలతో ఏడాదికి 30 కోట్ల ఎకో ఫ్రెండ్లీ ఫైబర్లను తయారుచేస్తోంది అహ్మదాబాద్‌కు చెందిన శిఖా షా. రీసైక్లింగ్‌ను మరో స్థాయికి తీసుకువెళ్లిన ఆ యువ మహిళా వ్యాపారవేత్త గురించి మరిన్ని విశేషాలు...

శిఖ తండ్రి విష్ణు షాదిది ఆటోమొబైల్ వ్యర్థాలను, లోహాలుగా రీసైకిల్ చేసే వ్యాపారం. దాంతో చిన్నప్పటి నుంచే రీసైక్లింగ్ విధానాలు, ప్రయోజనాల గురించి తెలుసుకున్న శిఖ, తండ్రి బాటలోనే నడవాలని చిన్నప్పుడే నిర్ణయించుకుంది. అహ్మదాబాద్‌లోని నిర్మ యూనివర్శిటీలో బిజినెస్ డిప్లొమా చేసిన శిఖ, యుఎస్‌లోని బాబ్సన్ యూనివర్శిటీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ లీడర్‌షిప్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేసింది. ఓ సందర్భంలో తన బాల్యం గురించి మాట్లాడుతూ... "నేను టీనేజ్‌లో ఉన్నప్పుడు, ప్రపంచానికి ఎక్కువ అవసరం ఉన్న అంశమేంటి? సామాజిక ప్రభావమా లేక లాభాలా? అని ఆలోచించాను. నిజానికి సమాజం మీద ప్రభావం చూపించే పనులతో ఎక్కువ మంది జీవితాలను మార్చవచ్చు అనిపించింది. దాంతో అమ్మ ప్రోత్సాహం మేరకు ఎన్‌జిఒలకు పని చేయడం మొదలుపెట్టాను. కానీ సమాజం మీద విస్తారమైన ప్రభావాన్ని కనబరచడం కోసం కారణాన్నీ, వ్యాపారాన్నీ కలపాలనే విషయాన్ని గ్రహించాను" అంటూ చెప్పుకొచ్చిన శిఖ టెక్స్‌టైల్స్‌లో అండర్‌గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేసి వస్త్ర కాలుష్యం గురించి పూర్తి అవగాహన ఏర్పరుచుకుంది. టెక్స్‌టైల్ వ్యర్థాలు భూకాలుష్యానికి కారణమవుతున్నాయి. గ్రీన్‌హౌస్ గ్యాస్ ఎమిషన్స్‌కు తోడ్పడుతూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఇలా జరగకుండా ఉండాలంటే మరింత సుస్థిరమైన మార్గంలో టెక్స్‌టైల్స్ ఉత్పత్తి జరగాలని ఆలోచించిందామె. అందుకోసం టెక్స్‌టైల్ ముడిసరుకుగా వ్యవసాయ వ్యర్థాలను ఎందుకు ఉపయోగించుకోకూడదనే ఆలోచనతో 2019 డిసెంబర్‌లో ఆల్ట్‌మ్యాట్ అనే కంపెనీని స్థాపించింది.

దుస్తులు, గృహోపకరణాలు

57 శాతం టెక్స్‌టైల్స్ పాలియస్టర్ కోవకే చెంది ఉంటాయి. పైగా అవన్నీ ప్లాస్టిక్‌తోనే తయారవుతూ ఉంటాయి. వాటిని శుభ్రపరిచిన ప్రతిసారీ ప్రమాదకరమైన మైక్రో ప్లాస్టిక్స్ విడుదలవుతూ ఉంటాయి. ఇవి జీవులన్నిటికీ ప్రమాదకరమైనవే! ప్రపంచంలోని వ్యవసాయ భూముల్లో 2.4 శాతం పత్తిని పండించడం కోసం, 24 శాతం పెస్టిసైడ్స్‌ను ఉపయోగిస్తున్నారు. 3 జతల జీన్స్ తయారీకి 20 వేల లీటర్ల నీళ్లు ఖర్చవుతున్నాయి. కాబట్టి ఈ వృథాను అరికట్టడం కోసం, పర్యావరణ హితం కోసం మెరుగైన ప్రత్యామ్నాయాన్ని కనిపెట్టక తప్పదని ఆలోచించినట్టు కూడా శిఖ చెప్పుకొచ్చింది. ఆహారం, ఔషధాలు, సౌందర్య ఉత్పత్తులే ప్రధానంగా రైతులు పంటలను పండిస్తూ ఉంటారు. ఈ పంటలతో ఎంతో పెద్ద మొత్తాల్లో వ్యవసాయ వ్యర్థాలు మిగిలిపోతూ ఉంటాయి. వాటిని కొనుగోలు చేసి, కాటన్‌ను పోలిన పదార్థాలను సృష్టించి, వాటిని నూలుగా నేయాలని నిశ్చయించుకుంది శిఖ. అలా తయారుచేసుకున్న నూలుతో దుస్తులతో పాటు బ్యాగులు, బూట్లు, ఇంటి అలంకరణ వస్తువులు, కార్పెట్లు, దుప్పట్లు.. ఇలా ఎన్నో రకాల గృహోపకరణాలు, వస్త్రాలను ఉత్పత్తి చేయడం మొదలుపెట్టింది. వ్యవసాయ వ్యర్థాలను రీసైకిల్ చేయడం ద్వారా సమకూరే పోగులు కాటన్, లినెన్‌ను సరిపోలేలా ఉండడం వల్ల, వాటికి ఆదరణ కూడా విపరీతంగా పెరిగింది. పైగా ఆల్ట్‌మ్యాట్ ఫైబర్ల ధర కూడా తక్కువే! కిలో 330 నుంచి 650 రూపాయల ధర పలికే ఈ ఫైబర్లు పట్టు, నూలు కంటే ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ఫైబర్ల తయారీ కోసం ఆల్ట్‌మ్యాట్ 30 రకాల పంటల మీద పరిశోధన చేపట్టింది. పండ్లు, నూనె విత్తనాలు, ఔషధమొక్కల వ్యర్థాలతోనే ఫైబర్లను తయారుచేస్తోంది. అరటి, హెంప్ విత్తనాలు, పైనాపిల్ పంటలనుంచి, అలాగే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న వ్యవసాయ రెసిడ్యూలను కూడా ఆల్ట్‌మ్యాట్ వినియోగించుకుంటూ ఉంటోంది.

వినూత్నం



> "నేను టీనేజ్‌లో ఉన్నప్పుడు, ప్రపంచానికి ఎక్కువ అవసరం ఉన్న అంశమేంటి? సామాజిక ప్రభావమా లేక లాభాలా? అని ఆలోచించాను. సమాజం మీద ప్రభావం చూపించే పనులతో ఎక్కువ మంది జీవితాలను మార్చవచ్చు అనిపించింది."

ఏడాదికి వెయ్యి టన్నులు

వ్యవసాయ వ్యర్థాల రీసైక్లింగ్‌తో అటు పర్యావరణానికీ, ఇటు సమాజానికీ రెండు విధాలా సహాయపడుతున్న శిఖ, భారత ప్రభుత్వం నుంచి అటల్ ఇన్నొవేషన్ మెడల్, విమెన్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా అవార్డులను అందుకుంది. ప్రపంచానికి ప్రత్యామ్నాయ పదార్థాలు అవసరమనీ, ఆ పదార్థం పర్యావరణపరమైన సుస్థిరతను కలిగి ఉండడంతో పాటు, తేలికగా అందుబాటులో ఉండడం, చవకగా దొరకడం కూడా అవసరమనీ శిఖ ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆల్ట్‌మ్యాట్, ఏడాదికి వెయ్యి టన్నుల ఫైబర్‌ను ఉత్పత్తి చేస్తూ, 40 లక్షల దుస్తులను తయారుచేస్తోందనీ, భవిష్యత్తులో మరింత భారీ స్థాయిలో పర్యావరణహితమైన ఫైబర్‌ను ఉత్పత్తి చేయాలనే ఆలోచన ఉందనీ అంటున్న శిఖ, ఎంతో మంది పర్యావరణ ప్రేమికుల మనసులను చూరగొంటోంది.

వరన్నం మంచిదే..!

"మందానలో నరో ద్రవ్యం మాత్రా గురు వివర్ధయేత్, స్వభావతశ్చ గురు యత్తథా సంస్కారతో గురు
మాత్రాగురు తు ముద్గాది మాషాదిఃప్రకృతేర్గురుః సంస్కారగురుః పిష్టాన్నరః ప్రోకమిత్యుపలక్షణమ్"

అని శాస్త్రకారుడు భోజన కుతూహలంలో ధాన్యాలను అభివర్ణిస్తాడు. ధాన్యం అంటే పోషణ ఇచ్చేదని.. భోజ్యం అంటే తినదగినదని.. భోగార్హం అంటే ఎదుగుదలను కలిగించేదని.. అన్నం అంటే ప్రాణాల్ని నిలిపేదని.. ఆద్య అంటే ఇష్టంగా తినదగినదని.. జీవసాధనం అంటే జీవించటానికి ఒక సాధనంగా ఉండేదని ఈ శ్లోకార్థం. దీనిలో ఒక్కో పేరు ఒక్కో గుణాన్ని సూచిస్తోంది. మొత్తం మీద ధాన్యాలు మనకు ప్రాణశక్తి నిచ్చి, ఎదుగుదలకు తోడ్పడుతూ, ఆకలిని తీరుస్తూ జీవించటానికి కారణం అవుతాయి. మన పూర్వీకులు ధ్యానాలను మూడు రకాలుగా విభజించారు. వరి, గోధుమ, బార్లీ మొదలైన వాటిని శూక ధాన్యం అంటారు. వీటి వద్ద గింజలు మొనదేలి ఉంటాయి. పప్పులను శింబీధాన్యం అంటారు. అంటే వీటిలో రెండు పప్పులు కలిసి ఉంటాయి. వీటినే ద్విదళబీజాలని కూడా పిలుస్తారు. ఈ బీజాల నుంచి వచ్చిందే బేడ! అందుకే ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో . కంది, పెసర మినుము, శనగ మొదలైన వాటిని పప్పుబేడలని పిలుస్తారు. ఇక మూడోవి తృణధాన్యాలు. సాములు, రాగులు మొదలైన రకాలివి.

త్వరగా అరిగే స్వభావం!

వరి, గోధుమ, బార్లీ లాంటి శూకధాన్యాలు తేలికగా అరిగే స్వభావం కలిగి ఉంటాయి. ఇవి అతి బలకరాలు. మేధాశక్తిని, తెలివితేటల్ని, మనోబలాన్నీ కలిగిస్తాయి. ఈ మేధాశక్తిని పెంచే గుణం తృణధాన్యాలకు లేదు. పైగా ఇవి వాతాన్ని పెంచి మరింత మానసిక అవ్యవస్థని కలిగిస్తాయి. అందుకే, మన పూర్వులు వరి, గోధుమ, బార్లీలనే ప్రధాన ఆహార ద్రవ్యాలుగా ఎంచుకున్నారు. ఆయుర్వేద శాస్త్ర ప్రకారం- పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు వాతాన్ని, వేడిని కలిగిస్తాయి. బియ్యపు అన్నం మాత్రం అన్ని రకాలుగా పనిచేస్తుంది. ఉదాహరణకు వాత కఫాలు బాగా పెరిగినప్పుడు బియ్యపు అన్నంలో అల్లం ముద్దను లేదా మిరియాల పొడిని నేయి వేసుకొని కలుపుకొని తినమని సూచిస్తారు. దీని వల్ల వాత కఫాలు తగ్గుతాయి.

కలిపి తింటేనే మంచిది..

శింబీ ధాన్యాలు- అంటే కంది, పెసర, మినుము, శనగ మొదలైనవి త్వరగా అరగవు. ఇవి వాతాన్ని కలిగిస్తాయి. మలబద్ధకం కూడా పెరుగుతుంది. ఇవి త్వరగా అరగవు కాబట్టి.. నెయ్యి లాంటి పదార్థాలను కలుపుకొని తినమంటారు. నెయ్యి వల్ల ఏ పదార్థామైన త్వరగా అరుగుతుంది. అంతే కాదు.. వీటిని మితంగా తినటమే మంచిది. ఇక తృణ ధాన్యాలకు చలువ చేసే గుణం ఉంది. కానీ ఇవి అన్నంతో పోలిస్తే ఆలస్యంగా అరుగుతాయి. దీని వల్ల శరీరంలో వాత తత్వం పెరుగుతుంది. అందువల్లే ఆయుర్వేద వైద్యులు కీళ్ల నొప్పులు ఉన్నవారిని తృణ ధాన్యాలను ఎక్కువగా తినవద్దని సలహా ఇస్తారు.

> **ఎలాంటి ఆహారం తినాలనే విషయం శరీరతత్వంపై ఆధారపడి ఉంటుంది. కొందరికి జీర్ణశక్తి బావుంటుంది. అలాంటి వారు తృణధాన్యాలు తిన్నా సమస్యలు ఏర్పడవు. జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు వరి, గోధుమ, బార్లీను తినటం మంచిది.**

● గంగరాజు అరుణాదేవి



ఇంటర్ అర్హతతో బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్లు

- కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్లకే అనుమతి
- తొలుత నీట్, ఎంసెట్ ర్యాంక్‌ల ఆధారంగా భర్తీ

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):నీట్, ఎంసెట్ పరీక్షలు రాయకుండానే బీఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో చేరేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఏపీ నర్సింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ విన్నపం మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. హెల్త్ వర్సిటీ నిర్వహించే బీఎస్సీ నర్సింగ్ కౌన్సెలింగ్ అనంతరం కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటాలో మిగిలిపోయిన సీట్లను ఇంటర్‌మీడియట్ మార్కుల ఆధారంగా భర్తీ చేసుకునే వెసులుబాటు కల్పించింది. హెల్త్ వర్సిటీ కౌన్సెలింగ్ అనంతరం కూడా కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పూర్తిగా భర్తీ కావడం లేదు. నీట్, ఎంసెట్ పరీక్షలు రాయని కొంత మంది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు నర్సింగ్ కోర్సుల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాంటి వారి కోసం ఇంటర్ మార్కుల్లో మెరిట్ ఆధారంగా బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. మిగిలిపోయిన సీట్ల భర్తీ అంశంపై ప్రభుత్వం కాలేజీలకు స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లకు వర్సిటీలో అన్ని కౌన్సెలింగ్‌లు పూర్తయిన తర్వాతనే అవకాశం కల్పిస్తుంది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు తొలుత నీట్, ఎంసెట్‌లో అర్హత సాధించిన వారికి అవకాశం ఇవ్వాలి. ఆ తర్వాత కూడా సీట్లు మిగిలిపోతేనే ఇంటర్‌మీడియట్ అర్హత ఉన్న విద్యార్థులతో భర్తీ చేయాలని స్పష్టంగా చెప్పింది. బీఎస్సీ నర్సింగ్ కోసం ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహించే అంశంపై హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

10 రోజుల్లో నిర్ణయం తీసుకోండి

- ఖాళీ సీట్ల భర్తీకి నాలుగో కౌన్సెలింగ్‌పై అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలన్న పిటిషనర్ అభ్యర్థనపై 10 రోజుల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని ఏపీఈఏపీ సెట్ కన్వీనర్, ఉన్నత విద్యాశాఖ అధికారులను హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. అనంతరం విచారణను రెండు వారాలు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడకు చెందిన పి.అనసూర్య అనే ఓ విద్యార్థి తల్లి హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పాలేటి మహేశ్వరరావు వాదనలు వినిపించారు.

ఈడీ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా, ఎండాడలోని హయగ్రీవ భూముల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.అశ్వినీకుమార్ వాదనలు వినిపిస్తూ... మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామని, దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. ఈడీ తరఫున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జ్యోస్యుల భాస్కరరావు స్పందిస్తూ... పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె. కృపాసాగర్ విచారణను వచ్చేవారానికి వాయిదా వేశారు.

ప్రాజెక్టుల అత్యవసర పనులకు 282 కోట్లు

- ఔట్ సోర్సింగ్ నియామకాలకూ సీఎం పచ్చజెండా: నిమ్మల

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాజెక్టుల అత్యవసర పనుల నిర్వహణకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.284 కోట్లు విడుదల చేశారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్వహణకు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకునేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఆ శాఖ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షించారు. అత్యవసర పనుల కోసం విడుదల చేసిన నిధులతో చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల రోప్స్ మొదలైనవాటికి మరమ్మతులు చేయకపోగా కనీసం గ్రీజు కూడా పెట్టలేదన్నారు. రాష్ట్రంలో అత్యవసరంగా 2,323 పనులను వెంటనే చేపట్టాల్సి ఉందని.. వాటికి టెండర్లు పిలవాలని తెలిపారు.

తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు..

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించాలి. ఇతర గ్రామాలు, ప్రాంతాలకు తరలించకూడదు. ఇలా గ్రామం పరిధిలో ఇసుక తీసుకెళ్లాలనుకుంటే ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్టర్ చేసుకోవాలి. లేదంటే గనుల శాఖ ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. స్థానికేతరులు, సుదూర ప్రాంతాల వారు తమకు సంబంధం లేని గ్రామం నుంచి ఇసుకను తీసుకెళ్లడానికి వీల్లేదు.



కొవ్వూరు మండలం వాడపల్లి, ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులను తనిఖీ చేస్తున్న మంత్రి నిమ్మల

గ్రామీణేతరులకు ఇలా..

రీచ్‌లు అందుబాటులో లేనివారు, గ్రామీణేతరులు విధిగా ప్రభుత్వం నిర్దేశించిన స్టాక్‌పాయింట్ల నుంచే ఉచిత ఇసుక తీసుకెళ్లాలి. ఇందుకోసం ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత స్టాక్‌పాయింట్లో బుకింగ్ చేసుకోవాలి. వ్యక్తిగత అవసరాలతోపాటు, భారీగా అవసరం ఉన్నవారు ఈ విధానాన్ని పాటించాల్సి ఉంటుంది. సొంత వాహనాల్లో ఇసుక తీసుకెళ్లేవారు విధిగా స్టాక్ యార్డ్ నుంచి ఈ-ట్రాన్సిట్, పర్మిట్‌లు పొందాలి. ఇసుక రవాణా వాహనాలకు జీపీఎస్ పరికరం తప్పనిసరి.

తవ్వకం,నిర్వహణ ప్రైవేటుకు...

ఇసుక తవ్వకాల బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించనున్నారు. తవ్వకాలు చేస్తే సంస్థలు విధిగా పర్యావరణ అనుమతులు, రీచ్‌ల నిర్వహణకు అవసరమైన సీటీఈ, సీటీవో అనుమతులు తీసుకోవాలి. ఇసుక తవ్వకాలకోసం మైనింగ్‌ప్లాన్ ఆమోదం పొందాలి. దీంతోపాటు పర్యావరణ మార్గదర్శకాలను పాటించాలి. పర్యావరణ అనుమతులు ఏజెన్సీలే పొందాల్సి ఉంటుంది. రీచ్‌ల్లో తవ్వితీసిన ఇసుకను స్టాక్‌పాయింట్లకు తరలిస్తారు. ఆ స్టాక్‌పాయింట్ల నిర్వహణ బాధ్యతను కూడా ప్రైవేటు ఏజెన్సీలకే అప్పగించనున్నారు. అలాగని ఉచిత ఇసుకకు ఎలాంటి ఢోకాలేదు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇసుక తవ్వితీయడం, ఆ తర్వాత స్టాక్‌పాయింట్లకు చేర్చే కాంట్రాక్ట్ మాత్రమే ఉంటుంది. స్టాక్‌పాయింట్ల నుంచి ఉచిత ఇసుక సరఫరా చేస్తారు. రిటైల్ వినియోగదారులు, భారీగా ఇసుక అవసరం ఉన్నవారు నిర్దేశిత ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. వీరికి సీనరేజీ కూడా వర్తిస్తుంది. స్టాక్ పాయింట్ల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఓ ఇన్‌చార్జీని నియమించనుంది. ఇసుకరీచ్‌ల నిర్వహణ, తవ్వకాలు, ఇతర ప్రక్రియలు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే సాగాలి.

ఆ భూముల్లో రైతులే తవ్వుకోవచ్చు : నిమ్మల

రాజమహేంద్రవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నదులు, కాల్వలు, పాయలు, రైతులకు సంబంధించిన జిరాయితీ, పట్టాభూముల్లో ఇసుక పేరుకుపోతే వారు సొంతంగా తవ్వుకోవచ్చని జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లాలోని గోదావరి డీసిల్టేషన్ ర్యాంపులను శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఇసుక లభ్యత పెంచాలని, రెండు మూడు రోజుల్లో ఓపెన్ రీచ్‌లను ప్రారంభించాలని ఆదేశించారు. ర్యాంపుల్లో నీరు ఉంటే ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు వదిలేసి.. అక్కడ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆన్‌లైన్ ఇబ్బందులు ఉంటే ర్యాంపుల వద్దే ఆఫ్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుని తీసుకుని వెళ్లవచ్చన్నారు. సొంతవాహనాలు తెచ్చుకుంటే టన్ను రూ.345కే లభ్యమవుతుందని మంత్రి వివరించారు.

రీచ్‌లు లేని జిల్లాల్లో ప్రైవేటు లైసెన్సులు

నదీ పరివాహకం లేనివి, ఇసుక రీచ్‌లు అందుబాటులోలేని జిల్లాల్లో ప్రైవేటు వ్యక్తులు, ఏజెన్సీలకు మినరల్ డీలర్ లైసెన్స్ (ఎండీఎల్)లు జారీ చేస్తారు. ఎండీఎల్ లైసెన్స్ పొందిన వారు నిర్దేశిత రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకెళ్లి తమకు కేటాయించిన స్టాక్‌యార్డ్‌లో నిల్వచేయాలి. రిటైల్ వినియోగదారులకు డీఎల్ఎస్‌సీ నిర్ణయించిన ధరకుసరఫరా చేయాలి.

అక్రమాల నిరోధానికి చర్యలు..

నిఘా, పర్యవేక్షణ: రీచ్‌లు, స్టాక్‌యార్డ్‌లు ప్రైవేటుకు అప్పగించనున్న నేపథ్యంలో అక్రమాలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రతిపాదించింది. ప్రతీ ఇసుక సరఫరా కేంద్రంలో సీసీటీవీలను ఏర్పాటు చేయాలి. ఇసుక రవాణాను పర్యవేక్షించేందుకు పోలీసు కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేయాలి.

జగన్ పాపం.. జనంపై మరో భారం

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేయాలని స్పష్టంచేసింది. వాస్తవానికి డిస్కంలు ఆ ఏడాదికి రూ.8,114 కోట్లు వసూలు చేసుకుంటామని ఎప్పుడో అభ్యర్థించాయి. 2022-23 మొదటి క్వార్టర్ సర్దుబాటు చార్జీల వసూలు ప్రతిపాదనలను 2022 సెప్టెంబరులో, రెండో క్వార్టర్ ప్రతిపాదనలను ఆ డిసెంబరులో అందించాయి. కానీ కమిషన్ స్పందించలేదు. వాటిపై రెండేళ్ల జాప్యం చేసి.. ఈ నెల 18న ఆకస్మికంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని ప్రకటించింది. ఆ రోజున వర్చువల్‌గా జరిగిన సమావేశంలో.. రెండేళ్ల ఆలస్యం చేయడంపై విద్యుత్ రంగ నిపుణులు నిలదీశారు. కేసుల పరిష్కారంలో తనమునకలై ఉన్నందున ఇంధన సర్దుబాటుపై వెనువెంటనే నిర్ణయం తీసుకోలేదని కమిషన్ సమాధానమిచ్చింది. అయితే ఏపీఈఆర్‌సీ తీరు వల్ల ఒకేసారి వినియోగదారులపై మోయలేని భారం పడుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. 2023-24 సంవత్సరానికిగాను మరో రూ.11,826.42 కోట్ల వసూలుకు డిస్కంలు వేరుగా ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తుచేశారు. అది కూడా కలిపితే కరెంటు బిల్లులు చూసి జనం బెంబేలెత్తుతారని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత రూ.6,072.86 కోట్లు వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతి ఇచ్చింది. ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ యూనిట్‌కు రూ.1.21 చొప్పున 15 నెలలపాటు ఈ మొత్తాన్ని వసూలు చేయనున్నాయి.

నాడు ఎడా పెడా కరెంటు కొనుగోలు

జగన్ హయాంలో ఏపీ జెన్కో ప్లాంట్లలో విద్యుదుత్పత్తిని కుదించేశారు. బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కరెంటు కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్లలోనూ పారదర్శకతను పాటించలేదు. కంపెనీల వారీగా యూనిట్ ధరను ఎంతెంతకు కొంటున్నారో వెల్లడించకుండా దాచిపెట్టారు. విద్యుత్ సంస్థల వెబ్‌సైట్లను కూడా డమ్మీచేశారు. బొగ్గు కొనుగోలు వ్యవహారాల్లోనూ అత్యంత రహస్యమే.

ఇప్పటికే రెండు సర్దుబాట్లు

రాష్ట్ర ప్రజలు ఇప్పటికే 2019-20, 20-21 సంవత్సరాలకు ఇంధన సర్దుబాటు కింద యూనిట్‌కు 40 పైసలు, 65 పైసల చొప్పున రెండు భారాలు మోస్తున్నారు. శుక్రవారంనాటి ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు అదనంగా యూనిట్‌కు రూ.1.21 చొప్పున మోయాల్సి వస్తుంది. మూడూ కలిపితే ప్రతి యూనిట్‌పై అదనంగా రూ.2.26 చొప్పున భారం పడనుంది. నెలవారీ కరెంటు వినియోగ చార్జీల కంటే.. సర్దుబాటు వడ్డనలే తడిసిమోపెడవుతున్నాయన్న ఆగ్రహం పెల్లుబుకుతోంది.



పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న మంత్రి గొట్టిపాటి

రిగ్గింగ్‌ను అడ్డుకుంటే.. రౌడీషీట్లు పెట్టారు

- టీడీపీ గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుల ఫిర్యాదులు

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొన్నటి ఎన్నికల్లో వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టి, రౌడీషీట్లు ఓపెన్ చేశారని బాధితులు వాపోయారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైసీపీ బాధితుల నుంచి ఫిర్యాదులు భారీగా వచ్చాయి. ఎన్నికల్లో వైసీపీ నాయకుల రిగ్గింగ్‌ను అడ్డుకున్నందుకు పోలీసులు స్టేషన్‌కు పిలిచి, తమపై రౌడీషీట్ తెరిచారని, దాన్ని తొలగించాలని దర్శి నియోజకవర్గం బొట్లపాలెం గ్రామ టీడీపీ కార్యకర్తలు బత్తిన శ్రీకాంత్, బొట్ల వెంకటేశ్వరరావు, బత్తిన వెంకట నరేంద్రబాబు, రాఘవులు కోరారు. మాజీ హోంమంత్రి వనిత తనకు అక్క అవుతుందని చెప్పి, కొవ్వూరులో దస్తావేజు లేఖరిగా పనిచేస్తున్న దాసరి స్టాలిన్ అనే వ్యక్తి తన కుమార్తెలకు చెందిన ఆస్తిని రిజిస్టర్ చేయిస్తానని రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఏలూరుకు చెందిన బలే నరసరాజు ఫిర్యాదు చేశారు. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని వైసీపీ నేతలు ఆక్రమించి, రికార్డుల్లో పేర్లు మార్పించారని, ప్రశ్నించిన తమపై తప్పుడు కేసులు బనాయించారని విజయనగరం జిల్లా కోసూరుకు చెందిన అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలు తనపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అదే గ్రామానికి చెందిన సూర్యనారాయణ వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని రాజశేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి అనే ఇద్దరు తన వద్ద రూ.12 లక్షలు తీసుకుని మోసం చేశారని, డబ్బులు అడిగితే కులం పేరుతో దూషిస్తున్నారని అనంతపురం జిల్లా పుల్లలరేవుకు చెందిన పీసీ పెద్దన్న వాపోయారు. తమ తండ్రి పేరుతో ఉన్న పొలాన్ని వేరొకరికి కట్టబెట్టేందుకు అధికారులే రికార్డులు తారుమారు చేస్తున్నారని ప్రకాశం జిల్లా వంగపాడుకు చెందిన కాకర్ల కొండయ్య, శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సభ్యులు కోరారు. 22 ఏళ్లుగా ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న 203 మందిని గత ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందని బాధితులు వాపోయారు. పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న తన పట్టా భూమికి పరిహారం ఇవ్వాలని చింతూరుకు చెందిన సోమక నారాయణరావు కోరారు. ప్రకాశం జిల్లా గుమ్మళ్లంపాడులో బీసీల ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయాలని సర్పంచ్ సుబ్బారావు మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఆర్ట్, క్రాఫ్ట్ నిరుద్యోగులు కోరారు.

సింగపూర్ వెళ్తా.. పాస్‌పోర్టు ఇప్పించండి

- బెయిల్ షరతులు సడలించాలని హైకోర్టుకు పిన్నెల్లి

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదైన కేసుల్లో బెయిల్ మంజూరు సందర్భంగా విధించిన షరతులను సడలించాలని కోరుతూ వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. సింగపూర్ వెళ్లేందుకు వీలుగా మేజిస్ట్రేట్ వద్ద సరెండర్ చేసిన పాస్‌పోర్టును తిరిగి ఇప్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిన్నెల్లి కుమారుడు ఉన్నత చదువుల రీత్యా సింగపూర్ వెళ్తున్నాడని, అక్కడకు వెళ్లి తండ్రిగా ఆయన కొన్ని లాంఛనాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. పోలీసుల తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేస్తామని, సోమవారం విచారణ చేపట్టాలని కోరారు. అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను 28కి వాయిదా వేశారు.





28న చిరంజీవికి ఏఎన్ఆర్ అవార్డు ప్రదానం

అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఈనెల 28న ప్రతిష్ఠాత్మక 'ఏఎన్ఆర్ అవార్డు'ను బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా మెగాస్టార్ చిరంజీవికి ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరవుతున్నట్లు అక్కినేని కుటుంబం తెలిపింది. ఈ మేరకు నాగార్జున చిరంజీవిని స్వయంగా కలసి ఆహ్వానించారు. 'మా నాన్న ఏఎన్ఆర్ శత జయంతి వేడుకలు జరుగుతున్న ఈ సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. ఈ మైలురాయికి గుర్తుగా ఏఎన్ఆర్ అవార్డ్స్ 2024 ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి అమితాబ్ బచ్చన్ అంగీకరించడం ఆనందంగా ఉంది. ఈ అవార్డు ఫంక్షన్‌ను మరపురానిదిగా చేద్దాం!' అని నాగార్జున తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు.

శివయ్య ఆశీస్సుల కోసం...



'కన్నప్ప' టీమ్ ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించింది. పన్నెండు జ్యోతిర్లింగాల సందర్శనలో భాగంగా.. డాక్టర్. మోహన్ బాబు, నటుడు విష్ణు మంచు, దర్శకుడు ముఖేశ్‌కుమార్ తదితరులు.. కేదార్‌నాథ్, బద్రీనాథ్, రిషికేశ్‌క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ "శివుని ఆశీస్సుల కోసం ఈ యాత్రను ప్రారంభించాం. ఈ సినిమాను అందరూ మెచ్చే విధంగా తెరకెక్కించడానికి అహర్నిశలు శ్రమిస్తున్నాం" అని చెప్పారు. కాగా, విష్ణు మంచు నటిస్తున్న ఈ సినిమాను ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. డిసెంబరులో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పోస్ట్‌మ్యాన్ సాహసాలు



కిరణ్ అబ్బవరం, నయన సారిక, తన్వీరామ్ ప్రధాన పాత్రల్లో నటించిన పాన్ ఇండియా చిత్రం 'క'. దర్శకద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించగా.. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్ పాత్రలో కనిపించనున్నారు కిరణ్ అబ్బవరం. ఉత్కంఠకు గురి చేసే సన్నివేశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. కిరణ్ అబ్బవరం నటన, యాక్షన్ సన్నివేశాలు సినిమా మీద అంచనాలు పెంచుతున్నాయి. ఈ సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ ప్రేక్షకులను అలరిస్తుందని మేకర్స్ తెలిపారు.

జైలు నుంచి విడుదల



చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ శుక్రవారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయనకు గురువారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పత్రాలు శుక్రవారం సాయంత్రం జైలుకు చేరడంతో విడుదలయ్యారు. జైలు వద్ద మీడియాతో మాట్లాడకుండా భార్యతో కలిసి వాహనంలో అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. లైంగిక వేధింపుల ఆరోపణలతో మహిళా కొరియోగ్రాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసులు జానీ మాస్టర్‌పై కేసు నమోదు చేసి సెప్టెంబరు 20న రిమాండ్‌కు తరలించారు. కేసు నేపథ్యంలో జానీమాస్టర్‌కు 2022 సంవత్సరానికి ఇచ్చిన జాతీయ ఉత్తమ కొరియోగ్రాఫర్ పురస్కారం నిలిపివేశారు.

సైదాబాద్, (ఆంధ్రజ్యోతి)

6 వరకు తదుపరి చర్యలేమీ వద్దు

- అల్లు అర్జున్ పిటిషన్‌పై అప్పుడు నిర్ణయం వెల్లడిస్తాం: హైకోర్టు




అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ సినీనటుడు అల్లు అర్జున్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. నవంబర్ 6న నిర్ణయం వెల్లడిస్తామని కోర్టు ప్రకటించింది. అప్పటి వరకు తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేసింది. ఈ మేరకు జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. కోడ్ ఉల్లంఘించారంటూ నంద్యాల టూటౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ అల్లు అర్జున్, కిశోర్‌రెడ్డి ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. పోలీసులు ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేశారని, ట్రయల్ కోర్టు ఇంకా నంబర్ కేటాయించలేదన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ..ట్రయల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన తరువాత సంబంధిత కేసును క్వాష్ చేయాలని హైకోర్టులో పిటిషన్ వేయవచ్చా అని సందేహం వ్యక్తం చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది నాగిరెడ్డి స్పందిస్తూ.. ట్రయల్ కోర్టు ఛార్జిషీట్‌ను కాగ్నిజెన్స్‌లోకి తీసుకోలేదన్నారు. క్వాష్ పిటిషన్‌పై నిర్ణయం వెల్లడించేవరకు నంద్యాల పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలన్నింటినీ నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు న్యాయమూర్తి సమ్మతించారు.

సైకలాజికల్ థ్రిల్లర్



గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో ఆర్వీ-ఆర్వీ బేనర్‌పై రవి వర్మ నిర్మించిన చిత్రం 'శారీ'. 'టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ' దీని ట్యాగ్‌లైన్. నిజజీవిత సంఘటనల ఆధారంగా రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ. ఇందులో భయానక ప్రేమికుడిగా సత్య యాదు, అతనిలో సెగలు రేపే చీరలోని అమ్మాయి పాత్రలో ఆరాధ్య దేవి నటించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళ్, మలయాళ భాషల్లో డిసెంబరు 20న విడుదలవుతోంది.





పరిటాలకు మహర్దశ

అమరావతి రైల్వేలైన్ రాకతో మారనున్న పరిటాల ముఖచిత్రం

- కార్గో టెర్మినల్ ఏర్పాటుకు కేంద్రం ఓకే
- రోడ్డు, జల, రైల్వే రవాణాకు ఇదే కీలకం
- రాష్ట్రంలోని పోర్టులకు అనుసంధానం
- లాజిస్టిక్ హబ్‌గా రూపాంతరం
- మూడేళ్లలో అభివృద్ధి పరుగులు

10

అమరావతి రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో పరిటాలకు మహర్దశ పట్టనుంది. రైలు, రోడ్డు, జల రవాణాకు సంబంధించిన భారీ కార్గో టెర్మినల్ ఏర్పాటుకు కేంద్రం ఓకే చెప్పడంతో ఈ ప్రాంతం మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును మూడేళ్లలోగా పూర్తి చేయాలన్న సీఎం చంద్రబాబు సంకల్పంతో త్వరలోనే ఈ అభివృద్ధి కల నెరవేరి, పరిటాల రూపురేఖలు మారనున్నాయి.

లిఫ్ట్ ప్లీజ్..!



దుర్గగుడిలో గందరగోళంగా లిఫ్టుల ఆపరేషన్

- నిత్యం ఏడో అంతస్థు వరకు ఆపరేషన్
- రద్దీ రోజుల్లో మాత్రం ఐదో అంతస్థులోనే బ్రేక్
- మండిపడుతున్న వృద్ధులు, దివ్యాంగ భక్తులు
- ఓ పద్ధతి లేకపోవడంతో తోపులాటలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులను మహామండపం నుంచి కొండపైకి తీసుకెళ్లే లిఫ్టులు ఏ రోజు ఎలా పనిచేస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. భక్తుల కోసం ఏర్పాటుచేసిన లిఫ్టులను అధికారులు సొంత ప్రణాళికలతో పనిచేయిస్తున్నారు. నిత్యం ఏడో అంతస్థు వరకు వెళ్లాల్సిన లిఫ్టులు రద్దీ ఉన్న సమయాల్లో ఐదో అంతస్థులోనే ఆగిపోతున్నాయి. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

రద్దీ ఉంటే ఐదులోనే..

దుర్గమ్మ దర్శనానికి భక్తులు రెండు విధాలుగా వస్తుంటారు. కొంతమంది ఘాట్‌రోడ్డు మీదుగా వెళ్తారు. ఇక్కడ ఓం మలుపు దాటాక ఉన్న క్యూలో నుంచి దర్శనానికి వెళ్తారు. ఇంకొందరు కనకదుర్గానగర్ వైపు నుంచి వెళ్తారు. మహామండపం మెట్ల పక్కన ఉన్న క్యూల నుంచి దర్శనానికి వెళ్తుంటారు. రూ.500 టికెట్లు తీసుకున్న భక్తులు మహామండపానికి రెండోవైపు ఉన్న లిఫ్టుల నుంచి దర్శనానికి వెళ్తుంటారు. ఇక్కడ మూడు లిఫ్టులు ఉన్నాయి. వాటిని ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఆపరేట్ చేస్తుంటారు. మూడింటిలో ఒక లిఫ్టును ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు ఉపయోగిస్తారు. మిగిలిన రెండింటినీ భక్తుల కోసం ఉపయోగిస్తున్నారు. ఈ లిఫ్టుల వద్దకు దర్శనం టికెట్లు ఉన్న భక్తులను అనుమతిస్తారు. ఇందుకోసం మహామండపం ప్రవేశద్వారం వద్ద ఒక చెకింగ్ పాయింట్ ఉంటుంది. ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది టికెట్లు ఉన్నవారిని లిఫ్టుల వద్దకు అనుమతిస్తారు. లిఫ్టుల ముందున్న క్యూ వద్ద మరో సెక్యూరిటీ ఉంటారు. వాస్తవానికి ఈ మూడు లిఫ్టులను ఏడో అంతస్థు వరకు నడుపుతారు. కొన్నిసార్లు నాలుగు, ఐదు అంతస్థుల్లో ఆపుతారు. నాల్గో అంతస్థులో దేవస్థాన కార్యాలయం నడుస్తోంది. అమ్మవారికి విరాళాలు ఇవ్వాలనుకున్న వారు కొంతమంది ఇక్కడ దిగుతారు. ఐదో అంతస్థులో పూజాసామాగ్రి విక్రయశాలలు ఉన్నాయి. కొబ్బరికాయలు, చీరలు, గాజులు కొనాలనుకున్నవారు ఈ అంతస్థులో దిగుతారు. ఇక్కడి నుంచే దర్శనానికి క్యూలు ఉన్నాయి. దుర్గమ్మ దర్శనానికి మామూలు రోజుల్లో 20 వేల నుంచి 30 వేల మంది వస్తుంటారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో 40 వేల నుంచి 50 వేల వరకు వస్తుంటారు. రూ.500 టికెట్లు కొన్నవారు, సిఫారసులతో దర్శనాలకు వచ్చేవారు లిఫ్టుల్లోనే పైకి వెళ్తారు.

> ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు లిఫ్టు కోసం నానా పాట్లు పడుతున్నారు. టికెట్ కొనుగోలు చేసి దర్శనానికి వెళ్లడానికి వచ్చిన భక్తులకు లిఫ్టు ఎక్కాక సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏడో అంతస్థుకు లిఫ్ట్ వెళ్లదని ఐదో అంతస్థులో దింపేస్తుండటంపై భక్తులు మండిపడుతున్నారు.

మధ్యలోనే ఆపేస్తున్నారు..!

భక్తులను ఏడో అంతస్తు వరకు తీసుకెళ్లాల్సిన సెక్యూరిటీ సిబ్బంది ఆది, మంగళ, శుక్రవారాల్లో మాత్రం ఐదో అంతస్తులో దింపేస్తున్నారు. అక్కడి నుంచి క్యూలో నడిచి వెళ్లాలని చెబుతున్నారు. దీంతో భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సెక్యూరిటీ సిబ్బందితో వివాదానికి దిగుతున్నారు. అధికారుల ఆదేశాలతోనే ఇలా చేస్తున్నామని సెక్యూరిటీ సిబ్బంది చెబుతున్నారు. లిఫ్టుల వద్ద ఒక క్యూ లేకపోవడంతో భక్తులు తోసుకుంటూ లోపలకు వెళ్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. పై నుంచి కిందకు వెళ్లే భక్తులు తోసుకోకుండా ఒక క్యూ నడుపుతున్నారు. ఆ పరిస్థితి దిగువన కనిపించడం లేదు. ఈ తోపులాట మధ్య వెళ్లలేమని భావించిన భక్తులు మహామండపం మెట్ల నుంచి ఏడంతస్తులు నడుచుకుంటూ వెళ్తున్నారు. కిందకు వచ్చిన లిఫ్టుల్లో ఉన్నవారు బయటకు రాకుండానే పైకి వెళ్లాల్సిన భక్తులు ఎక్కేస్తున్నారు. దీంతో గందరగోళం ఏర్పడుతోంది. భక్తుల నుంచి టికెట్లకు రుసుము వసూలు చేస్తున్న ఆలయ అధికారులు తమకు నచ్చిన విధంగా ఎలా ప్రణాళికలు మారుస్తారని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

దసరాలో ప్రైవేట్ సిబ్బంది చేతివాటం 8

ఆయుష్ శాఖ స్థల పరిశీలన

29న పీఎం వర్చువల్‌గా శంకుస్థాపన 8

> ఉచిత ఇసుక గాడి తప్పుతోంది. సామాన్యులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకు రాగా, కొందరు అధికార పార్టీ నాయకుల కారణంగా ఆ ఉద్దేశం నెరవేరడం లేదు. నందిగామ నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా పేరొందిన ఓ నాయకుడి కనుసన్నల్లో మునేరు వాగుపై ఉన్న రీచ్‌ల్లో యథేచ్ఛగా యంత్రాలతో ఇసుక తవ్వుకుపోతున్నారు. లోడింగ్ కాంట్రాక్టర్లకు అధికారికంగా అప్పగించకముందే ఇసుక అనధికారికంగా తరలిస్తున్నారు.

ఉచితం మాటున అనుచితం

నందిగామ నియోజకవర్గంలో ఇసుక దందా

అనుమతులిచ్చింది ట్రాక్టర్లకు.. తరలిస్తున్నది లారీల్లో..

- రాత్రివేళ జోరుగా అక్రమ తవ్వకాలు
- 30 టన్నుల లారీ రూ.12 వేలు
- అధికార పార్టీ షాడో ఎమ్మెల్యేనే సూత్రధారి
- గతంలో స్టాక్‌పాయింట్లలో ఇసుక స్వాహా

అమ్ముకున్న ఇసుక విలువ రూ.9 కోట్లు

అనిగండ్లపాడులో ఇసుక అక్రమ తవ్వకాలు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సామాన్యుడిపై ఇసుక భారాన్ని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుకపై సీనరేజీతో పాటు డీఎంఎఫ్ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్) వంటి వాటన్నింటినీ రద్దు చేసింది. ఇవన్నీ వసూలు చేస్తే టన్నుకు రూ.88 చొప్పున ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ, ప్రజలపై ఎలాంటి భారం మోపకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని రద్దు చేసింది. ట్రాక్టర్ల ద్వారా సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగా తరలించుకోవచ్చని పేర్కొంది. లారీల ద్వారా ఇసుక తరలింపు మాత్రం ప్రభుత్వ అనుమతి మేరకే జరగాల్సి ఉంటుంది. కానీ, నందిగామ నియోజకవర్గంలో లారీల ద్వారా ఇసుకను తరలించేస్తున్నారు. రీచ్‌ల్లో లోడింగ్ కాంట్రాక్టర్‌కు ఇంకా అధికారికంగా అనుమతి ఇవ్వకముందే రీచ్‌ల్లో లారీలు ప్రత్యక్షమైపోతున్నాయి. నందిగామ నియోజకవర్గంలో ఇసుక లారీల్లో తరలిపోతోంది. కొందరు అధికార పార్టీ నాయకులు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. మునేరు వాగు వెంట ఉన్న రీచ్‌ల్లో రాత్రివేళ జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు. లారీల్లో తరలిస్తున్నారు. రీచ్ వద్ద 30 టన్నుల లారీ రూ.12 వేలకు విక్రయిస్తున్నారు. వారం రోజులుగా నిత్యం 100 లారీల ఇసుక తరలిపోతోంది.

నిబంధనలకు విరుద్ధంగా..

లోడింగ్ కాంట్రాక్టర్లు అయినా రీచ్‌ల్లో మాన్యువల్‌గా ఇసుక తవ్వి దానిని ట్రాక్టర్ల ద్వారా స్టాక్ పాయింట్లకు చేర్చాల్సి ఉంటుంది. వారికి కూడా లారీలను రీచ్‌ల్లోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. కానీ, నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌ల్లో ఎక్స్‌కవేటర్లను పెట్టి లారీల ద్వారా తరలిస్తున్నా అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కానీ పట్టించుకోవట్లేదు. కంచికచర్ల మండలం పెండ్యాల, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ఇసుక రీచ్‌ల్లో జోరుగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక లారీల్లో అధికశాతం విజయవాడ, గుంటూరు వస్తుండగా కొన్నింటిని సరిహద్దులు దాటించి తెలంగాణకు పంపుతున్నారు.

రీచ్ వద్ద 30 టన్నుల లారీకి రూ.12 వేలు వసూలు చేస్తున్నారు. అంటే.. టన్ను రూ.400 పడుతుంది. దీనికి లారీ యజమానులు రవాణా చార్జీలు, డిమాండ్‌ను బట్టి అదనంగా మరో రూ.400 నుంచి రూ.600 వేసుకుని విక్రయించుకుంటున్నారు. అంటే.. 30 టన్నుల లారీ రూ.24 వేల నుంచి రూ.30 వేలు పడుతుంది. ఈ లెక్కన టన్ను రూ.800 నుంచి వెయ్యి రూపాయలు అవుతుంది. నందిగామ నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా పేరొందిన వ్యక్తి ఇతరులెవరినీ రీచ్‌ల్లోకి ప్రవేశించనీయకుండా అడ్డుకుంటూ తమ సిండికేట్‌లో భాగమైన లారీల వారికే ఇసుక లోడ్ చేస్తున్నారు. సొంత అవసరాల కోసం ఎవరైనా ట్రాక్టర్‌తో ఇసుక తీసుకెళ్లే ప్రయత్నం చేసినా.. వారినీ అడ్డుకోవడమో లేక లోడింగ్ చేసినందుకు రూ.500 ఇవ్వాలని పట్టుబట్టడమో చేస్తున్నారు. తమ మాట వినని వారిపై పోలీసులతో అక్రమంగా ఇసుక నిల్వ చేసి విక్రయించుకుంటున్నారని కేసులు పెట్టిస్తున్నారు.

ఉచితం అంటే ఇదేనా..?

రూ.9 కోట్ల ఇసుకను మాయం చేశారు

కంచికచర్ల మండలం కీసర స్టాక్‌యార్డులో 2,24,555 మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్టు ఈ ఏడాది జూలై 6న అధికారులు ప్రకటించారు. అయితే, ఈ స్టాక్ పాయింట్ నుంచి రికార్డుల ప్రకారం కేవలం లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకే విక్రయించారు. మిగిలిన 1.24 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను షాడో ఎమ్మెల్యే మాయం చేసి విక్రయించేసుకున్నారు. ప్రభుత్వం అప్పట్లో టన్ను రూ.290 చొప్పున విక్రయించింది. అంటే.. ప్రభుత్వ లెక్కల ప్రకారమే దీని విలువ రూ.3.50 కోట్లు. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 8 స్టాక్ పాయింట్లలో 5.54 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు విక్రయించాల్సి ఉండగా, కేవలం 3 లక్షలే అధికారికంగా విక్రయించగా, మిగిలిన 2.54 లక్షల టన్నులు షాడో ఎమ్మెల్యే మాయం చేశారు. మొత్తం మీద దీని విలువ సుమారు రూ.9 కోట్లు. ఇంత జరిగినా ఇంతవరకు బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

లోడింగ్ కాంట్రాక్టర్ల పేరుతో పాగా

జిల్లాలో 15 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటిలో లోడింగ్, అన్‌లోడింగ్ కాంట్రాక్టును దక్కించుకుని పాగా వేసేందుకు ఇసుక మాఫియా అన్ని ప్రయత్నాలు చేసి విజయం మిగతా 8లో..

మరో రూ.2.5 కోట్ల సాయం

వరద బాధితులకు మరో విడత నగదు జమ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రభుత్వం మరోమారు అర్హులైన 1,501 మంది వరద బాధితులకు రూ.2.5 కోట్ల పరిహారాన్ని విడుదల చేసింది. ఈ మొత్తాన్ని జిల్లా యంత్రాంగం అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. అయితే, 143 మంది ఖాతాలు పనిచేయకపోవడంతో నగదు జమ కాలేదు. బ్యాంకు ఖాతాలనే సమర్పించని మరో 256 మంది లబ్ధిదారులు కూడా ఉన్నారు. ఇప్పటికే వీరి వివరాలను సేకరించిన జిల్లా యంత్రాంగం బ్యాంకు ఖాతాలు ఆపరేషన్స్‌లోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన పరిహారంతో కలిపి ఇప్పటి వరకు రూ.296.82 కోట్ల నిధులను నేరుగా వరద బాధితుల ఖాతాల్లో జమైంది. 1,80,098 మంది వరద బాధితులకు పరిహారం అందింది.

ప్రభుత్వ సానుకూలతతో..

జిల్లావ్యాప్తంగా 179 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలు వరద కష్టాలను చవిచూశారు. బాధితులందరికీ న్యాయం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్లడ్ ఎన్యూమరేషన్ నిర్వహించింది. దాదాపు 2,954 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ పరిశీలించాక అర్హులను ఎంపిక చేశారు. ఆ తర్వాత కూడా పరిహారం కోసం కలెక్టరేట్‌కు భారీగా వస్తున్నందున జిల్లా యంత్రాంగం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఎవరొచ్చి దరఖాస్తులు ఇచ్చినా కలెక్టరేట్ కార్యాలయంలో స్వీకరించటంతో పాటు కంప్యూటరీకరించారు. వీటిని పరిశీలించి, అర్హులను ఎంపిక చేసి, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ప్రభుత్వం కూడా అర్హులెవరూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో మిగిలిన వారికి కూడా పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది.

సచివాలయాల్లో జాబితాలు

- నిధిమీనా, ఇన్‌చార్జి కలెక్టర్

తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన సాయంతో కలిపి మొత్తంగా 1,80,098 మంది వరద బాధితులకు రూ.296.82 కోట్ల సాయం అందించామని ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా తెలిపారు. లబ్ధిదారుల జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. కలెక్టరేట్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ ద్వారా 2,954 దరఖాస్తులు వచ్చాయని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారిని గుర్తించామన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించండి

బీమా కంపెనీ ప్రతినిధులతో రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా

విజయవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ఆస్తి, వాహన నష్టాలకు ఇంకా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఇన్సూరెన్స్ సంస్థలకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాతో కలిసి బీమా సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. బుడమేరు వరద సందర్భంగా జరిగిన వాహన నష్టాలకు క్లెయిమ్‌లు, ఇంకా పరిష్కరించాల్సిన వాటికి సంబంధించి ఇన్సూరెన్స్ సంస్థలతో చర్చించారు. మోటారు వాహనాల క్లెయిమ్‌లు 12,632, ఆస్తుల క్లెయిమ్‌లు 2,794తో కలిపి మొత్తం 15,426 క్లెయిమ్‌లు నమోదయ్యాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వీటిలో 605 క్లెయిమ్‌ల ఉపసంహరణ జరిగిందని, 325 క్లెయిమ్‌లను తిరస్కరించటం జరిగిందన్నారు. ఇవి పోను మిగిలిన 14,996 క్లెయిమ్‌లలో ఆన్ అకౌంట్, అండర్ ఆక్షన్‌తో 97.16 శాతం మేర సెటిల్‌మెంట్ చేసినట్టు రవాణా అధికారులు తెలిపారు. మొత్తం రూ.136.52 కోట్ల మేర చెల్లింపులు చేసినట్టు ఉన్నతాధికారులకు తెలిపారు. దీనిపై సిసోడియా స్పందిస్తూ బీమా క్లెయిమ్‌లపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ఎక్కడా అలసత్వం చూపొద్దన్నారు. క్లెయిమ్‌ల పరిష్కారంలో బీమా సంస్థలను అభినందిస్తూనే ఇదే స్ఫూర్తితో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ డీటీసీ సీహెచ్ మోహన్, డీటీసీ (ఐటీ) పురేంద్ర, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రాణాలు పోతున్నా..

- వీఐపీ కారిడార్‌లో ప్రమాదకరంగా హోర్డింగ్స్
- కేంద్ర రవాణాశాఖ నిబంధనలు బేఖాతరు
- ప్రమాదాలు జరుగుతున్నా నిర్లిప్తత
- నోటీసులిచ్చి ఏళ్లు కావస్తున్నా చర్యల్లేవ్..!

8



లెనిన్ సెంటర్ ప్రక్షాళన

- ఆక్రమణలు తొలగించిన వీఎంసీ
- రోడ్లను ఆక్రమించి అద్దెల వసూలు
- వాహనాలు తిరిగే స్థలం కూడా లేకుండా..
- చోటా నేతల కబ్జా బాగోతాలకు చెక్

10



దసరా ఉత్సవాల్లో..
ప్రైవేటు సిబ్బంది చేతివాటం!

- ఐదువేల లడ్డూలకు తేలని లెక్కలు
- భక్తుల నుంచి గూగుల్, ఫోన్ పే ద్వారా నగదు చెల్లింపులు
- సిబ్బందే తిరిగి చెల్లించాలన్న దుర్గగుడి అధికారులు
- లబోదిబో మంటున్న ఆలయ సిబ్బంది

వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఇటీవల జరిగిన దసరా ఉత్సవాల్లో లడ్డూ ప్రసాదం కౌంటర్లలో విధులు నిర్వహించిన ప్రైవేటు సిబ్బంది చేతివాటంపై వివాదం నెలకొంది. లడ్డూలు కొనుగోలు చేసిన భక్తులకు టిక్కెట్లు ఇవ్వకుండా తమ ఫోన్‌లకు రుసుమును గూగుల్ పే, ఫోన్ పే చేయించుకున్నారు. సుమారు 5 వేల లడ్డూలు తగ్గినట్టు దీంతో దేవస్థానం అధికారుల లెక్కల్లో తేలడంతో ఆ మొత్తం డబ్బులను నాడు విధుల్లో ఉన్న సిబ్బంది చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. దసరా ఉత్సవాల్లో ప్రసాదం కౌంటర్లు, కేశఖండనశాల టిక్కెట్ల కౌంటర్లను దేవస్థానం అధికారులు కరూర్ వైశ్యా బ్యాంక్‌కు అప్పగించారు. బ్యాంకు అధికారులు సిబ్బందిని నియమించేందుకు వన్‌టౌన్‌కు చెందిన దుర్గా సప్లయ్ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ ఉత్సవాల్లో ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో పనిచేసేందుకు 90 మందిని నియమించింది. లడ్డూ కౌంటర్లలో సిబ్బంది భక్తులకు టిక్కెట్లు ఇవ్వకుండా కొందరి నుంచి నగదు, మరికొందరి నుంచి గూగుల్ పే, ఫోన్ పే చేయించుకుని లడ్డూలు విక్రయించారు. ఈ విధంగా ఉత్సవాల మొదటి రెండు రోజుల్లో జరిగినట్టు సమాచారం. దీనిపై పలువురు భక్తులు సిబ్బందిని ప్రశ్నించగా, కంప్యూటర్ పనిచేయటం లేదని సమాధానం చెప్పారు. అనుమానం వచ్చిన భక్తులు విషయాన్ని అదేరోజున అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో ఉత్సవాలు ముగిసిన తరువాత ప్రసాదం లెక్కింపులో లడ్డూల సంఖ్య తగ్గిన వ్యవహారం బయటపడింది. సంబంధిత విభాగం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఆరు లడ్డూల బాక్స్‌లు సుమారు 200, సింగిల్ లడ్డూలు సుమారు 3వేలు తగ్గినట్టు గుర్తించారు. కౌంటర్ల వద్ద లడ్డూ ప్రసాదం పర్యవేక్షించిన దేవస్థానం సిబ్బందే బాధ్యత వహించాలని, తగ్గిన లడ్డూల ధరను వారే చెల్లించాలని అధికారులు సూచించడంతో సిబ్బంది లబోదిబోమంటున్నారు. తమకు ఎలాంటి సంబంధం లేకపోయినా డబ్బులు ఎలా కడతామంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు సిబ్బందిని నియమించిన దుర్గా సప్లయ్ సంస్థ నుంచి కాని, సంస్థ సిబ్బంది నుంచి గాని రికవరీ చేయాలని వారు కోరుతున్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్రీరామ వరప్రసాద్

మోపిదేవిలో నాగుల చవితికి ఏర్పాట్లు

మోపిదేవి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 5న జరిగే నాగుల చవితి పర్వదినం విజయవంతమయ్యేందుకు అన్ని శాఖల ఉద్యోగులు సహకరించాల్సిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల ఉద్యోగులతో సమీక్షా సమావేశం జరిగింది. నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని లక్ష మందికిపైగా భక్తులు విచ్చేస్తారని అంచనా ఉందన్నారు. తెల్లవారుజాము 2.30 గంటలకు నాగపుట్ట వద్ద ప్రత్యేకపూజలు జరిపి 3 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్టు ఈవో తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. భక్తులకు స్వామివారి దర్శనం సత్వరమే కలిగేలా ప్రత్యేక క్యూ లైన్లు, భక్తుల వాహనాలను పార్కింగ్ ఏర్పాట్లు చేయనున్నట్టు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద, ఎంపీడీవో స్వర్ణభారతి, ఈవోపీఆర్‌డీ సుందరి, విద్యుత్ శాఖ ఏఈ పాండురంగారావు, మోపిదేవి ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కొండపావులూరులో తమ శాఖకు కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆయుష్ కమిషనర్ రాజేంద్రకుమార్, కలెక్టర్ బాలాజీ

ఆయుష్ శాఖ స్థల పరిశీలన

- 29న పీఎం వర్చువల్‌గా శంకుస్థాపన?

గన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం కొండపావులూరు సర్వేనెంబర్ 6లో ఆయుష్ శాఖకు టీడీపీ హయాంలో 25 ఎకరాలు కేటాయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ భూమి గురించి పట్టించుకోలేదు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయుష్ శాఖకు కేటాయించిన భూమికి సంబంధించి ఆరాతీసి అక్కడ సెంట్రల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి(సీఆర్ఐవైఎన్) ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ నెల 29న యోగా అండ్ నేచురోపతి డే సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని అధికారులు భావించారు. దీంతో శుక్రవారం ఆయుష్ కమిషనర్ రాజేంద్రకుమార్, కలెక్టర్ డీకే బాలాజీలు రెవెన్యూ, పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి శాఖకు కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వే నెంబర్ 6లోని పాతాళి గట్టు 35 ఎకరాల్లో ఉండగా.. దానిలో 25 ఎకరాలు ఆయుష్‌కు కేటాయించారు. అయితే ఈ ప్రాంతం ఎత్తుగా ఉందని, సీఆర్ఐవైఎన్ వర్చువల్ శంకుస్థాపన సాధ్యపడుతుందా లేదా అని అధికారులు చర్చించారు. విజయవాడలో చేస్తే బాగుంటుందా లేక ఇక్కడే చేయాలా అనే సందిగ్ధంలో ఉన్నట్టు తెలిసింది. శనివారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకు రానున్నారు. మంత్రి పరిశీలన చేసి తుది ప్రకటన చేస్తారని సమాచారం. తహసీల్దారు శివయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సూరిశెట్టి లోకేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ సుధాకర్, డీఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ డి.బలరాం, ఏఈ శ్రీహరి, విద్యుత్ శాఖ ఏడీ రామ్మూర్తి నాయుడు, ఏఈ వెంకటరాజు, పీఆర్‌ఏఈ బాసు, మండల సర్వేయర్ మాధవరావు, వీఆర్వో గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ స్వర్ణకారుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మరో బీసీ కులానికి కొత్తగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏపీ స్వర్ణకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌ను సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, 2001 కింద రిజిస్టర్ చేయాలని ఆదేశాలిస్తూ బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఉన్న 56 బీసీ కార్పొరేషన్లతో పాటు ఈ కార్పొరేషన్ స్వర్ణకారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీకి సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా విడుదల చేస్తారు.



ప్రాణాలు పోతున్నా..

జాతీయ రహదారుల వెంబడి హోర్డింగుల ఏర్పాటుకు నిర్దేశించిన మార్గదర్శకాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. కార్పొరేట్ అవుట్‌డోర్ ఏజన్సీలు, పలుకుబడి కలిగిన ప్రైవేటు వ్యక్తులు యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతుండటంతో హైవేల వెంబడి హోర్డింగ్స్ పుట్టగొడుగుల్లా వెలిసి రోడ్డు ప్రమాదాలకు తావిస్తున్నాయి. దీంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ నగర పరిధిలో, వెలుపల ప్రవేశమార్గాల దిగువున భారీ సంఖ్యలో హోర్డింగ్స్ వెలిశాయి. వీటిలో చాలావరకు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసినవే కావడం గమనార్హం. కేంద్ర మార్గదర్శకాలకు భిన్నంగా జాతీయ రహదారి మార్జిన్‌కు అత్యంత సమీపంలో హోర్డింగ్స్ ఏర్పాటు జరిగాయి. ఈ విషయంలో కేంద్ర రవాణామంత్రిత్వశాఖ నిబంధనలు బేఖాతరు చేయటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



- వీఐపీ కారిడార్‌లో ప్రమాదకరంగా హోర్డింగ్స్
- కేంద్ర రవాణాశాఖ నిబంధనలు బేఖాతరు!
- ప్రమాదాలు జరుగుతున్నా నిర్లిప్తత
- నోటీసులిచ్చి ఏళ్లు కావస్తున్నా చర్యల్లేవు

వీఐపీ కారిడార్‌లో ప్రమాదాలెన్నో..

ఎన్‌హెచ్-16పై వీఐపీ కారిడార్‌లో చాలాకాలంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రామవరప్పాడు రింగ్, ఎనికేపాడు, నిడమానూరు, కేసరపల్లి, గన్నవరంల వద్ద పెద్దసంఖ్యలో ప్రమాదాలు జరగటంతో పాటు ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో కూడా ప్రమాదాలపై సీరియస్‌గా చర్చలు జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్స్ మీద పెట్టిన దృష్టి.. హోర్డింగ్స్‌ల నుంచి పొంచి ఉన్న ప్రమాదాలపై మాత్రం సారించటం లేదు.

నిబంధనలు అతిక్రమించి..

కేంద్ర నిబంధల ప్రకారం.. 100 మీటర్ల లోపు హోర్డింగులు ఏర్పాటు చేయకూడదు. జాతీయ రహదారులైనా, జంక్షన్లు అయినా, ఫ్లై ఓవర్లయినా సరే ఇదే నిబంధన వర్తిస్తుంది. విజయవాడ మీదుగా వెళ్లే ఎన్‌హెచ్-16 వెంబడి, ఎన్‌హెచ్-65లపై నిబంధనలు అతిక్రమించి హోర్డింగులు ఏర్పాటుచేశారు. ఎన్‌హెచ్-16 వెంబడి వీఐపీ కారిడార్‌లో గన్నవరం నుంచి రామవరప్పాడు రింగ్ వరకు పోల్ హోర్డింగ్స్ పెద్ద సంఖ్యలో హైవే పక్కన ఏర్పాటయ్యాయి. రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి కనకదుర్గవారధి వరకు భవనాలపై ఉన్నాయి. ఎన్‌హెచ్-65 వెంబడి నగరంలో ఎక్కువగా హైవే వెంబడి ఉన్న భవనాలపై హోర్డింగ్స్ ఏర్పాటు జరిగాయి. ప్రధానంగా వీఐపీ కారిడార్‌లో గన్నవరం నుంచి రామవరప్పాడు వరకు ఎన్‌హెచ్-16కు అత్యంత సమీపంలో భారీ సంఖ్యలో హోర్డింగ్స్ ఏర్పాటు జరిగాయి. చాలా వరకు నిబంధనలు అతిక్రమించినా ఎన్‌హెచ్ అధికారులు దృష్టి సారించటం లేదు.

తొలగించాలని నోటీసులు ఇచ్చినా..

విజయవాడ డివిజన్ అధికారులు 2016-17 సంవత్సరంలో ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65ల వెంబడి హోర్డింగ్స్‌పై పరిశీలన చేశారు. భారీ సంఖ్యలో హోర్డింగ్స్‌ను గుర్తించి వాటి తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు నోటీసులు కూడా ఇవ్వటం జరిగింది. ఆ తర్వాత కార్పొరేట్ అవుట్‌డోర్ ఏజన్సీలు, బడా ప్రైవేటు వ్యక్తులు ఎన్‌హెచ్ అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తాత్కాలికంగా చర్యలు వాయిదా వేయించారు. అయితే ఇప్పటి వరకు అనధికార హోర్డింగ్స్‌పై ఎలాంటి చర్యలు లేవు. హైవేల వెంబడి హోర్డింగ్స్ ఏర్పాటుపై కేంద్రం సీరియస్ అవుతున్నా ఎన్‌హెచ్ అధికారుల్లో చలనం రావటం లేదు. కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ అధికారులు అనధికార హోర్డింగ్స్ తొలగించాల్సిందిగా ఎన్‌హెచ్ అధికారులందరికీ 2020లో ఆదేశాలు జారీ చేశారు. అయితే కార్పొరేట్ అవుట్ డోర్ యాడ్ ఏజన్సీలు, ప్రైవేటు వ్యక్తులు ఎన్‌హెచ్ అధికారులపై ఒత్తిళ్లు తీసుకు వచ్చారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా వచ్చాయి.

- కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్‌హెచ్ ప్రాంతీయ కార్యాలయ అధికారులకు కూడా అనధికార హోర్డింగ్‌లను తక్షణం తొలగించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వటం జరిగింది. విజయవాడలో హైవే పక్కనే ఎన్‌హెచ్ ప్రాంతీయ కార్యాలయం ఉంది. పబ్లిక్‌గా హోర్డింగులు కనిపిస్తున్నా ఆర్వో కార్యాలయ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కేంద్ర రవాణా నిబంధనల ప్రకారం కమర్షియల్ అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్స్‌పై 80 శాతం మాత్రమే వాటి ప్రకటనలు ఉండాలి. మిగిలిన 20 శాతం ప్రజలకు సూచనలు చేస్తున్న సమాచారం ఉండాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావటం లేదు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు వీఐపీ కారిడార్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హోర్డింగ్స్ తొలగింపునకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గుర్రపుడెక్కతో గృహోపకరణాలు

- అసోం నిపుణులతో నాలుగు నెలల శిక్షణ
- తొలిసారి చిన్నాపురంలో వస్తువుల తయారీ
- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ వెల్లడి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచుకోవడానికి హస్తకళలు దోహదపడతాయని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బందరు మండలం చిన్నాపురం ఎస్టీ కాలనీలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ, లేపాక్షి హస్తకళల సహకారంతో గుర్రపుడెక్కతో గ్రామీణ మహిళలకు నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ నిండిపోవడంతో ప్రవాహానికి అవరోధంగా మారి రైతులకు ఇబ్బందికరంగా ఉంటోందని, కోట్లాది రూపాయల వ్యయంతో గుర్రపుడెక్కను తొలగించాల్సి వస్తోందన్నారు. ఇలా పారేసే గుర్రపుడెక్కను కళాకృతుల తయారీకి వినియోగించవచ్చని, ఈ దిశగా చిన్నాపురంలో మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో వినూత్నరీతిలో తొలిసారి ఈ తరహా శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందుకు అసోం నుంచి అనుభవజ్ఞులైన రిసోర్సుపర్సన్లను పిలిపించామన్నారు. ప్లాస్టిక్ యుగంలో పర్యావరణానికి హానికరంగా ఉంటోందని, ఎకో ఫ్రెండ్లీగా విరివిగా లభించే గుర్రపుడెక్కను కళాకృతుల తయారీకి వినియోగిస్తున్నామన్నారు. మహిళలు ఇక్కడ తయారు చేసిన వస్తువులను లేపాక్షి ఎంపోరియంల ద్వారా విక్రయిస్తామని, దీనివల్ల ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు. లేపాక్షి హస్తకళల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో 20 లేపాక్షి షోరూంలు ఉన్నాయని, వీటిల్లో ఇమిటేషన్ జ్యూయలరీ, కలంకారీ దుస్తులతో పాటు ఇలాంటి హస్తకళల ఆకృతులను షాపుల్లో విక్రయిస్తామన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచ్ గోపాలరావు, అసోం జాతీయ పురస్కార గ్రహీత రీటాదాస్, పంకజ్ రేఖ, విపుల్‌కులేటి, పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు, చేనేత జౌళిశాఖ ఏడీ సాయిప్రసాద్, లేపాక్షి హస్తకళల మేనేజర్ సురేష్, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు మాట్లాడారు.


గుర్రపుడెక్కతో గృహోపకరణాల తయారీ విధానాన్ని కలెక్టర్ బాలాజీకి వివరిస్తున్న అసోం ట్రైనర్ రీటా దాస్

వినూత్నంగా గుర్రపుడెక్కతో వస్తువుల తయారీ

\- జాతీయ అవార్డు గ్రహీత, అసోం కళాకారిణి రీటాదాస్



అసోంలో వినూత్నంగా గుర్రపుడెక్కతో నిత్య జీవితంలో ఉపయోగించే వస్తువులను తయారు చేస్తున్నాం.. వీటికి మార్కెటింగ్ బాగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిలుపు మేరకు నాలుగు నెలల పాటు చిన్నాపురంలో ఉంటూ మహిళలకు శిక్షణ ఇవ్వనున్నాం. ఇప్పటి వరకు ఆరు రాష్ట్రాల్లో మహిళలకు ఈ తరహా శిక్షణ ఇచ్చాం. విదేశాల్లో పర్యావరణ హితంగా ఉండే గుర్రపుడెక్కతో చేసిన వస్తువుల కొనుగోళ్లు పెరిగాయి. గతంలో జనపనార, అరటినారతో వస్తువులు తయారు చేసేవారం. ఏ విధమైన పెట్టుబడి లేకుండా లభించే గుర్రపుడెక్కతో వస్తువుల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు అసోం నుంచి పంకజ్‌రేఖ, విపుల్‌కులేటి కూడా వచ్చారు. ప్రజలు చైతన్యవంతులై హస్తకళలను ప్రోత్సహించాలి.

పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ

- మంత్రి పార్థసారథి వెల్లడి

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్ విధ్వంసక విధానాల వల్ల రాష్ట్ర ప్రజల ఆస్తుల విలువ పడిపోగా, సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో ఏపీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని, దీంతో ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'జగన్ దుష్పాలనలో పెట్టుబడులు రాకపోగా, రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోవడంతో ఏపీ ఇమేజ్ దెబ్బతిన్నది. ఇప్పుడు చంద్రబాబు ఇమేజ్ వల్లే పెట్టుబడులు, నిధులు వస్తున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయి' అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ 2029 నాటికల్లా ఇళ్లు నిర్మించాలని సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో యూనిట్ విలువ పెంచాలని, లబ్ధిదారులకు మంజూరు చేసే ఇంటినే గ్యారెంటీగా పరిగణించి బ్యాంకర్లు రుణాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరినట్లు మంత్రి వివరించారు. 'సీఎంగా పనిచేసిన వ్యక్తి.. ఆస్తి కోసం తల్లి, చెల్లిని కోర్టుకు లాగుతున్నాడు. కుటుంబసభ్యులకు న్యాయం చేయలేని వ్యక్తి.. ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు?' అని జగన్‌ను ప్రశ్నించారు. తల్లిని బాధపెడితే తండ్రి వైఎస్ ఆత్మ ఘోషించదా? అని మంత్రి పార్థసారథి అన్నారు.

హాస్టల్ విద్యార్థి హత్య కేసులో మూడేళ్ల జైలు

చల్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర కలకలం సృష్టించిన చల్లపల్లి బీసీ హాస్టల్ విద్యార్థి దాసరి ఆదిత్య హత్య కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. చల్లపల్లి జడ్పీహైస్కూల్ ఆవరణలోని బీసీ వసతి గృహంలో ఆదిత్య అనే విద్యార్థిని 2019 ఆగస్టు నెలలో సహచర విద్యార్థి బ్లేడుతో గొంతుకోసి హత్య చేశాడు. ఆగస్టు 6న తేదీ ఉదయం ఆదిత్య హాస్టల్ బాత్‌రూమ్‌లో శవమై రక్తపు మడుగులో పడిఉండటం, హాస్టల్ విద్యార్థి హత్యోదంతం అప్పట్లో తీవ్ర కలకలం సృష్టించింది. హత్యకేసును నాటి ఎస్సై పి.నాగరాజు నమోదు చేయగా, సీఐ ఎస్.వెంకట నారాయణ దర్యాప్తు చేశారు. ముద్దాయి (మైనర్)పై నేరం రుజువు కావటంతో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ సెకండ్ మెట్రోపాలిటన్ కోర్టు, జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి జస్టిస్ కె.మాధవీదేవి తీర్పునిచ్చారు. ముద్దాయిని విశాఖపట్నం జువైనల్ హోమ్‌కు తరలించినట్లు చల్లపల్లి ఎస్సై పి.ఎస్‌వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రాజుపేట సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు సిహెచ్. రాజేష్ మాట్లాడుతూ, విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు చార్జీల వల్ల ప్రజలపై పెనుభారం పడిందన్నారు. తక్షణం వాటిని రద్దు చేయాలన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ, నగర కార్యదర్శి బి. సుబ్రహ్మణ్యం, నాగయ్య, కొడాలి సుజాత, సిహెచ్. అరుణకుమారి, బి. భవానీ, ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

సేవకు మారుపేరు జైనులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



లబ్బీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశ వ్యాపారాభివృద్ధిలో జైనుల పాత్ర ఎంతో కీలకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ విజయవాడ చాప్టర్ ప్రధాన విభాగంతో పాటు, మహిళ, యువజన నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం బందర్‌రోడ్డులోని శేషసాయి కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సేవకు మారుపేరు జైనులు అన్నారు. రాజమండ్రిలో తన గెలుపు విషయంలో జైనుల సహకారం మరువలేనిదని, జైనులు 99 శాతం అక్షరాస్యతతో ఉన్నారని అన్నారు. నూతన కమిటీ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు సహకారం అందించాలని అన్నారు. అనంతరం విజయవాడ అధ్యక్షులు కమలేష్ ఫోలాముతా, కార్యదర్శి ప్రవీణ్‌రాంకాలు మాట్లాడుతూ జీతో నూతన కార్యవర్గ బాధ్యతలు స్వీకరిస్తుందని, జైనులు చదువు, సేవా, వ్యాపారాభివృద్ధి ఈ మూడు అంశాలపై పనిచేస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దినేష్ జైన్, రాకేష్ జైన్, ముఖ్య కార్యదర్శి మనీష్ జైన్, కార్యదర్శులు ప్రవీణ్ రాంకా, మనీష్ మంగీలాల్‌జైన్, కోశాధికారి కుందనమల్ గాంధీ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

- ఏసీపీ దామోదర్

గుణదల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని నగరంలో బాణాసంచా విక్రయాలు చేసేవారు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్ హెచ్చరించారు. పేలుడు పదార్థాల చట్టం 1884లోని సెక్షన్ 13 ప్రకారం ప్రమాదకరమైన నేరాలకు పాల్పడే ఏ వ్యక్తినైనా వారెంట్ లేకుండా అరెస్టు చేసే అధికారం ఉందని తెలిపారు. కావున నగరంలో ముందస్తుగా ఎవరైనా అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేసినా పెద్దమొత్తంలో తీసుకొచ్చి నిల్వ ఉంచినా అటువంటివారి సమాచారాన్ని దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఇలా సమాచారం ఇవ్వడం వల్ల పెను ప్రమాదం జరగకుండా నిరోధించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఉపాధి చీఫ్ విజిలెన్స్ అధికారిగా అడిషనల్ ఎస్పీ

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చీఫ్ విజిలెన్స్ అధికారి(సీవీఓ)గా అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిని నియమిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజిలెన్స్ అధికారిగా పోలీసు అధికారిని నియమిస్తామని ఇప్పటికే స్పష్టం చేశారు. దాని ఆధారంగా ఇప్పుడు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అడిషనల్ ఎస్పీ భవానీ హర్షను డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

సోషల్ ఆడిట్ డైరెక్టర్‌గా శ్రీకాంత్

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీ విభాగానికి రాష్ట్ర డైరెక్టర్‌గా శ్రీకాంత్ గొన్నాబత్తులను నియమిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్ల పాటు పదవిలో ఉంటారు. ఉపాధి హామీ పథకంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని పలు పథకాలకు సంబంధించి పనులను తనిఖీ చేసి అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు సోషల్ ఆడిట్ విభాగం సిఫార్సు చేస్తుంది.


భోజనం రుచి చూస్తున్న చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

మధ్యాహ్నభోజనం పరిశీలన

పటమట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పటమటలంక కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును ఏపీ ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోజనం సరిగా లేదని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసినట్టు తెలిపారు. భోజనంలో వాడుతున్న వంటనూనె, రాగి పిండి పరిశీలించారు. కందిపప్పుకు బదులుగా పచ్చిశెనగపప్పు వాడారని, కోడిగుడ్లు సైజు తక్కువగా ఉండటాన్ని గుర్తించి కాంట్రాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నామన్నారు. ఇంకా నాణ్యమైన భోజనాన్ని తయారుచేయాలని వంట సిబ్బందికి, స్కూల్ ప్రధానోపాధ్యాయుడుకి సూచించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి విటమిన్లుతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తుందని, ఈ బియ్యం ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి మంచిదని, పిల్లలందరూ మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలో తినాలని కోరారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ సురేష్, ఎంఈవో ఆర్.విజయరామారావులు పాల్గొన్నారు.

ఉచితం మాటున అనుచితం

(7వ పేజీ తరువాయి)

సాధించింది. ప్రభుత్వం టన్నుకు రూ.110 ఇస్తామని ఆఫర్ చేసినా.. ఈ మాఫియా కేవలం రూ.72కే తాము లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తామంటూ ముందుకొచ్చి కాంట్రాక్టును దక్కించుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో సగంపైగా రీచ్‌ల్లో చక్రంతిప్పిన నందిగామ నియోజకవర్గానికే చెందిన వ్యక్తి కైవసం చేసుకున్నారు. ఈయన ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి మంత్రిగా ఉన్న వ్యక్తికి అత్యంత సన్నిహితుడు. రెండు రీచ్‌ల్లో కాంట్రాక్టును షాడో ఎమ్మెల్యే కైవసం చేసుకున్నారు. లోడింగ్ కాంట్రాక్టు పేరుతో రీచ్‌ల్లో పాగా వేసి, ఇష్టారాజ్యంగా ఇసుక తరలించుకోవచ్చన్న వ్యూహంతో వీరు ప్రభుత్వం ఆఫర్ చేసిన ధర కన్నా తక్కువకే కాంట్రాక్టును దక్కించుకోవడం గమనార్హం.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ లైవ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

ఎన్‌ఎస్‌ఎంలో కెరీర్ ఫెయిర్ రేపు

ఆటోనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఏజీఈ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎం స్కూల్‌లో ఈనెల 27న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కెరీర్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఫెయిర్‌లో 10 నుంచి 12 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. ఈ ఫెయిర్ వల్ల ప్రపంచ విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకునే అవకాశం లభిస్తుందని, మెడిసిన్, ఇంజనీరింగ్ మాత్రమే కాకుండా పలు సబ్జెక్ట్ కాంబినేషన్‌లు ఎలా ఎంపిక చేసుకోవచ్చు అనేది విద్యావేత్తలు సలహాలు, సూచనలిస్తారని వెల్లడించారు. ఈయ కెరీర్ ఫెయిర్‌లో దేశంలోని 36 విశ్వవిద్యాలయాలు పాల్గొంటున్నాయన్నారు.



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న సిబ్బంది

వ్యాధులపట్ల అవగాహన కల్పించేందుకు ఫ్రైడే డ్రైడే

● జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ నవీన్

రామలింగేశ్వరనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ తెలిపారు. శుక్రవారం రామలింగేశ్వరనగర్, రాణిగారితోట, భ్రమరాంబపురం ప్రాంతాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా అధికారులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో మురికినీరు, నిల్వ ఉన్న నీరు, ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి, దోమల లార్వాను గుర్తించి నిర్మూలిస్తామని, స్థానికులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. స్థానికంగా జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ జగదీష్, హెల్త్ అసిస్టెంట్ నాంచారయ్య, ఇతర మున్సిపల్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు ఆశాలు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యలమంచి సదాశివరావు, తదితరులు

డయాబ్ ఎండోకాన్ వైద్య సదస్సు రేపు

ఆటోనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డయాబ్ ఎండో కాన్ వైద్య సదస్సును ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ యలమంచి సదాశివరావు తెలిపారు. శుక్రవారం సూర్యారావుపేటలోని వైడీఆర్‌ఎఫ్ రీసెర్చ్ సెంటర్‌లో డయాబ్ ఎండో కాన్ 2024 బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య చికిత్సలు, పరిశోధనా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కృష్ణ శేషాద్రికి గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ తరపున రెండు సీఎంఈ క్రెడిట్స్ అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైడీఆర్‌ఎఫ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచి, సెక్రటరీ డాక్టర్ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమూల్య యలమంచి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

విజయవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 15మందికి రైల్వే కోర్టు జరిమానా విధించింది. ఐదో ట్రాఫిక్ స్టేషన్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. వారిలో ఆరుగురికి రూ.15వేలు చొప్పున, తొమ్మిది మందికి రూ.10వేలు చొప్పున న్యాయస్థానం జరిమానా విధించింది.

రోడ్డు తవ్వారు..పూడ్చటం మరిచారు

● మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్న స్థానికులు ● సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేసినా స్పందన నిల్

(ఆంధ్రజ్యోతి, కృష్ణలంక)

కృష్ణలంక హైస్కూల్ రోడ్డులో దాదాపు మూడు నెలల క్రితం సిమెంట్ రోడ్డు మధ్యలో డ్రెయినేజీ పైపులు వేసేందుకు కార్పొరేషన్ కాంట్రాక్టర్ రోడ్డును కటింగ్ చేసి పైపులు అమర్చారు. అనంతరం డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ నుంచి మసీదు సెంటర్ వరకు మాత్రమే సిమెంట్‌తో తవ్విన చోట పూడ్చారు. అక్కడ నుంచి ఐడియల్ స్కూల్ వరకు హైస్కూల్ రోడ్డులో తవ్విన చోట రాళ్లు, రప్పలు పైకి వచ్చి ద్విచక్రవాహనదారులు రోడ్డుప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకున్న నాథుడే లేరనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తవ్విన రోడ్డును సిమెంట్‌తో రోడ్డు లెవల్‌కు సరి చేయాలంటూ దోనేపూడి కాశీనాథ్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు పలుమార్లు ఆందోళనలు చేసినా స్పందన లేదు.



కృష్ణలంక హైస్కూల్ రోడ్డు మధ్యలో తవ్వి వదిలేసిన రోడ్డు

ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ ఈ సమస్యపై దృష్టి సారించాలని, రోడ్డు మధ్యలో తవ్వి వదిలేసిన చోట సిమెంట్‌తో సరి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలను ఆదుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



చిన్నారి జియాకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య సేవల కోసం పేదలు అప్పులు పాలు కాకూడదనే ఉద్దేశ్యంతో వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్యఖర్చులు అందచేస్తూ సీఎం చంద్రబాబు పేదలకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 11వ డివిజన్‌లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.5లక్షలతో వైద్యం చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చిన బాలిక జియాను ఎమ్మెల్యే శుక్రవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం మందులు నిమిత్తం గద్దె తన సొంత నిధుల నుంచి రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి సరైన అర్థం చెప్పిందీ సీఎం చంద్రబాబునేనన్నారు. వైద్యసేవలు పొందిన బాలిక పూర్తిస్థాయిలో కోలుకుని చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గద్దె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోనేరు రాజేష్, రింకు మేనమామ రతన్, రాజనాల పవన్‌లు పాల్గొన్నారు.

మహిళలు మానసికంగా ధైర్యంగా ఉండాలి



జ్యోత్స్న చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

మొగల్రాజపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో కూడా మహిళలు పని చేస్తున్న చోట్ల, ప్రయాణాల్లో, ఎక్కడ పడితే అక్కడ వేధింపులు, ఆకృత్యాలు జరుగుతుండటం బాధాకరమని, వీటిని ఎదుర్కోవాలంటే ప్రతి మహిళ, యువతి మానసికంగా ధైర్యంగా ఉండి ఎదిరించడం ఒక్కటే మార్గం అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి చెప్పారు. జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో కార్యాలయంలో ప్రస్తుతం పరిస్థితుల్లో యువతుల సమస్యలు - పరిష్కారాలు అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వేధింపులకు గురయ్యేవారు ధైర్యంగా బయటకు వచ్చి మహిళా సంఘాలకు, మహిళా కోర్టుకు చెప్పాలని సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మాజీ పీడీ సుహాసినీదేవి మాట్లాడుతూ మహిళలు వృత్తిపరంగా, ఉద్యోగపరంగా, రాజకీయంగా సామాజికంగా పురుషులకు ధీటుగా ఎదుగుతున్నపుడు ఎవరికీ భయపడాల్సిన పనిలేదన్నారు. ఈ కార్యక్రమానికి జన శిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముందు ఇటీవల మరణించిన తరుణీ తరంగాలు సభ్యురాలు జ్యోత్స్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణా సంస్థాన్ శిక్షణార్థులు, శిక్షకులు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డులో అర్ధరాత్రి వేళ వ్యాపారాలు

● గంజాయి, బ్లేడ్‌బ్యాచ్ హల్‌చల్

గుణదల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు రింగ్‌రోడ్డులో 365 రోజులూ అర్ధరాత్రి వేళల్లోనూ వ్యాపారాలు యదావిధిగా జరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. రామవరప్పాడు రింగ్‌రోడ్డులో ఉన్న టిఫిన్ సెంటర్, టీస్టాల్, సిగరెట్లు అమ్మే దుకాణంలో అర్ధరాత్రి వేళల్లోనూ వ్యాపారం చేస్తుంటారు. జాతీయ రహదారి వెంబడి ఇంత బాహాటంగా వ్యాపారం జరుగుతుంటే ఎవరూ పట్టించుకోకుండా వదిలేయడంతో అర్ధరాత్రి టీ, సిగరెట్ రామవరప్పాడు రింగ్‌రోడ్డుకు వస్తే దొరుకుతుందన్న నమ్మకం యువతకు ఉంది. దీని వల్ల ప్రయాణాలు చేసే వారికి ఒకింత ఉపయోగకరంగా ఉన్నా ఇక్కడకు బ్లేడ్‌బ్యాచ్, గంజాయి బ్యాచ్ వచ్చి హల్ చేస్తుండటంతో ఆ సమయంలో అటుగా ప్రయాణాలు చేసేవారు ప్రాణాలు అరచేత పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. సహజంగా నగరంలోని దుకాణాలు అన్నీ రాత్రి 10గంటలకల్లా మూతపడతాయి. అలాగే నగరంలో అధికారికంగా ఉన్న ఫుడ్‌కోర్టులు సైతం 11 గంటల కల్లా మూతబడతాయి. అలాంటిది రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్ద ఇంత బాహాటంగా వ్యాపారాలు జరుగుతుండటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాకుండా ఉంది. పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిత్యావసరాల పంపిణీ



కానూరు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పటమట లంక వాకర్స్

పశుగణన ప్రారంభం

వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 21వ పశుగణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పశుగణన సర్వేను పరిశీలించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకు కొనసాగే ఈ పశుగణనను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సెంట్రల్ తూర్పు ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ పశుగణనను ప్రారంభించారు.

బస్సుల సంఖ్యను పెంచాలి : ఈయూ

బస్టేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బస్సుల సంఖ్యను పెంచాలని ఆపరేషన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా శుక్రవారం ఆర్టీసీ హౌస్‌లో బాధ్యతలు స్వీకరించిన అంధవరపు అప్పలరాజును ప్రజారవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సత్కరించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళల ఉచిత రవాణా సౌకర్యం పథకం వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్నందున బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈడీ స్పందిస్తూ కొత్త బస్సులు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నాయకులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య, పి.సుబ్రహ్మణ్యం, ఎండి ప్రసాద్, జి.నారాయణరావు, నాయకులు పాల్గొన్నారు.



శ్రీచైతన్య ఒలింపియాడ్ విద్యార్థినీ విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు

నవంబరు 6న ఆన్‌లైన్ గణితశాస్త్ర పోటీలు

ఆటోనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నవంబరు 6న ఆన్‌లైన్‌లో గణిత శాస్త్ర సూత్రాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ జీఎం మద్దినేని మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం గాయత్రీ నగర్‌లోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మాక్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లగా తమ విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. ఈ ఏడాది నిర్వహించబోయే పోటీల్లోనూ సత్తా చాటుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీ వివరాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆర్.పద్మ, ప్రిన్సిపాల్స్ యు.రజిత, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందిపప్పు, పంచదార పంపిణీలో ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

● సర్కిల్-2 సహాయ పౌరసరఫరాల అధికారి శ్రీనివాసుల నాయుడు హెచ్చరిక

మొగల్రాజపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బియ్యంతో పాటు నవంబరు నుంచి ప్రతి కార్డుదారుడికి ఇస్తున్న కందిపప్పు, పంచదార అందాల్సిందేనని, పంపిణీలో తేడాలు వచ్చినా, ఫిర్యాదులు వచ్చినా డీలర్‌లను, ఎండీయూ ఆపరేటర్‌లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సర్కిల్-2 సహాయ పౌరసరఫరాల అధికారి శ్రీనివాసుల నాయుడు హెచ్చరించారు. నెలవారీ సమావేశంలో భాగంగా కార్యాలయంలో ఏరియాల వారీగా చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌లు, డీలర్‌లు, ఎండీయూ ఆపరేటర్‌లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీ నుంచి ప్రారంభం అయ్యే పంపిణీ సక్రమంగా జరగాలని, సమయపాలన పాటించాలని చెప్పారు. పౌరసరఫరాల మంత్రి, జేసీఈ, సబ్‌కలెక్టర్, డీఎస్‌వో పంపిణీ సమయంలో ఆకస్మిక తనిఖీలు చేస్తారని హెచ్చరించారు. కార్డుదారుల నుంచి కందిపప్పు, పంచదార అందలేని ఫిర్యాదులు రాకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సంఘం ప్రధాన సలహాదారులు మేడిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి పూర్ణ, జాయింట్ సెక్రటరీ సీతారామరాజు, కమిటీ సభ్యులు ఆంజనేయులు, ఖాసిం, పుల్లారావు, మల్లేష్, ఉదయ్ రవి, సర్కిల్ 2 డీలర్‌లు, ఎండీయూ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్, హెల్మెట్ వాడకంపై అవగాహన



మొగల్రాజపురంలోని చెన్నై అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం ట్రాఫిక్, హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీపీ కృష్ణమూర్తి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ రవికుమార్, ఎస్ఐ కుమార్ పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి సర్వీసు రోడ్డులో తొలగించని వ్యర్థాలు, చెట్ల కొమ్మలు నరికి వదిలేశారిలా..

చెట్టు కొమ్మలు నరికారు..వదిలేశారు

● ఇరుకుగా మారిన ప్రభుత్వాస్పత్రి సర్వీసు రోడ్డు
● భయాందోళనలో వాహనదారులు
● చెత్తను కూడా తరలించని వైనం

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ, మున్సిపల్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో సర్వజనాసుపత్రికి వచ్చే రోగులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విజయవాడ సర్వజనాసుపత్రి నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డుకు వేళ్లే సర్వీసు రోడ్డును సగానికి పైగా చెట్ల కొమ్మలతో, వ్యర్థాలతో నిండిపోతుంది. దీంతో ఆరోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు హడలి పోతున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో నిత్యం రద్దీగా ఉండే ఈరోడ్డులో పెరిగిన చెట్లను విద్యుత్ వైర్లకు అడ్డు వస్తున్నాయని విద్యుత్‌శాఖ అధికారులు చెట్ల కొమ్మలను కొట్టి పక్షం రోజులవుతున్నా వాటిని తొలగించకుండా వదిలేశారు.

అసలే ఇరుకు రోడ్డు పైగా ఎండిన చెట్ల కొమ్మలు ఎక్కడ గాలికి వచ్చి వాహనాల మీద పడతాయోనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇవి చాలవన్నట్లు చెత్తను కూడా మున్సిపల్ అధికారులు తొలగించడం లేదు. దీంతో సర్వీసు రోడ్డు దుర్గంధం భరితంగా ఉంటుందని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి సర్వీసు రోడ్డులో చెట్ల కొమ్మలను, వ్యర్థాలను తక్షణం తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పరిటాల చరిత్ర



పరిటాల రిపబ్లిక్ వజ్రోత్సవ విజయ స్థూపం

పరిటాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం వజ్ర, వైఢూర్యాలకు నిలయం ఈ గ్రామం. నైజాం ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. మరో ఏడు గ్రామాలకు తాలుకా కేంద్రం(కానాత్)గా ఉండేది. నైజాం ప్రభుత్వంపై సైనిక చర్య కన్నా ముందుగానే పరిటాల గ్రామస్థులు ప్రాణాలకు తెగించి తిరుగుబాటు బావుటా ఏగురవేశారు. పోలీస్ స్టేషన్‌తో పాటుగా ప్రభుత్వ కార్యాలయాలపై దాడిచేసి, స్వతంత్ర రాజ్యంగా ప్రకటించు కున్నారు. దాదాపుగా ఏడాది పాటు ప్రజలకు సుపరిపాలన అందించారు. ఆ తర్వాత పరిటాల రాజ్యం, ఇండి యన్ యూనియన్‌లో విలీనమైంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కోహి నూర్ వజ్రం పరిటాలలోనే దొరికిందని అంటారు. గుంటూరు జిల్లా కొల్లూరులో దొరికిందన్న వాదన కూడా ఉంది. వజ్రాలు పుష్కలంగా దొరుకుతుండటంతోనే నైజాం ప్రభువు, పరిటాలను బ్రిటీష్ పాలకులకు అప్పగించలేదన్నది చారిత్రక సత్యం. ఇప్పటికీ చెరువు ప్రాంతంలో ప్రజలు నిత్యం వజ్రాలకు కోసం వెదుకుతూనే ఉంటారు.

ప్రస్తుత పరిస్థితి

మండల కేంద్రమైన కంచికచర్లకు మూడు కిలోమీటర్ల దూరంలో, విజయవాడకు 32 కిలోమీటర్ల దూరంలో పరిటాల ఉంది. 65వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న ఈ గ్రామ జనాభా 15వేలకు పైగా ఉంటుంది. ఈ గ్రామ పరిధిలో ఆసియా ఖండంలోనే అతి ఎత్తైన 150 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. రెండు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ కొంత విస్తీర్ణం ఈ గ్రామ పరిధిలోనే ఉంది. మెటల్ క్వారీలు, క్రషర్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. నాణ్యమైన రోడ్డు మెటల్, కాంక్రీట్ కంకర పుష్కలంగా దొరుకుతుంది. ఇంతకు ముందు సోడాకు, నేడు రుచికరమైన 'టీ'కు గ్రామం ప్రసిద్ధి.



పరిటాలకు మహర్దశ

ఒకప్పుడు స్వతంత్ర దేశంగా భాసిల్లి చరిత్ర పుటలకెక్కిన పరిటాలకు అమరావతి రైల్వే లైనుతో మహర్దశ పట్టనుంది. రైలు, రోడ్డు, జల రవాణాకు ఉపయోగపడేలా భారీ కార్గో టెర్మినల్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పోర్టులకు అనుసంధానం చేస్తుండటంతో సమీప భవిష్యత్తులో ఈ కార్గో టెర్మినల్ మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందనుంది. దీంతో కొన్నేళ్లలోనే పరిటాల రూపురేఖలు మారనున్నాయి.

- అమరావతి రైల్వే లైనుతో మారనున్న రూపురేఖలు
- భారీ కార్గో టెర్మినల్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం
- రోడ్డు, జల, రైలు రవాణాకు కీలకంగా టెర్మినల్
- కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులకు.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా నగరాలకు అనుసంధానం
- లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆశాభావం

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

గుంటూరు జిల్లా నంబూరు నుంచి అమరావతి మీదుగా ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వరకు 57 కిలోమీటర్ల రైల్వేలైను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.2,245 కోట్ల నిధులు కేటాయించింది. కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల మండలం కొత్తపేట, పరిటాల, గొట్టుముక్కల, నరసింహారావుపాలెం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, అల్లూరు, పెద్దాపురం, గూడెం మాధవరం గ్రామాల మీదుగా ఈ రైల్వే లైను వెళుతుంది. తక్షణమే పనులు ప్రారంభించేందుకు నవంబరు లేదా డిసెంబరులో ప్రధాని నరేంద్రమోదీతో శంకుస్థాపన చేయించేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. అమరావతి రైల్వేలైను ఏర్పాటులో భాగంగా పరిటాల వద్ద భారీ కార్గోటెర్మినల్ ఏర్పాటు కానుంది. టెర్మినల్ ఏర్పాటుపై రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ గురువారం ప్రస్తావించారు. 65వ నెంబరు జాతీయ రహదారి పక్కన టెర్మినల్ ఏర్పాటవనుంది. రోడ్డు, జల, రైల్వే రవాణాకు కార్గో టెర్మినల్ కీలకం కానుంది. కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులకు, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా నగరాలకు అనుసంధానం చేయనున్నారు. దీంతో పరిటాల లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, అమరావతికి ప్రధాన ఆదాయవనరుగా మారు తుందని మంత్రి వైష్ణవ్ ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలన్న పట్టుదలతో చంద్రబాబు ఉన్నారు.

భూసేకరణే మార్గం

ప్రతిపాదిత కార్గో టెర్మినల్‌కు ఎంత భూమి కావాలో అన్నదానిపై సరైన సమాచారం లేదు. లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేస్తున్నందున రెండు వందల ఎకరాలకు పైగా భూమి కావల్సి ఉంటుందని అంటున్నారు. భూసేకరణ తప్పితే ప్రభుత్వ భూమి అందుబాటులో లేదు. టెర్మినల్ ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియదు. అధికారులు అనుకూలమైన ప్రాంతంగా ఎక్కడ గుర్తించారో బయటకు వెల్లడి కావటం లేదు. రైల్వే లైనుకు మాత్రం గ్రామ పరిధిలో 70.79 ఎకరాలు కావాలని అధికారులు నిర్ధారించారు. ఇప్పటికే సర్వే చేసిన అధికారులు సర్వే నెంబర్ల వారీగా భూమిని గుర్తించారు. సర్వే ప్రకారం ఆంజనేయస్వామి విగ్రహం వెనుక భాగం వాగు పక్కగా, న్యూకాన్ బ్రిక్స్ కంపెనీ, చెరువు కళింగకు తూర్పువైపుగా రైల్వే లైను రానుంది. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌కు కిలోమీటరు దూరంలో లైను వెళుతుంది.

టెర్మినల్‌పై చర్చ

కార్గో టెర్మినల్ ఏర్పాటు చేస్తున్నట్టుగా కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రకటించగానే గ్రామస్థుల్లో చర్చ మొదలైంది. ఎంతో విలువైన భూములకు సరైన ధర ఇస్తారో, లేదోనన్న మీమాంసలో పలువురు రైతులు ఉన్నారు. ఎక్కువ మంది టెర్మినల్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంలో పేర్కొన్నట్టుగా ఇక పరిటాల 14 ఆమడల పట్టణంగా అభివృద్ధి చెందటానికి అవకాశమేర్పడిందని గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకుడు మాగంటి నరసింహారావు(బాబు), సొసైటీ మాజీ చైర్మన్ నెమలపురి అమ్మారావు(గాంధీ) పేర్కొన్నారు.

రైల్వే లైన్‌కు ఆమోదం శుభపరిణామం: ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'అమరావతి రైల్వే లైన్‌ను ఆమోదించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. రూ.2,245 కోట్లతో 57 కిలోమీటర్ల రైల్వేలైన్‌కు ఆమోదంతో రాష్ట్రానికి భారీ ప్రోత్సాహం ఇచ్చినట్టే. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15,000 కోట్లు ప్రకటించటం, ఇప్పుడు రైల్వేలైన్‌కు పచ్చజెండా ఊపడం శుభ పరిణామం.' అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతితో పాటు వెనుకబడిన ప్రాంతాలైన మైలవరం, నందిగామ కలిసేలా ఈ రైల్వే లైన్ ఉండటం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని చిన్ని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి విధ్వంసంతో పాటు రైల్వే లైన్‌ను ఐదేళ్లు పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు కృషివల్లే ప్రాజెక్టుకు ఆమోదం లభించిందన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హడ్కో బృందం



హడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్ఠ, మంత్రి నారాయణకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణతో కలిసి హడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్ఠ, డీసీపీ ఎం.నాగరాజు, ప్రాంతీయ ముఖ్య అధికారి బీఎస్‌ఏ మూర్తి, శుక్రవారం దర్శించుకున్నారు. ఈవో రామరావు, అధికారులు, అర్చక బృందం స్వాగతం పలికారు.

30న మహాలక్ష్మీయాగం

దుర్గగుడిలో వైదిక కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన మహాలక్ష్మీ యాగం చేయనున్నట్లు ఈవో రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన యాగశాలలో రుద్రహోమం అనంతరం ఉదయం 8 గంటలకు మహాలక్ష్మీయాగం ప్రారంభమవుతుందని తెలిపారు. యాగంలో పాల్గొనే దంపతులు రూ.1000 రుసుము చెల్లించాల్సి ఉంటుందని, యాగం అనంతరం శేషవస్త్రం, రవిక, పూర్ణం, గారె, చిన్నలడ్డూ ప్రసాదంగా అందిస్తామని పేర్కొన్నారు.

నేడు ఏపీ జీఎన్‌ఏ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నికలు

వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఆఫీస్ బేరర్ల ఎన్నిక శనివారం పారదర్శకంగా నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారి, ఏపీ జీఎన్‌ఏ ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని రాఘవయ్యపార్క్ సమీపంలోని కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్‌లో శనివారం ఉదయం 7గంటలకు ఎన్నికల కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఎన్నికలు అధికారి జారీ చేసిన ఒరిజినల్ డిక్లరేషన్ ఫాం, ఫొటో గుర్తింపు కార్డు తీసుకుని జిల్లా యూనిట్ల ఆఫీస్ బేరర్లు రావాలని సూచించారు.

ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం వెంకటేశ్వర్లు బదిలీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పౌరసరఫరాల సంస్థ ఎన్టీఆర్ జిల్లా మేనేజర్ (డీఎం) జి.వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయనను పౌరసరఫరాల సంస్థ రిలీవ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. మునిసిపల్ పట్టణాభివృద్ధి సంస్థ మంత్రి పి.నారాయణ దగ్గర పనిచేసేందుకు ఆయనను రిలీవ్ చేశారు. కిందటి ప్రభుత్వంలో ఎన్నికలకు కొంతకాలం ముందు ఆయన విజయవాడ డీఎంగా వచ్చారు.

రూ.5.50 కోట్ల విదేశీ సిగరెట్ల దహనం

విజయవాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణా చేస్తూ, సుంకం చెల్లించకుండా వేర్వేరు కేసుల్లో సీజ్ చేసిన రూ.5.50కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను కస్టమ్స్ అధికారులు శుక్రవారం దహనం చేశారు. గుంటూరు, విశాఖపట్నంలో ఉన్న జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ల్లో ఈ సిగరెట్లను కాల్చి బూడిదచేశారు. కాకినాడ, విజయవాడ, నెల్లూరు, తిరుపతిలో పట్టుకున్న 82,71,836 విదేశీ సిగరెట్ స్టిక్‌లను స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా దహనం చేశారు. గుంటూరు జిందాల్ ప్లాంట్‌లో 73.71 లక్షలు, విశాఖ జిందాల్ ప్లాంట్‌లో 9 లక్షల సిగరెట్ల స్టిక్‌లను కాల్చి బూడిద చేశారు. పారిస్, డరమ్ బ్లాక్ వంటి వివిధ చౌకబారు బ్రాండ్ సిగరెట్లను బూడిద చేశారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం



మాట్లాడుతున్న చప్పిడి కృష్ణమోహన్

ధర్నాచౌక్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే టీడీపీ, సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ తెలిపారు. ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే టీడీపీ సభ్యత్వ నమోదులో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 లక్షల మంది ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని గతంలో మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గారావు, విజయవాడ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా ముదిరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బోనం కేశవ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలకం రాజారావు, వేమారెడ్డి వీరబాబు, పిట్టు వెంకటరామయ్య జంద్యాల సుబ్బారావు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లు, డీజిల్ ఇంజన్లకు నష్ట పరిహారం చెల్లించాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

ధర్నాచౌక్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కృష్ణానది, బుడమేరు వరదల్లో పాడైపోయిన వ్యవసాయ విద్యుత్ మోటార్లు, డీజిల్ ఇంజన్లకు ఎన్యూమరేషన్ చేసి తక్షణమే పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు డిమాండ్ చేశారు. ధర్నాచౌక్‌లో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వరదల కారణంగా పూర్తిగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించిన అరకొరసాయం ఊరట కలిగించలేదన్నారు. ప్రభుత్వం పంటలకు ఇచ్చిన నష్ట పరిహారం సరిపోదని ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. రైతు నేతలు వి.కృష్ణయ్య, పంచకర్ల రంగారావు, టీవీ లక్ష్మణస్వామి, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]







నేలమట్టమైన బెల్టుషాపులు



లెనిన్ సెంటర్ ప్రక్షాళన

ఆక్రమణలు తొలగించిన వీఎంసీ

విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం ఎదురుగా ఉన్న బడ్డీలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

తెల్లవారుజామున క్రేన్‌తో బడ్డీలను ట్రాక్టర్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

లెనిన్ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాక..

గవర్నర్‌పేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దర్జాగా అద్దెలకు ఇస్తూ లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్న ఆక్రమణదారులు, వారిని ప్రోత్సహించే చోటా నేతలు, ప్రజాప్రతినిధుల ఆగడాలకు మున్సిపల్ కార్పొరేషన్ చెక్ పెట్టింది. నగరానికి గుండెకాయ లాంటి లెనిన్ సెంటర్ మొత్తాన్ని కబ్జా చేసి వాహనదారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న హాకర్ల ముసుగులో ఉన్న ఆక్రమణదారుల ఆగడాలకు బుల్డోజర్లతో ఫుల్‌స్టాప్ పెట్టింది. లెనిన్ సెంటర్‌లో ఆక్రమణలపై ఈనెల 21న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పేదల పేరుతో చోటా నేతలు కార్పొరేషన్ రోడ్లు ఆక్ర మించి, వేలాది రూపాయల గుడ్‌విల్ తీసు కుంటూ, రోజువారీ అద్దెలకు ఇస్తున్నారని వెలుగు లోకి తేవడంతో కార్పొరేషన్ అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి, లెనిన్ సెంటర్ ప్రక్షాళన చేపట్టారు. వాహనాలు కూడా తిరగడానికి వీలు లేని విధంగా లెనిన్ సెంటర్‌ను కబ్జా చేసి, బడ్డీలు ఏర్పాటు చేయించి, లక్షలాది రూపాయలు సంపాదిస్తున్న ఆక్రమణదారుల భరతం పట్టారు. లెనిన్ సెంటర్ చుట్టూ రోడ్డును కమ్మేసిన బండ్లను పూర్తిగా తొలగించారు. నగర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెల్లవారుజామున 4 గంటలకు ట్రాక్టర్లు, బుల్డోజర్లు, జేసీబీలు, ఫైర్ ఇంజన్లతో పాటు భారీ సంఖ్యలో మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది లెనిన్ సెంటర్‌కు చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ సంఖ్యలో పోలీసులను రంగం లోకి దించారు. లెనిన్ పార్కు, విగ్రహానికి నాలుగువైపులా ఆక్రమణలకు గురైన కార్పొరేషన్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి విముక్తి చేశారు. విశ్వనాథ సత్యనారాయణ విగ్రహ ప్రాంతం, విజయమిల్క్ పార్లర్, డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ భవనానికి వెళ్లే అరండల్‌పేట అన్నదాన సమాజం రోడ్డుపై ఉన్న బడ్డీలు పూర్తిగా తొలగించారు. ఆక్రమణల తొలగింపు ఆపరేషన్ తెల్లవారుజామున కావడంతో సిబ్బందికి తొలగింపు పని మరింత సులువుగా మారింది. వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టిప్పర్ దగ్ధం..డ్రైవర్ సురక్షితం





సితార సెంటర్‌లో దగ్ధమవుతున్న టిప్పర్, ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్ కోన రామాంజనేయులు

విద్యాధరపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సితార సెంటర్ వద్ద గ్రానైట్ లోడు టిప్పర్ దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఆటోనగర్‌కు చెందిన బుల్లిబాబుకు టిప్పర్లు ఉన్నాయి. ఇతని వద్ద కృష్ణాజిల్లా గూడూరు మండలం మల్లవోలుకు చెందిన కోన రామాంజనేయులు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కొండపల్లి నుంచి టిప్పర్‌లో గ్రానైట్‌ను నింపుకొని మచిలీపట్నం పోర్టుకు బయలుదేరాడు. సితార్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ చాకచక్యంగా రోడ్డుపక్కన టిప్పర్ నిలుపుదల చేసి కిందకు దూకేశాడు. ఇంజన్‌లో నుంచి మంటలు పెద్దఎత్తున రావటంతో స్థానికులు, పాదచారులు పరుగులు పెట్టారు. కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే సమయానికే క్యాబిన్ మొత్తం కాలిపోయింది. ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ జరగడంతోనే మంటలు వచ్చాయని అగ్నిమాపక సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వచ్చేనెల 20న కృష్ణాలో సాగునీటి సంఘాల ఎన్నికలు

- పారదర్శకంగా నిర్వహించాలి
- అన్ని ఏర్పాట్లు చేయండి.. అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణా జిల్లాలో నవంబరు 20వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తాం. ఏకగ్రీవం, చేతు లెత్తి ఎన్నుకోవడం, బ్యాలెట్ ఓటింగ్ పద్ధతిలో ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలి. పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయండి.' అని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికా రులకు జిల్లా పరిషత్ సమావేశపుహాలులో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాగునీటిసంఘాలకు ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలను తయారు చేయాలని ఆయన ఆదేశిం చారు. పద్దెనిమిదేళ్లు నిండి పట్టాదార్ పాస్‌పుస్తకం ఉన్న రైతులను గుర్తించి, వారికి ఓటుహక్కును కల్పించాలని సూచించారు. రెండు ప్రాదేశిక నియోజకవర్గాలలో ఓటుకు అర్హులైతే ఒకప్రాంతంలోనే ఓటు ఉండేలా రైతుల నుంచి అంగీకారం తీసుకోవాలని సూచించారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై నీటిపారుదల శాఖ ఈఈ కొడాలి బాబు, ఓటర్ల జాబితా తయారీపై డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఎన్నికల అధికారిగా, జేసీ అదనపు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు డిప్యూటీ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, డ్రెయినేజీ విభాగం ఈఈ గోపీనాథ్, తహసీల్దార్లు, నీటిపారుదలశాఖ ఇంజనీర్లు శిక్షణలో పాల్గొన్నారు.

స్పోర్ట్సుకోటా ఎంబీబీఎస్ సీట్లు రాష్ట్ర క్రీడాకారులకే ఇవ్వాలి

- శాప్ చైర్మన్ రవినాయుడుకు కేపీ రావు వినతి

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని వైద్యకళాశాలల్లో ఇటీవల ఒడిసా, తెలంగాణ క్రీడాకారులు స్పోర్ట్సు కోటా కింద సీట్లు పొందారు. స్పోర్ట్సు కోటా సీట్లు ఏపీలోని క్రీడాకారులు పొందేలా శాప్ ద్వారా ప్రభుత్వానికి నివేదించండి.' అని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు కోరారు. శుక్రవారం రవినాయుడును కలిసి ఆయన వినతిపత్రం అందించారు. జీవోలు 10, 11 అమలు సక్రమంగా లేకపోవడం వలన రాష్ట్ర క్రీడాకారులు నష్టపోతున్నారని, ముగ్గురు ఇతర రాష్ట్రాల క్రీడాకారులు సీట్లు పొందారని ఆయనకు వివరించారు. దీనిపై క్రీడాకారులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు.

సింగిల్స్ విజేతలుగా ఈశ్వర్‌సాయి, సుధాకర్‌రెడ్డి

- ముగిసిన ఆలిండియా ర్యాంకింగ్ టెన్నిస్

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్(బెజవాడ కృష్టారెడ్డి) టెన్నిస్ టోర్నీలో 35ప్లస్ సింగిల్స్ ఫైనల్స్‌లో ఈశ్వర్‌సాయి, 55 ప్లస్ సింగిల్స్‌లో సుధాకర్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. రన్నరప్‌గా అశ్వినీకుమార్, ఆర్‌ఎస్ రావత్ నిలిచారు. శుక్రవారం హోరాహోరీ ఫైనల్స్‌లో 45 ప్లస్ సింగిల్స్ ఫైనల్స్‌లో వహీద్ కేవీఎస్ మూర్తి టైటిల్‌ను వశం చేసుకున్నారు. 35 ప్లస్ డబుల్స్‌లో ఈశ్వర్‌సాయి, జానకిరామరాజు జోడీ బి.మహేశ్వరరావు, ఆర్.రాంబాబుపై ఫైనల్స్‌లో విజయం సాధించి టైటిల్‌ను సాధించారు. 45 ప్లస్ డబుల్స్‌లో కేవీఎస్ మూర్తి, వహీద్‌ల జంట ఎంఎస్ కిరణ్, మణికన్నన్ జోడిపై విజయం సాధించారు. 55 ప్లస్ డబుల్స్‌లో రాజ్‌కుమార్ సింగ్, ఎ.శ్రీనివాస్ ద్వయం కేశవప్రసాద్, ఆర్‌ఎస్ రావత్‌పైన, 65 ప్లస్ డబుల్స్‌లో శ్రీనివాసరెడ్డి, సంతశీరాజులు మన్మథరావు, ధనుంజయులు విజయం సాధించి టైటిళ్లను వశం చేసుకున్నారు. విజేతలకు విజయవాడ ఐస్టా చైర్మన్ డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, జడ్జి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రాధాకృష్ణమూర్తి, టోర్నీ డైరెక్టర్ మల్లికార్జునరావు రూ.4లక్షల నగదు బహుమతులు, ట్రోఫీలు అందించారు.

నెక్సస్ గ్రోత్‌లో సీఐడీ సోదాలు

- 'పేట' ఐసీఐసీఐలో కాజేసిన సొమ్ము.. పెట్టుబడిగా పెట్టిన నరేశ్



విజయవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలో ఉన్న నెక్సస్ గ్రోత్ కార్యాలయంలో సీఐడీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాదారుల సొమ్ములను కాజేసిన మేనేజర్ నరేశ్ ఇందులో పెట్టుబడులు పెట్టినట్టు తేలడంతో తనిఖీలు చేశారు. నరేశ్ రూ.కోట్లు ఖాతాదారుల సొమ్ము తన సొంతానికి ఉపయోగించుకున్న విషయం తెలిసిందే. ఆయన ఇచ్చిన సమాచారంతోనే సీఐడీ అధికారులు సోదాలకు దిగారు. నెక్సస్ గ్రోత్ కార్యాలయాన్ని ప్రారంభించిన వ్యక్తి పరారీలో ఉన్న ట్టు తెలిసింది. ఈ కార్యాలయ వ్యవహారాలను మొత్తం ముగ్గురు నిర్వహించినట్టు సమాచారం. ఈ కార్యాలయాన్ని ఎవరు ప్రారంభించారు? ఎలా ప్రారంభించారు? ఎవరెవరు పెట్టుబడులు పెట్టారు? అన్న వివరాలను పోలీసులు సేకరించారు.

సమన్వయంతో ముందుకెళ్లండి!

» గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో గెలవాలి

» టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జనసేన, బీజేపీలతో సమన్వయంతో ముందుకెళ్లాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సూచించారు. శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి-పశ్చిమగోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పట్టభద్రుల ఓట్ల నమోదుకు వచ్చేనెల 6 ఆఖరు తేదీ అని, ఆలోగా ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు పార్టీల నేతలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, మండలాల వారీగా కమిటీలతో ముందుకెళ్లాలన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో మంచి మెజారిటీతో కూటమి అభ్యర్థులు గెలిచేలా నేతలు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మూడు పార్టీలు కలిసి పనిచేయడం వల్లే ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో 93 శాతం ఓట్లు సాధించామని చంద్రబాబు గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నామని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాగా, ప్రతి పట్టభద్రుడూ ఓటు నమోదు చేసుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని 'జాబ్ ఫస్ట్' విధానంతో ఉద్యోగ కల్పనకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు ముందుకేస్తున్నామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలంతా గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 'మనం పనిచేయాల్సింది ఇప్పటి కోసమే కాదు, 2029లోనూ మళ్లీ ఎన్డీయే గెలుపే లక్ష్యంగా పనిచేయాలి' అని పేర్కొన్నారు.

రాజధానిలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్

» 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు

» చంద్రబాబుతో హడ్కో చైర్మన్ చర్చలు

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతిలో 10 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు హడ్కో ఆసక్తితో ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. హడ్కో చైర్మన్, ఎండీ సంజయ్ కులశ్రేష్ఠ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం ముఖ్యమంత్రితో సమావేశమైంది. అమరావతి అభివృద్ధిపై వారు చర్చించారు. ప్రధానంగా అమరావతిలో రాజధాని నిర్మాణానికి రూ.11 వేల కోట్ల ఆర్థిక సహాయ ప్యాకేజీపై చర్చలు సాగినట్లు చంద్రబాబు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.



సీఎంను కలిసిన ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి ఏఆర్ అనురాధ శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఉద్యోగ నోటిఫికేషన్లపై చర్చించినట్టు తెలిసింది.



తప్పు చేసిన వాళ్లను వదిలేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అరెస్టు అన్నారు. ఏ విషయంలో చేస్తున్నారో చెప్పాలని అడిగాను. చెప్పకుండా అరెస్టు అంటున్నారని అంటే.. వారు వారెంట్ ఇస్తున్నాం.. ఆ తర్వాత నోటీసు ఇస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎక్కడా ఇలా జరగలేదు. జరుగుతుందని కూడా ఊహించలేం. ప్రజాసామ్యంలో ఏ చిన్నవాడు తప్పు చేసినా.. ఎక్కడ చేశాడో చెప్పి అతడి దగ్గర సమాధానం తీసుకుని.. అందులోని విషయాలు పరిశీలించిన తర్వాత.. తీవ్రమైన విషయం అనుకుంటే అప్పుడు అరెస్టు చేస్తారు. కానీ దీనిని లెక్కపెట్టకుండా అరెస్టు చేశారు. నా జీవితంలో ఏ పనిచేసినా చట్ట ధిక్కరణ చేయలేదు. ఒకటికి నాలుగుసార్లు ఆలోచించి చేశాను. రాజ్యాంగం ప్రకారం ఏం చేయాలో దానికి కట్టుబడి చేశాను. ఇలాంటివన్నీ చేసిన తర్వాత ఆ రోజు జరిగిన సంఘటన ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను. అది రాష్ట్రంలో ఉన్న ఆనాటి పరిస్థితి. ఆ రోజు అక్కడ నుంచి నేరుగా తీసుకెళ్లడం, తర్వాత పరిణామాలు రాష్ట్ర ప్రజలందరూ చూశారు. నేను ఎప్పుడూ ఒక్కటే ఆలోచిస్తాను. ఎప్పుడూ తప్పు చేయలేదు. నిప్పులాగా బతికాను. ప్రజలు నన్ను సపోర్ట్ చేస్తారన్న విశ్వాసం ఉంది. అదే నన్ను గెలిపించింది. అదే నిలబెట్టింది.

బాలకృష్ణ: గీత దాటని మనిషి మీరు. మరి మీ కోసం ప్రజలు గీత దాటారు. మిమ్మల్ని మళ్లీ మనస్సులో నిలుపుకొన్నారు. మీకు ఎలా అనిపించింది?

చంద్రబాబు: అరెస్టు చేస్తారనో, ప్రాణం పోతుందనో భయపడితే అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేం. నా జీవితంలో ఎప్పుడూ రాజకీయ కక్షలతో ముందుకెళ్లలేదు. ముందు నేను రూలింగ్‌లో ఉన్నాను. రాజశేఖర్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండేవారు. ఆయన కొన్నిసార్లు రెచ్చిపోయినా సంయమనం పాటించాను. రాజశేఖర్‌రెడ్డి కొన్ని విషయాల్లో దూకుడుగా మాట్లాడారు. ఎదుర్కొని వార్నింగ్ ఇచ్చాను. మళ్లీ తగ్గి క్షమాపణలు చెప్పిన సందర్భాలున్నాయి. కానీ మొట్టమొదటసారిగా ఆంధ్రప్రదేశ్‌లో కక్షపూరిత రాజకీయాలు వచ్చిన పరిస్థితి. ఆ కక్ష రాజకీయాలు వ్యక్తిగత ద్వేషాలయ్యాయి. నేను మాత్రం లక్ష్మణ రేఖ దాటను. తప్పు చేసిన వాడిని వదిలిపెట్టను. తప్పులు చేయకపోతే మాత్రం వారి జోలికి పోను. జైల్లో ఉన్నప్పుడు ఒకటే ఆలోచించాను. బయటకొచ్చి నా కోసం పోరాడిన ప్రజల కోసం శేష జీవితం అంకితం చేయాలని, ముందుకెళ్లాలని ఆత్రపడ్డాను.

బాలకృష్ణ: 53 రోజుల చీకటి జైలు జీవితం.. మొదటి రాత్రి జైలులో ఎలా గడిచింది?

చంద్రబాబు: నంద్యాల నుంచి ప్రకాశం జిల్లా ద్వారా అడవులు దాటుకుంటూ అమరావతికి తీసుకురావడం, రాత్రంతా ఇన్వెస్టిగేషన్ పేరుతో తిప్పి తెల్లవారాక మెడికల్ టెస్ట్‌కు పంపించారు. అక్కడ నుంచి మళ్లీ అక్కడా ఇక్కడా తిప్పితిప్పి కోర్టుకు తీసుకురావడం, వాదనల నెపంతో సాయంత్రం దాకా ఉంచి అర్ధరాత్రి రాజమండ్రి జైలుకు పంపారు. ఆ రాత్రి చేయని తప్పునకు శిక్ష అనుభవించడం కాకుండా.. అది జరిగిన విధానం ఆలోచించినప్పుడు గుండె తరుక్కుపోయింది. వెనకాల బాధ్యత గుర్తు చేస్తోంది. నేను స్థైర్యం కోల్పోతే ఇక ఏమీ ఉండదు. ధైర్యంగా ఎదుర్కొన్నాను కాబట్టి నా జోలికి రాలేకపోయారు గానీ లేకపోతే ఏమయ్యేదో! ఒక్కటే ఆలోచించాను. చనిపోతే ఒక్క క్షణం. అనుకున్న ఆశయాల కోసం పనిచేస్తే అదే శాశ్వతం. అదే నన్ను ముందుకు నడిపించింది.

బాలకృష్ణ: రాజకీయానికి దూరంగా ఉండే మా చెల్లాయి, మా అమ్మాయిలు రాష్ట్రమంతా ప్రచారానికి బయటకు వచ్చారు. ప్రతి మహిళా వారి వెన్నంటి నిలిచారు. తమ బిడ్డలుగా దగ్గర చేర్చుకున్నారు.

చంద్రబాబు: అప్పుడున్న పరిస్థితుల్లో వాళ్లు తీసుకున్న నిర్ణయం. 'నిజం గెలవాలి' కార్యక్రమంతో పాటు ప్రజాచైతన్యంలో ముందుకెళ్లాలి, ప్రజలకు వాస్తవాలు తెలియాలి.. వారందరినీ సంఘటితపరిచేలా ఆలోచించారు. నేను వచ్చే వరకు అకుంఠిత దీక్షతో రోడ్లపై పోరాడారు. ఎప్పుడూ రాజకీయాల్లోకి రానటువంటి భువనేశ్వరి.. వాళ్ల నాన్న సీఎంగా ఉన్నా, నేను సీఎంగా ఉన్నా ఎప్పుడూ బయటకు రాలేదు. మొదటిసారిగా ఇది జరిగిన తర్వాత నిలదొక్కుకుని రాత్రింబవళ్లూ పోరాడారు.

బాలకృష్ణ: ఆకాశంలో సూర్యచంద్రులు.. ఆంధ్రాలో బాబు, కల్యాణ్‌బాబు అంటున్నారు.. చిన్న సందేహం. మీరు కలవబోతున్నారని ఊహించారా?

చంద్రబాబు: ఆయన ఒకసారి విశాఖపట్నం వెళ్లారు. హోటల్‌కు వెళ్తే హోటల్‌లో ఉండడానికి వీల్లేదని నగర బహిష్కరణ చేశారు. ఆయన విజయవాడ వచ్చారు. నన్ను ఎవరూ పిలువలేదు. నేనే వెళ్లి సంఘీభావం ప్రకటించాను. ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పి వచ్చాను. ఆ తర్వాత ఇది జరిగింది. నా అరెస్టు జరిగిన తర్వాత పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో ఉంటే.. రాకుండా ఫ్లైట్ కేన్సిల్ చేయించారు. రోడ్డు మార్గానవస్తే నందిగామ వద్ద ఆపేశారు. రోడ్డు మీద పడుకుని ధర్నా చేశారు. తర్వాత నేను జైల్లో ఉన్నప్పుడు మీరు, లోకేశ్, కల్యాణ్ వచ్చారు.

బాలకృష్ణ: తెలుగు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసిన మీటింగ్ అది. లోపల అసలేం జరిగింది?

చంద్రబాబు: ధైర్యంగా ఉన్నారా సార్ అని పవన్ కల్యాణ్ నన్నడిగారు. ఎప్పుడూ అధైర్యంగా ఉండను.. మీరు కూడా ధైర్యంగా ఉండండని నేను చెప్పినప్పుడు.. రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు చూసిన తర్వాత ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చకుండా ప్రయత్నాలు చేస్తానని పదే పదే ఆయన చెప్పారు. అందరం కలిసి పోటీ చేద్దామని చూచాయగా అన్నాను. ఆయన కూడా ఆలోచించుకుని ఓకే సార్ అన్నారు. బీజేపీకి కూడా గట్టిగా నచ్చజెప్పి అలయెన్స్‌గా తీసుకొస్తామని చెప్పారు. బయటకు వెళ్లి మీరు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టారు.

లోకేశ్ పాదయాత్ర ఎవరి నిర్ణయం?

చంద్రబాబు: తన నిర్ణయమే. తండ్రిగా కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పాను. ఆ సమయంలో పాదయాత్రకు వెళ్లడం కరెక్ట్ కాదని.. విద్వేషకరమైన ప్రభుత్వం ఉన్నప్పుడు అంత సుజావుగా సాగదని, ఇబ్బందులు కలిగించడమే కాకుండా దేనికైనా తెగిస్తారని చెప్పాను. లోకేశ్.. నేను వెళ్లాలి.. కవిఎట్ అయ్యానన్నాడు. నందమూరి తారకరామారావు మనవడిగానో, చంద్రబాబు కొడుకు గానో, బాలకృష్ణ అల్లుడు గానో కాకుండా నాకంటూ ఒక ప్రత్యేకత కావాలని.. నిరూపించుకుంటానని వెళ్లాడు.. నిరూపించుకున్నాడు.

బాలకృష్ణ: హెలికాప్టర్ ఎక్కి జనాలను చూసే నాయకులున్న రోజుల్లో బెజవాడలో మోకాటి లోతు వరద నీటిలో దిగి దగ్గరుండి ప్రజలను చూసుకున్నారు..

చంద్రబాబు: పది రోజులు భయంకరమైన పరిస్థితి. పాములున్నాయి. డ్రెయిన్, రెయిన్ వాటర్ రెండూ కలిసి పోయాయి. దిగాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. కష్టాలున్నప్పుడు మీనమేషాలు లెక్కేస్తే కాదని బోటెక్కాను. ఎస్‌డీఆర్ఎఫ్ వాళ్లు మీరు పోవడానికి వీల్లేదు.. నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది.. కొట్టుకుపోయే పరిస్థితి ఉందని చెప్పారు. ఎలాగైనా లోపలకు వెళ్లాలని చెప్పాను.. వెళ్లాను, చూశాను. చాలా ప్రమాదముందని అక్కడ నుంచి కదలకూడదని ఉద్దేశంతో అక్కడి నుంచి నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లి బస్సులోనే పది రోజులు బసచేశాను. నేను నడిచాను. ఆఫీసర్లను నడిపించాను. ప్రజలకు అండగా ఉన్నాను. అందరి కళ్ల ముందు నీళ్లున్నాయి. కానీ తాగడానికి లేవు. ఒక తండ్రి రోడ్డుమీదకు వచ్చి.. మూడు రోజుల నుంచి నా కొడుకు నీళ్లు అడుగుతున్నాడు.. ఇవ్వలేకపోతున్నాను. రెండు బాటిల్స్ నీళ్లు ఇవ్వాలని అడిగినప్పుడు బాధ, ఆవేదన కలిగాయి. అన్నీ ఉండి వారికి సహాయం చేయలేకపోయానన్న నిస్సహాయత.. అదే నన్ను ముందుకు నడిపించింది. డ్రోన్లు ఉపయోగించాం. ఎన్ని మార్గాలుంటే అన్ని మార్గాలూ ఉపయోగించాం. ప్రజలను కాపాడుకున్నాం. నా జీవితంలో చేయనటువంటి శ్రమ చేశాను. పది రోజుల్లోనే సాధారణ పరిస్థితికి తెచ్చామంటే ఇది టీడీపీ, ఎన్డీయే చేసిన కృషి.

ప్రేక్షకుడు: తిరుమలేశుడు కలియుగదైవం. అక్కడ అపవిత్ర, కల్తీ జరిగిందని మీరన్నారు. అసలు వివాదం ఎక్కడ మొదలైంది?

చంద్రబాబు: నేను హిందువును. అదే సమయంలో క్రిస్టియన్ చర్చిలు, ముస్లింల మసీదులు కాపాడుకోవలసిన బాధ్యత మనకుంది. అందరి నమ్మకాన్ని మనం గౌరవించాలి. దీని గురించి ఎక్కువగా మాట్లాడను. సిట్ ద్వారా వాస్తవాలు బయటకు వస్తాయి. వాస్తవాలు వచ్చినప్పుడు ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకుంటుంది.

బాలకృష్ణ: పవన్ కల్యాణ్ సనాతన ధర్మం కోసం దీక్ష మొదలుపెట్టారు. ఇప్పుడు మీ ఉద్దేశం ఏంటి?

చంద్రబాబు: ఎవరి నమ్మకాలు వారికి ఉంటాయి. ఒక ముఖ్యమంత్రిగా అందరి నమ్మకాలను కాపాడే బాధ్యత నాపై ఉంటుంది. ఎక్కడా ఎలాంటి అపచారం జరగకుండా ఎవ్వరి మనోభావాలు దెబ్బతీయకుండా పరిపాలన సాగించడం నా బాధ్యత.

అమరావతి నగరం మీ కల. సైబరాబాద్ నిర్మాణం మీ ఘనత. అది ఎంత నిజమో.. ఇప్పుడు అమరావతి నిర్మాణం కల ఎప్పటికి.. ఎలా సాకారం అవుతుంది?

చంద్రబాబు: కొన్ని చరిత్రలో నిలిచిపోతాయి. హైదరాబాద్ నగరాన్ని నిజాం, సికింద్రాబాద్ నగరాన్ని బ్రిటిష్‌వాళ్లు అభివృద్ధి చేస్తే.. సైబరాబాద్‌ను నేను అభివృద్ధి చేశాను. ఆర్థిక హబ్‌గా తయారుచేసేందుకు అవకాశం వచ్చింది.. చేశాను. ఈ రోజు హైదరాబాద్ మహానగరంగా దేశానికే నెంబర్‌వన్ సిటీగా తయారయ్యే పరిస్థితి ఉంది. ఈ ఫలాలు ప్రజలు అనుభవిస్తున్నారు. గత పాలకులెవరూ నాశనం చేయలేదు. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇప్పటికీ కూడా దేశానికి కొన్ని నగరాలు కావాలి. చండీగఢ్ వచ్చిన తర్వాత ఏ నగరమూ రాలేదు. నేను కేంద్రం సహకారంతో ప్రధానమంత్రి శంకుస్థాపన చేసిన నగరాన్ని ప్రపంచంలో అద్భుతమైన సిటీల్లో ఐదు నగరాల్లో ఒక నగరంగా చేయాలని శ్రీకారం చుట్టాను.

కుటుంబ వ్యవస్థకు జగన్ తిలోదకాలు: వర్ల



అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తల్లి, చెల్లిని రోడ్డున పడేసిన అనైతిక చరిత్ర జగన్‌దని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ధన దాహంతో కుటుంబ వ్యవస్థనే జగన్ అగౌరవపరుస్తున్నాడు. భారత కుటుంబ వ్యవస్థను ప్రపంచమంతా గౌరవిస్తుంటే.. ఆస్తి కోసం జగన్ విలువలకు తిలోదకాలిస్తున్నాడు. కొడుకు చేష్టలను చూసి తల్లి ప్రాణభయంతో పారిపోయిందని ప్రజలు అనుకుంటున్నారు' అని అన్నారు.

దర్యాప్తు పక్కదారి పట్టించేలా.. సీఐడీ కస్టడీలో చైతన్య సమాధానాలు

» అధికారుల ప్రశ్నలకు తెలివిగా సమాధానాలు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యను సీఐడీ అధికారులు విచారించారు. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న చైతన్యను మూడు రోజుల కస్టడీలో భాగంగా సీఐడీ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఆయన న్యాయవాది సమక్షంలో సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, సీఐలు విచారించారు. ఎన్ని రకాల ప్రశ్నలు అడిగినా దర్యాప్తును పక్కదారి పట్టించేలా చైతన్య సమాధానాలు చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి గుంటూరు నగరం నుంచి పెద్ద సంఖ్యలో అప్పిరెడ్డి అనుచరులను, ఆయన వర్గీయులను సమీకరించడంలో పానుగంటి చైతన్య కీలకంగా వ్యవహరించినట్లు ఇప్పటికే పోలీసు అధికారుల విచారణలో తేలింది. అయినప్పటికీ టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో అప్పిరెడ్డి ప్రమేయం లేదని, తనను వైసీపీ నాయకుడు నూనె ఉమామహేశ్వర రెడ్డి తీసుకువెళ్లారని సీఐడీ అధికారుల విచారణలో పానుగంటి చైతన్య చెప్పారు. 'పని ఉంది.. బయటకు వెళ్లి వద్దామని నన్ను, నా అనుచరులను ఉమామహేశ్వరరెడ్డి కారులో ఎక్కించుకొని తీసుకువెళ్లారు. ఆ సమయంలో కూడా టీడీపీ కార్యాలయంపై దాడి చేయబోతున్నట్లు నాకు చెప్పలేదు' అని చైతన్య అధికారులకు చెప్పారు. టీడీపీ కార్యాలయం వద్దకు వెళ్లిన తర్వాతే దాడి చేయాలని చెప్పినట్లు తెలిపారు. దాడికి తాను ఎవరిని తీసుకువెళ్లలేదన్నారు.

పోలీస్ కస్టడీకి రౌడీషీటర్ బోరుగడ్డ

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో బూతులు, బెదిరింపులతో రెచ్చిపోయిన వైసీపీ రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీస్ కస్టడీకి ఇస్తూ గుంటూరులోని 5వ అదనపు మున్సిఫ్ కోర్టు ఆదేశాలిచ్చింది. శనివారం మధ్యాహ్నం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు కస్టడీకి అనుమతించింది. ప్రస్తుతం బోరుగడ్డ అనిల్ రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అరండల్‌పేట పోలీసులు శనివారం అనిల్‌ను కస్టడీలోకి తీసుకుంటారు. ఇదిలా వుంటే, అనిల్ వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరినే దానిపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. పోలీస్ కస్టడీలో బోరుగడ్డ అనిల్ నోరు విప్పుతారా? వాస్తవాలు చెబుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తమ విచారణలో అనిల్‌కు ఉన్న బ్యాంకు ఖాతాలు, బినామీ లావాదేవీల గుట్టు తేల్చనున్నారు.

నాన్న ఆదేశించారు.. అమ్మ వెయ్యిసార్లు చెప్పింది

అవన్నీ కుటుంబ ఆస్తులే

(మొదటి పేజీ తరువాయి)

రావాల్సిన ఒక్క ఆస్తి కూడా తన చేతుల్లో లేదని తెలిపారు. వైఎస్ కుటుంబ కంపెనీల్లోని వాటాలను పంచుకోవడం వల్ల జగన్ బెయిల్‌కు వచ్చిన ముప్పేం లేదని, అది రద్దయ్యే అవకాశం ఉండబోదన్నారు. ఇంకా షర్మిల ఏమన్నారంటే..



నాన్నపై అమ్మ రాసిన పుస్తకంలో...

"మా నాన్న గురించి అమ్మ ఒక పుస్తకం రాసింది. అందులో.. రాజశేఖరరెడ్డికి లోకమంతా ఒక ఎత్తయితే .. షర్మిల ఒక ఎత్తు అంటూ రాశారు. ఆడపిల్లను అని నన్ను ఆయన ఎన్నడూ చిన్నచూపు చూడలేదు. ఆయన బతికున్నంతకాలం తనకు మనవడు, మనమరాళ్లు సమానమేనని చెప్పేవారు, వ్యాపారాలన్నింటినీ నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టడం జగన్ బాధ్యత. ఇది మా నాన్న ఆదేశం. ఇది వైఎస్ కుటుంబ సభ్యులందరికీ స్పష్టంగా తెలిసిన విషయమే. వైఎస్ అభిమతం ఆయన బిడ్డలుగా నాకు, జగన్‌తోపాటు భారతీ రెడ్డి, మనవడు, మనుమరాళ్లు, వైఎస్ స్నేహితులు కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డికి కూడా తెలుసు. సండూర్ విన హా .. సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ... ఏవైనా నలుగురి బిడ్డలకూ సమానమే. నాన్న బతికి ఉండగా ఏ ఒక్క ఆస్తి పంపకమూ జరగలేదు. ఈరోజుకూ ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదు"

జగన్ ఆస్తిని అడిగాననడం అబద్ధం..

"జగన్ ఆస్తుల్లో వాటా అడుగుతున్నాననేది హాస్యాస్పదం. అవాస్తవం. ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులు కావడం వల్లే వాటి గురించి ఇప్పటిదాకా మాట్లాడలేదు. నాకు వ్యక్తిగతంగా ఈ ఆస్తులపై మోజులేదు. జగన్ పెట్టిన హింసలకు ఆస్తులు కావాలన్న కోరిక నాకు లేకుండా పోయింది. నాన్న అభిమతం ఒక్కటే నాకు, అమ్మకు ముఖ్యం. దానికోసమే మేం తపన పడుతున్నాం. ఇప్పటికీ అమ్మ వెయ్యిసార్లు వీళ్లను (జగన్, భారతీ) అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా నా బిడ్డలకు చెందాల్సిన ఆస్తుల్లో ఒక్కటి కూడా జగన్ ఇవ్వలేదు"

ఆ 200 కోట్లు డివిడెండ్.. ప్రేమ, మమకారం కాదు..

కొత్త పార్టీ పెట్టి అధికారంలోకి రావడానికి ముందు పదేళ్లు జగన్ ఇబ్బందులు పడుతుంటే, ఆ ఇబ్బందులు నావిగా భావించా. తోడబుట్టినవాడికోసం నా బిడ్డలను సైతం పక్కనపెట్టి జగన్‌నూ .. వైసీపీనీ నా భుజాలపై మోశాను. ఆపదేళ్లపాటు నా అవసరం ఉందనుకున్నారో ఏమో బాగానే చూసుకున్నారు. జగన్ నన్ను తన పెద్ద కూతురునని ప్రకటించారు. మా నాన్న కోరుకున్నట్టే... నా పిల్లలను, తమ పిల్లలను జగన్ ఒకేలా చూశారు. షర్మిలకు ఇచ్చానని జగన్ చెబుతున్న రూ.200 కోట్లు ఈ కాలంలోనే నాకు ఇచ్చారు. అదీ డివిడెండ్‌గానే. వ్యాపారాల్లో నా బిడ్డలకు సమాన వాటా ఉన్నదని గుర్తించి... కంపెనీల్లోని డివిడెండ్‌లో సగంవాటా నాకు ఇచ్చారు. ఇందులో ప్రేమ, మమకారం ఏమీ లేవు. అప్పుగా దానిని చూపించమని చెప్పారు'

బెజవాడకు పిలిపించి... చెప్పింది ఇదీ..

"అయితే...2019లో జగన్ సీఎం అయ్యాక గుర్తు పట్టలేనంతగా మారిపోయారు. నన్ను చిన్నచూపు చూడటమే కాకుండా .. సీఎం అయిన నెల రోజులకే 'విడిపోదాం' అని ఇజ్రాయెల్ పర్యటనలో ప్రతిపాదన పెట్టారు. ఈ ప్రతిపాదనను నేను, అమ్మ తిరస్కరించాం. ససేమిరా విడిపోవాల్సిందేనని జగన్ పట్టుబట్టి, ఆస్తుల పంపకంకోసం విజయవాడ రావాలని పిలిచారు. వచ్చాక భారతీ సిమెంట్స్, సాక్షిలో 60%వాటా కావాలని పట్టుబట్టారు. నాకు వాటిలో 40 శాతం ఇస్తానన్నారు. ఈ ప్రతిపాదన అమ్మకు, నాకు నచ్చలేదు. ఏకంగా 20% ఎక్కువ కావాలంటే ఎలా అని జగన్‌ను అమ్మ ప్రశ్నించారు. ఈ ప్రతిపాదన అన్యాయంగా ఉన్నదన్నారు. అయితే.. అమ్మ మాటను బుల్డోజ్ చేసి .. సాక్షిలో 40%.. భారతీ సిమెంట్స్‌లో వాళ్లకు చెందిన 49 శాతంలో 40శాతం, సరస్వతి పవర్‌లో 100శాతం, యలహంక ప్రాపర్టీలో 100 శాతం, వైఎస్ నివాసమున్న ఇల్లు, ఇంకా కొన్ని ఆస్తులు... నా భాగం కింద చూపించారు. తదనుగుణంగా ఆ తర్వాత కొద్ది వారాల్లోనే ఎంఓయూ తయారైంది. సరస్వతి సిమెంట్స్ వాటాలు, యలహంక ప్రాపర్టీ ఈడీ అటాచ్‌మెంట్‌లో లేవు కాబట్టి, అవి వెంటనే రాసిస్తామని .. విగతా ఆస్తులు కేసుల వ్యవహారం తేలాక బదిలీ చేస్తామని ఆ ఎంవోయూలో పేర్కొన్నారు. ఇదంతా నా ఆస్తిని నాకు ఇవ్వడానికి జరిపిన ప్రక్రియ.. అంతే. ప్రేమాభిమానాలతో జరిపిన కేటాయింపులు ఏమాత్రం కావు"

గత ఐదేళ్లూ నాపై వేధింపులే..

బాబాయ్ ఫొటోలు జగన్ పత్రికలో అసభ్యంగా ప్రచురించేవారు

వైఎస్ అభిమానులకు రాసిన లేఖలో బయటపెట్టిన షర్మిల

ఓటమి తర్వాత సెటిల్‌మెంట్‌కు బంధువులను పంపారు

అక్షరసత్యమని తేలిన 'ఆంధ్రజ్యోతి' 'రాయబారం' కథనం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జగన్ సీఎంగా ఉన్న గత ఐదేళ్లు తనను అన్ని విధాలా వేధింపులకు గురి చేశారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ అభిమానులకు రాసిన లేఖలో అప్పటి విషయాలు ఆమె పంచుకున్నారు. "2019లో నేను రాజకీయాల్లో అడుగుపెట్టాను. మొదట తెలంగాణలో, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించాను. అప్పటినుంచి, గత ఐదేళ్లు తన పత్రిక, వైసీపీ మూకల ద్వారా నాపై జగన్ దుష్ప్రచారం సాగించారు. పెళ్లయినదానినన్న ఇంగితం కూడా లేకుండా వ్యక్తిత్వ హననానికి ఒడిగట్టారు. మా బాబాయ్ వివేకానందరెడ్డిపైనా తన పత్రికలో అసభ్యంగా ఫొటోలను ప్రచురించారు. రాష్ట్రంలో వైసీపీ పరాజయం పాలయిన తర్వాత.. జగన్ నా వద్దకు కొంతమంది బంధువులను రాయబారం కోసం పంపించారు. వివాదాలు వద్దు.. సామరస్యంగా ఆస్తి వివాదాలు పరిష్కరించుకుందామని వారి ద్వారా జగన్ చెప్పి పంపించారు. (సరిగ్గా ఇదే విషయాన్ని 'షర్మిలతో రాయబేరం' అనే పేరిట సోమవారం సంచికలో ప్రచురించిన కథనంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది) అయితే, ఈ రాయబారంలో జగన్ ఒక షరతు పెట్టారు. భవిష్యత్తులో జగన్, భారతి, అవినాశ్‌రెడ్డిపై నేను రాజకీయ విమర్శలు చేయరాదని ఆంక్షలు పెట్టారు. ఇది నా వృత్తి ధర్మానికి విరుద్ధం. అందువల్ల సెటిల్‌మెంట్‌కు ఒప్పుకోలేదు. దీంతో నాపై మరింత వేధింపులను సాగించారు. అందులోభాగంగా... ఎన్‌సీఎల్‌టీ ట్రైబ్యునల్‌లో నాపై, అమ్మపై జగన్ కేసు పెట్టారు. కానీ, ఆ విషయం నేను ఇప్పటిదాకా బయటపెట్టలేదు. అవసరమైతే బైబిల్ మీద కూడా ప్రమాణం చేయమన్నా చేస్తా. తెలుగు దేశం ట్విట్టర్ హ్యాండిల్‌లో ఈ విషయం వెలుగు చూస్తే... దానికి నేనెలా బాధ్యురాలిని అవుతాను?" అని షర్మిల ప్రశ్నించారు.

జగన్ బెయిల్‌కు వచ్చిన ముప్పేం లేదు

"సొంత చెల్లి, తల్లిపై కేసువేసి రోడ్డు మీదకు లాగిన అపకీర్తిని జగన్ మూటగట్టుకున్నారు. దానినుంచి బయటపడటం కోసం బెయిల్ రద్దు అంశం తెరపైకి తెచ్చారు. కానీ, షేర్లు బదలాయింపు జరగాల్సిన సరస్వతి కంపెనీ ఈడీ అటాచ్‌లో లేదు. అందువల్ల ఆయన బెయిల్‌కు వచ్చిన ముప్పేం లేదు. కుటుంబ, స్నేహ బంధంతో మనుషులు ఒక్కటవుతారు. కానీ వైఎస్ బంధం అనేది మనల్ని(వైఎస్ అభిమానులను ఉద్దేశించి) ఏకంచేసింది అందువల్లే ప్రతి బంధువుకూ వాస్తవాలు తెలియాలని బహిరంగ లేఖ రాస్తున్నా. తప్పుగా అర్థం చేసుకోవద్దు" అని షర్మిల కోరారు.

'సరస్వతి పవర్'లో ప్రభుత్వ భూములున్నాయా?

» సమగ్ర నివేదిక కోరిన ఉపముఖ్యమంత్రి



అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో జగన్ కుటుంబానికి చెందిన సరస్వతి పవర్ సంస్థ భూముల్లో అటవీ భూములు ఏమైనా ఉన్నాయా అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా తీశారు. అటవీ భూములుంటే.. ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో నివేదిక ఇవ్వాలని శుక్రవారం ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సరస్వతి పవర్‌కు 1,515.93 ఎకరాల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ అంశంపై వారితో ఆయన చర్చించారు. వాటిలో ప్రభుత్వ, అటవీ భూములు, జలవనరులు ఏ మేరకు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. దీంతో పాటు పర్యావరణ అనుమతులు ఎలా పొందారో తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించారు. ఈ అంశాలపై అటవీ, రెవెన్యూ, పీసీబీ తదితర శాఖల ఉన్నతాధికారులతో త్వరలో సమీక్షించాలని పవన్ నిర్ణయించారు.

మరణానికి ముందే వైఎస్ ఆస్తులు పంచారు

» జగన్ కంపెనీలో షర్మిల షేర్ హోల్డర్‌గా లేరు: పేర్ని, వైవీ

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించక ముందే ఆయన పిల్లలకు ఆస్తులు పంచారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య వెల్లడించారు. శుక్రవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ బతికుండగానే జగన్‌కు, షర్మిలకు ఎవరికి ఇచ్చే ఆస్తులను వారికి సవివరంగా రాసిచ్చారని తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం.2 లోని 280 గజాల స్థలం, ఇడుపులపాయలో 51 ఎకరాల పొలం, 15మెగావాట్ల ఎస్ఆర్ఎస్ హైడ్రో పవర్, స్మాల్ హైడ్రో ప్రాజెక్టు లైసెన్సులు, స్వాతి పవర్ హైడ్రో ప్రాజెక్టులో వాటాలు, విజయవాడ రాజ్ యువరాజ్ థియేటర్‌లో 35శాతం వాటా, పులివెందులలో 7.6ఎకరాలు, విజయలక్ష్మి మినరల్స్ ట్రేడింగ్ కంపెనీని జగన్‌కు ఇచ్చారని వివరించారు. భారతీ సిమెంట్స్, సాక్షి, సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ అన్నీ జగన్ సొంతమన్నారు. సరస్వతి భూములు రైతుల నుంచి జగన్ కొనుగోలు చేశారని పేర్కొన్నారు. 2010లో జగన్ పార్టీ ఏర్పాటు చేశాక టీడీపీ, కాంగ్రెస్ కూడబలుక్కొని సీబీఐ విచారణ కోరాయని, విచారణలో భాగంగా జగన్ ఆస్తులన్నింటినీ ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు. 2019 ఎన్నికల తర్వాత ఆగస్టులో ఈడీ జప్తు చేసిన ఆస్తులన్నింటినీ చెల్లెలు షర్మిలకు జగన్ రాసిచ్చారని తెలిపారు. వైఎస్ బతికున్నప్పుడు చెప్పి ఉంటే కంపెనీల్లో వాటాలను షర్మిలకు జగన్ ఇచ్చి ఉండేవారని, జగన్ పెట్టిన కంపెనీలో షర్మిల షేర్ హోల్డర్‌గా లేరని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

టీచర్ల బదిలీలకు చట్టం!

▸▸ డిసెంబరు నాటికి అమల్లోకి.. ఉపాధ్యాయ సంఘాలు ఓకే

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు ప్రత్యేక చట్టం రూపొందించాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. ఈ అంశంపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు స్వీకరించింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అంశాలపై ఆ శాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు శుక్రవారం సంఘాలతో చర్చలు నిర్వహించారు. ప్రధానంగా టీచర్ల బదిలీలకు చట్టం తేవాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. దీంతో డిసెంబరు నాటికి ఈ చట్టాన్ని అమల్లోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో సంబంధం లేకుండా చట్ట ప్రకారం నిర్దేశిత కాలంలో బదిలీలు జరిగేలా చూడాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. అయితే, ఎన్నేళ్లకు బదిలీలు జరగాలి? ఎంతకాలం పనిచేసిన టీచర్లకు తప్పనిసరి బదిలీ ఉండాలి? ఇతరత్రా అంశాలపై ప్రభుత్వ స్థాయిలో తుది నిర్ణయం జరగాల్సి ఉంది. అలాగే, పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని సంఘాలు కోరగా డైరెక్టర్ అంగీకరించారు. చర్చల్లో యూటీఎఫ్ నుంచి ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్టీయూ నుంచి సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి, ఏపీటీఎఫ్-257 నుంచి సీహెచ్ మంజుల, కె. భానుమూర్తి, ఏపీటీఎఫ్-1938 నుంచి జి. హృదయరాజు, రవీంద్ర ప్రసాద్, ఆప్టా నుంచి ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

26 జిల్లాల్లోనూ డీఎస్సీ కోచింగ్ సెంటర్లు

▸▸ బీసీ పథకాలకు నిధుల కొరత లేదు: మంత్రి సవిత

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. బీసీ సంక్షేమ పథకాలకు నిధుల కొరత రానీయం' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. అమరావతిలోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. బీసీ భవనాలు, కాపు భవనాల ప్రగతితో పాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలపైనా చర్చించారు. మంత్రి మాట్లాడుతూ... 'ఎన్నికల్లో బీసీల అభ్యున్నతికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. సీడ్ పథకంతో సంచార జాతులకు ఎంతో మేలు కలుగుతుంది. బీసీ హాస్టళ్లలో డైట్ బిల్లు కొంత మేర చెల్లించాలి. మిగిలిన బకాయిలను త్వరలోనే చెల్లిస్తాం. త్వరలో జరగబోయే డీఎస్సీ పరీక్షకు 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నా. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అన్ని ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇస్తాం. రాబోయే ఐదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వమిచ్చే అన్ని పథకాలనూ వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం' అని మంత్రి అన్నారు.

సంక్రాంతి లోపు సీసీ రోడ్లు పూర్తి చేయాలి

▸▸ అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో సందర్భంగా అక్టోబర్ 14- 20 తేదీల్లో 13,326 గ్రామ పంచాయతీల్లో భూమి పూజ చేసిన ఉపాధి హామీ పనులన్నింటినీ సంక్రాంతి పండుగ లోపే పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు వేగవంతంగా జరగడానికి అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని తద్వారా గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చాలని పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద మొదలు పెట్టిన సీసీరోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు తదితర పనులను పూర్తి చేయాలని సూచించారు.

నేడు టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు లాంఛనంగా ప్రారంభిస్తారు. రూ.లక్ష చెల్లించిన వారికి టీడీపీ నుంచి శాశ్వత సభ్యత్వం అందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు రికార్డు స్థాయిలో నిర్వహించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ సూచించారు. కేవలం రూ.100తో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా రూ.5 లక్షలు అమలు కానుంది. కాగా, అండమాన్ నికోబార్ దీవుల్లో ఉండే తెలుగు వారంతా టీడీపీలో చేరాలని అక్కడి టీడీపీ అధ్యక్షుడు నక్కల మాణిక్యరావు యాదవ్ కోరారు. విజయపురంలో ని ఆంధ్రా అసోసియేషన్ హాలులో సభ్యత్వ నమోదును చేపట్టనున్నారు.



చినముషిడివాడలోని శారదా పీఠం



గెడ్డపై నిర్మించిన ఆలయ గోపురం.. గెడ్డ నీరు పోవడానికి వేసిన పైపులైన్

అక్రమాల 'స్వరూపం'

▸▸ ప్రభుత్వ భూమిలో శారదా పీఠం

▸▸ విశాఖలో గెడ్డ ఆక్రమణ

▸▸ 20 సెంట్లు పూడ్చి, పైన ఆలయాలు, గోపురాలు

▸▸ ప్రజా స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు

▸▸ ఆక్రమణను నిర్ధారించిన తహశీల్దార్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం శారదా పీఠం పునాదులు కదులుతున్నాయి. మాజీ సీఎం జగన్ గురువు స్వరూపానంద పీఠం పేరుతో చేసిన లీలలు బయటకు వస్తున్నాయి. గత జగన్ ప్రభుత్వం భీమిలి దగ్గర శారదా పీఠానికి రూ.225 కోట్ల విలువైన భూమిని అప్పనంగా 15 లక్షలకే కేటాయింపు.. తిరుమలలో పీఠం ఆక్రమించిన 20 వేల చదరపు అడుగుల స్థలాన్ని క్రమబద్ధీకరణ చేయగా.. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ రెండింటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా విశాఖపట్నం శివారు చినముషిడివాడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి శారదా పీఠం నిర్మించారనే విషయం వెలుగులోకి వచ్చింది. పక్కనే ఉన్న గెడ్డను ఆక్రమించారని గతంలో ఆరోపణలు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ జరుగుతున్నదని బయట పడినప్పుడు సనాతన ధర్మంపై పెద్ద చర్చ జరిగింది. ఇదే అంశంపై చర్చించడానికి పీఠానికి వస్తామని పలువురు కోరగా ఆయన తిరస్కరించారు. దాంతో శారదా పీఠం కొందరి కోసమే పనిచేస్తున్నదని ఆరోపిస్తూ విమర్శలు మొదలయ్యాయి. శారదా పీఠం నిర్మాణంలోనే అక్రమాలు ఉన్నాయని, వాటిపై విచారణ చేయాలని డిమాండ్ మొదలైంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు

చినముషిడివాడలోని శారదా పీఠం సుమారుగా 1.5 ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. అదంతా సర్వే నంబరు 90లోకి వస్తుంది. అందులో పోర్టు కాలనీ స్థలం ఎంత? ప్రభుత్వ భూమి ఎంత? అన్నది ఎప్పుడూ ఎవరూ పరిశీలించలేదు. రెండు వారాల క్రితం తెలుగుశక్తి ప్రతినిధి బీవీ రామ్ పీఠంలో ప్రభుత్వ భూమి ఎంత ఉందో సర్వే చేసి తేల్చాలని కలెక్టర్‌కు ప్రజా స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆ ఫిర్యాదు పెందుర్తి తహశీల్దార్ కార్యాలయానికి చేరింది.

ఇదీ చరిత్ర

స్వరూపానందేంద్ర అసలు పేరు ఎవరికీ తెలియదు. ఆయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని దేరశాం. విశాఖపట్నంలోని ఆట వస్తువులు అమ్మే షాపులో కొన్నాళ్లు పనిచేశారని చెబుతారు. ఆ తరువాత సన్యాసిగా చినముషిడివాడ వచ్చారు. పోర్టు కాలనీలో రామ్మూర్తి అనే ఉద్యోగి ఇంట్లో ఉండేవారు. ఇదంతా 1989-90 ప్రాంతంలో జరిగింది. ఆ తరువాత ఆ ఇంటి పక్కనే ఉన్న స్థలంలో పూజలు చేస్తూ అందరినీ ఆహ్వానించారు. తొలుత శారదా నిలయం అని చెప్పి ఆ తరువాత పీఠంగా మార్చారు. ఆ స్థలంలో గెడ్డ ఉండగా, దానిని కప్పేసి, కింది నుంచి నీరు వెళ్లేలా పైపులు వేసి, పైన ఆలయాలు, గోపురాలు కట్టేశారు. పీఠంలో ప్రస్తుతం దక్షిణామూర్తి, గురుపాదుకలు, పీఠాధిపతి నివాసం, మేడపైన చిన్నస్వామి నివాసం, వన దుర్గ, రాజ్య శ్యామల ఆలయాలు, వంటశాల, షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, దాసాంజనేయ స్వామి గుడి ఉన్నాయి. ఆశ్రయం ఇచ్చిన పోర్టు ఉద్యోగి ఏమయ్యారో తెలియదు కానీ ఆయన ఇల్లు మాత్రం పీఠంలో ఓ భాగంగా మారిపోయింది. దానికి అటు, ఇటు ఉన్న భూములు ఆక్రమించుకున్నారు.

టీఎస్ఆర్ నిధులతో...

టి.సుబ్బిరామిరెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు ఎంపీ కోటా నుంచి శారదా పీఠానికి నిధులు ఇచ్చారు. దీంతో ఆయన పేరుతో 2 అంతస్థుల భవనం నిర్మించారు. పీఠానికి ఎడమ వైపు విశాఖ పోర్టుకు సంబంధించిన మినీ ఆడిటోరియం, దాని పక్కనే కల్యాణ మండపం ఉన్నాయి. వాటిని కూ డా పీఠానికి ఇచ్చేయాలని స్వరూపానందేంద్ర చాలా ప్రయత్నాలు చేశారు. వైసీపీ హయాంలో పెం దుర్తి ప్రధాన రహదారిని అనుసంధానిస్తూ శారదా పీఠం గుండా రహదారిని విస్తరించారు.

తిరుమలలో ఆక్రమణలపై విచారణ

సీనియర్ అధికారులతో ఈవో సమీక్ష

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శారదా పీఠం స్థలం ఆక్రమించి, అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యవహారంపై విచారణకు టీటీడీ నలుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. వారం రోజుల్లోగా తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలంటూ ఈవో శ్యామలరావు ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగా శారదా పీఠం ఆక్రమణల తొలగింపుపై నిర్ణయం తీసుకోనున్నారు. టీటీడీ గతంలో కేటాయించిన 5 వేల చదరపు అడుగుల స్థలంతో పాటు అదనంగా 20 వేల చదరపు అడుగుల స్థలాన్ని ఆక్రమించడంతో పీఠం అక్రమాలు వెలుగు చూశాయి. అయితే ఈ స్థలాన్ని జగన్ ప్రభుత్వంలో నాటి టీటీడీ బోర్డు జరిమానా పేరుతో క్రమబద్ధీకరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఈ ప్రతిపాదనలు రద్దు చేస్తూ పీఠం ఆక్రమిత స్థలంలో నిర్మాణాల విషయంలో చర్యలు తీసుకోవాలని టీటీడీని ఆదేశించింది. దీంతో ఈవో శ్యామలరావు శుక్రవారం టీటీడీ సీనియర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శారదా పీఠం ఆక్రమణల పరిశీలనకు టీటీడీ లీగల్ ఆఫీసర్, చీఫ్ ఇంజనీర్, డిప్యూటీ ఈవో(పీఆర్), టౌన్ ప్లానింగ్ నిపుణులతో కలిపి ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేశారు.

సుమారు 20 సెంట్లు గెడ్డే

శారదా పీఠంలో కొన్ని నిర్మాణాలు గెడ్డపై నిర్మించిన మాట వాస్తవమేనని పెందుర్తి తహశీల్దార్ ఆనందరావు ధ్రువీకరించారు. సుమారుగా 20 సెంట్లు గెడ్డ ఉంటుందన్నారు. శారదా పీఠంపై ప్రస్తుతం పెద్ద స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఎటువంటి ఆదేశాలు రాకుండా అక్కడికి వెళ్లి సర్వే చేయలేమని శుక్రవారం మీడియాకు స్పష్టం చేశారు. అది చాలా సున్నితమైన అంశమని, మతపరమైన వివాదాలు తలెత్తే అవకాశం ఉన్నందున ఆదేశాలు వచ్చాకే ముందుకు వెళతామన్నారు.

వైసీపీ మాజీ ఎంపీ నందిగంపై మరో కేసు

▸▸ నేటి మంత్రి సత్యకుమార్‌పై నాడు దాడి

▸▸ తుళ్లూరు పీఎస్‌లో బీజేపీ నేత సురేశ్ ఫిర్యాదు

తుళ్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) బాపట్ల వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్, అతని అనుచరులు బేతపూడి రాజేంద్ర, ఐనవోలు సుధీర్, మరో 30 మందిపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు అయింది. అమరావతి ఉద్యమం జరుగుతున్న సమయంలో రాజధాని రైతుల శిబిరాల వద్దకు వచ్చి అప్పటి బీజేపీ జాతీయ కార్యదర్శి, ప్రస్తుత మంత్రి సత్యకుమార్, బీజేపీ యువజన జాతీయ కార్యదర్శి కొణెదపు సురేశ్ మద్దతు తెలిపారు. ఇది తెలుసుకున్న నందిగం సురేశ్, అతని అనుచరులు సత్యకుమార్ తిరిగి వెళుతున్న సమయంలో దాడికి పాల్పడినట్టు శుక్రవారం బీజేపీ యువజన నేత సురేశ్ తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పట్లో తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి వైసీపీ అధికారంలో ఉండటంతో చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. "ఐనవోలు సుధీర్ మరో 30 మంది సత్యకుమార్ కారుపై రాళ్లు రువ్వారు. బేతపూడి రాజేంద్ర కత్తితో సత్యకుమార్ వ్యక్తిగత కార్యదర్శి కనయ్యపై దాడి చేశారు. దీంతో ఆయనకు రక్తపు గాయాలయ్యాయి. 'ఎక్కడ నుంచో మా ఏరియాకు వచ్చి అమరావతి రైతులకు మద్దతు తెలుపుతారా? ఒకడినన్నా వేసేయండి. రెండవ వాడు ఎవడూ కన్నెత్తి చూడకూడదు' అంటూ నందిగం సురేశ్ తన అనుచరులకు పెద్ద పెద్దగా ఆదేశాలు ఇస్తూ, ఆయన స్వయంగా దాడిలో పాల్గొన్నారు. వాళ్ల కత్తులతో, రాళ్లతో చేసిన దాడిలో నేను కూడా తీవ్రంగా గాయపడ్డాను' అని కొణెదపు సురేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సురేశ్ ప్రోద్బలంతోనే రాళ్లదాడి

▸▸ హైకోర్టుకు పోలీసుల నివేదన

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ వెలగపూడిలో ఓ సామాజిక వర్గంవారితో మరో సామాజికవర్గంపై దాడి చేయించారని పోలీసులు హైకోర్టుకు వెల్లడించారు. ఆయన ప్రోద్బలంతోనే రాళ్లదాడి జరిగిందన్నారు. సాక్షులు కూడా వాంగ్మూలం ఇచ్చారని వారి తరఫు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శుక్రవారం నివేదించారు. ఘటనకు ముందు ఓ సామాజిక వర్గంవారితో సమావేశం నిర్వహించి దాడికి ప్రణాళిక రచించారని.. వారికి మద్యం, డబ్బు సమకూర్చారని తెలిపారు. సురేశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్(ఏజీ) వాదనలు వినిపిస్తారని, విచారణను వాయిదా వేయాలని అభ్యర్థించారు. అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను సోమవారాని(28వ తేదీ)కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన మరియమ్మ 2020 డిసెంబరు 27న హత్యకు గురయ్యారు. ఆమె కుమారుడి ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సురేశ్‌ను 78వ నిందితుడిగా చేర్చారు.

సజ్జలకు మరో 4 వారాలు ఊరట

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తొందరపాటు చర్యలు వద్దని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మరో 4 వారాలు పొడిగించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు.

ఎల్లుండి కొత్త న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన కుంచం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్ సోమవారం ప్రమాణం చేయనున్నారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఉదయం 10.15కి వీరితో ప్రమాణం చేయించనున్నారు. కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్‌లు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు హాజరుకానున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.